www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 15-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 16 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి మ. 12.12 తదుపరి అష్టమి; నక్షత్రం: పునర్వసు తె. 3.05 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ.2.20-4.02; దుర్ముహూర్తం: మ.12.40-1.29, మ.3.09-3.58; అమృతఘడియలు: రా.12.32-2.14; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.27

చంద్రబాబుపై రాయి దాడి

- బారికేడుకు తగిలి కిందపడిన రాయి.. గాజువాక సభలో తప్పిన ప్రమాదం
- అప్రమత్తమైన భద్రతా సిబ్బంది.. ఆగంతకుల కోసం పోలీసుల గాలింపు
- క్లైమోర్ మైన్స్ దాడికే భయపడలేదు.. రాళ్లకు భయపడతానా?
- జగన్‌పై ఎవరో గులకరాయి వేస్తే నాపై రాళ్లు వేయిస్తారా?
- సీఎస్, ఇంటెలిజెన్స్, డీజీపీ ఏం చేస్తున్నారు: టీడీపీ అధినేత చంద్రబాబు
- పవన్ ర్యాలీలోనూ రాయి కలకలం.. యువకుడిని కొట్టి పోలీసులకు అప్పగించిన జనసైనికులు

12

శత్రు క్షిపణులపై ఇజ్రాయెల్

బ్రహ్మాస్త్రం.. యారో

ప్రపంచంలోనే తొలి యాంటీ టాక్టికల్ బాలిస్టిక్ మిసైల్ రక్షణ వ్యవస్థ

2400 కి.మీ. నుంచి దూసుకొచ్చే క్షిపణులకు మార్గమధ్యంలోనే చెక్

యారో సాయంతోనే ఇరాన్ క్షిపణుల కూల్చివేత

2



ఇరాన్ క్షిపణులను అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ ప్రయోగించిన ఇంటర్‌సెప్టర్ మిసైల్స్

క్షిపణుల వర్షం

ముందుగా హెచ్చరించినట్లే ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి

- బాలిస్టిక్, క్రూయిజ్ మిసైల్స్, కామికేజ్ సూసైడ్ డ్రోన్ల ప్రయోగం
- దీటుగా ఎదుర్కొన్న ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- సహకరించిన అమెరికా రక్షణ వ్యవస్థలు
- 100 శాతం డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణుల కూల్చివేత
- 120 బాలిస్టిక్ క్షిపణుల్లో ఇజ్రాయెల్‌ను తాకింది 17 మాత్రమే
- 10 ఏళ్ల బాలికకు తీవ్ర గాయాలు.. ఐడీఎఫ్ స్థావరం ధ్వంసం
- ప్రతీకారం తప్పదు: ఇజ్రాయెల్.. రక్షణగా ఉంటాం: బైడెన్
- అమెరికా పాల్గొంటే ఇరాన్‌కు అండగా ఉంటాం: రష్యా
- అమెరికా కల్పించుకుంటే దాడులను తీవ్రం చేస్తామన్న ఇరాన్
- ఇరాన్ దాడిని ఖండించిన ఐరాస, పలు దేశాలు
- ఆపరేషన్ ముగిసింది.. ప్రతిదాడి చేస్తే విజృంభిస్తాం: ఇరాన్
- పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామన్న భారత్

టెహ్రాన్/టెల్‌అవీవ్, ఏప్రిల్ 14: ప్రపంచంలోనే అతిపెద్ద మిలటరీ శక్తుల్లో 14వ స్థానంలో ఉన్న ఇరాన్ అన్నంత పని చేసింది. ఈ నెల 1న సిరియా రాజధాని డమాస్కస్‌లో ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లో తమ ఆర్మీ కమాండర్, మరో 12 మంది అధికారుల మృతితో ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్.. శనివారం రాత్రి 11 గంటల సమయంలో(భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు) ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, సూసైడ్ డ్రోన్లతో విరుచుకుపడింది. గత ఏడాది అక్టోబరు 7న హమాస్‌తో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి లెబనాన్ భూభాగం నుంచి దాడులు చేస్తున్న హిజ్బుల్లా ఉగ్రవాదులు కూడా శనివారం రాత్రి ఇజ్రాయెల్ ఉత్తరాదిపై శతఘ్నులు, క్షిపణులను ప్రయోగించారు. దీంతో పశ్చిమాసియాపై ఒక్కసారిగా యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ మేరకు.. ఇజ్రాయెల్‌పై 185 కామికేజ్ డ్రోన్లు, 120 బాలిస్టిక్ క్షిపణులు, 36 క్రూయిజ్ క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) కూడా ఆదివారం తన అధికారిక టెలిగ్రామ్ చానల్‌లో ఈ విషయాన్ని

మిగతా 2వ పేజీలో...

మాజీ సీఎండీలకు నోటీసులు

- ప్రభాకర్‌రావు, వెంకటనారాయణ, రఘుమారెడ్డి, గోపాల్‌రావుకు జారీ
- విద్యుత్తు సంస్థల ప్రస్తుత, మాజీ డైరెక్టర్లు, సీఈలకు కూడా..
- ఇంధన శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్‌కూ నోటీసులు!
- ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు, యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్ణయాల్లో పాత్రపై వివరణ
- కోరిన జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్
- అధికారుల వంతు ముగిశాక ప్రజాప్రతినిధులకూ పిలుపు
- కేసీఆర్, జగదీశ్‌రెడ్డికీ ఇచ్చే అవకాశం
- సంబంధిత వ్యక్తుల అభిప్రాయ సేకరణకు నేడు బహిరంగ ప్రకటన

'విద్యుత్తు నిర్ణయాల'పై విచారణ వేగిరం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్కేంద్రాల నిర్మాణంతో పాటు ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందంపై నిర్ణయాల్లో భాగస్వాములైన ప్రస్తుత, మాజీ అధికారులకు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ ఆదివారం నోటీసులు జారీ చేసింది. ఆ నిర్ణయాల్లో వారి పాత్రపై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, అభిప్రాయాలను తెలియజేయాలని కోరింది. కాంపిటీటివ్ బిడ్డింగ్‌కు బదులుగా నామినేషన్ల ప్రాతిపదికన.. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్కేంద్రాల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం, ఛత్తీస్‌గఢ్ డిస్కంల నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల రాష్ట్ర ఖజానాకు జరిగిన నష్టంపై న్యాయ విచారణ జరపడానికి.. పాట్నా హైకోర్టు రిటైర్డ్ సీజే ఎల్.నరసింహారెడ్డిని 'కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ'గా నియమిస్తూ

మిగతా 13వ పేజీలో...



కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థులు, ఇన్‌చార్జులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేసీ వేణుగోపాల్. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

మిషన్ 15!

రాష్ట్రంలో కనీసం గెలవాల్సిన ఎంపీ సీట్లు

- బీఆర్ఎస్ పనైపోయింది.. ఇక బీజేపీనే టార్గెట్ చేయండి!
- కాంగ్రెస్‌లో చేరికలపై దృష్టి పెట్టండి.. ఎవరు చేరతామన్నా అభ్యంతరం చెప్పొద్దు
- ఉత్తరాదిన బీజేపీ బలహీనపడింది.. దక్షిణాదిలో కట్టడి చేస్తే 'కూటమి'దే అధికారం
- నియోజకవర్గాల్లోనే ఉండి పనిచేయండి.. మా వద్ద అందరి ప్రోగ్రెస్ రిపోర్టులు
- కాంగ్రెస్ అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో సమావేశంలో కేసీ వేణుగోపాల్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని మట్టుబెట్టామని, ఆ పార్టీ పని అయిపోయిందని ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. ఇక వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మట్టుబెట్టాల్సిన అవసరం ఉందని, ఎన్నికల ప్రచారంలో బీజేపీనే టార్గెట్ చేసుకుని పని చేయాలని కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థులు, నేతలకు సూచించారు. ఎన్నికలు జరిగే వరకూ నియోజకవర్గాల్లోనే ఉండి పని చేయాలని, కాంగ్రెస్‌లో చేరడానికి వచ్చేవారిని అభ్యంతరాలు పెట్టకుండా చేర్చుకోవాలని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌కు వచ్చిన కేసీ వేణుగోపాల్.. శంషాబాద్‌లోని ఓ హోటల్‌లో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మంత్రులతో భేటీ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

మిగతా 13వ పేజీలో...

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్

కట్టుబడి ఉంది

- భవిష్యత్తులో మాదిగ నేతలకు నామినేటెడ్ పోస్టులు
- తనను కలిసిన నేతలకు సీఎం హామీ
- బీజేపీ మ్యానిఫెస్టో.. చెల్లని పోస్ట్ డేటెడ్ చెక్ అని వ్యాఖ్య
- నేడు నారాయణపేటలో 'జనజాతర'

కవితను కాపాడుకునేందుకు బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు: సురేఖ

13



బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న మోదీ. చిత్రంలో షా, రాజ్‌నాథ్, నడ్డా, నిర్మల

దక్షిణ భారత్‌కూ బుల్లెట్ రైలు

- తూర్పు, ఉత్తర ప్రాంతాలకు కూడా.. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నిర్వహిస్తాం
- ఇంటింటికీ నీరు, పైప్‌లైన్‌తో గ్యాస్.. మధ్య తరగతికి 3 కోట్ల పక్కా ఇళ్లు
- అన్నదాతలందరికీ డ్రోన్లు.. 70 దాటినవారికి 5 లక్షల ఉచిత వైద్యం
- 'ముద్ర' పరిమితి.. రూ.20 లక్షలకు!.. గిగ్ వర్కర్లకూ సంక్షేమ పథకాలు
- ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం.. మరో ఐదేళ్లు ఉచిత రేషన్ అందిస్తాం
- దేశవ్యాప్తంగా వందే భారత్ విస్తరణ.. ప్రశ్నపత్రాల లీకేజీపై కఠిన చట్టం
- 'మోదీ గ్యారెంటీ' పేరిట బీజేపీ మ్యానిఫెస్టో.. విడుదల చేసిన మోదీ
- మోదీ ప్రసంగంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం ప్రస్తావనేది?: రాహుల్


14

అప్పులు తక్కువ.. చెల్లింపులు ఎక్కువ!

4 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ కొత్త రుణం రూ.17,618 కోట్లు

వడ్డీలు, వాయిదాలకు రూ.25,911 కోట్ల చెల్లింపులు

ఆర్థిక క్రమశిక్షణకు సర్కారు పెద్దపీట



హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడానికి రేవంత్‌రెడ్డి సర్కారు ప్రయత్నిస్తోంది. అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దేందుకు చర్యలు చేపడుతోంది. గత ప్రభుత్వం చేసిన అప్పులతో పాటు వడ్డీలను చెల్లించేందుకు ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తోంది. దుబారా లేకుండా ప్రతి పైసాకు జవాబుదారీ ఉండేలా ఖర్చులను నియంత్రిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో సుమారు రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసింది. వాటికి చెల్లించే

మిగతా 3వ పేజీలో...

నిర్మాత నవీన్ ఎర్నేనిపై కేసు

- మరికొందరిపైనా..
- 'హెల్త్‌కేర్' యజమాని కిడ్నాప్, షేర్ల బదిలీ వివాదంలోనే..



నవీన్ (ఫైల్)

3

బెయిల్ వస్తది.. ధైర్యంగా ఉండు!

- కవితను ఓదార్చిన కేటీఆర్
- సీబీఐ కస్టడీలో వసతులపై ఆరా
- ముగిసిన సీబీఐ కస్టడీ.. నేడు కోర్టుకు

3

నానమ్మను పొడిచాడు

- 13 ఏళ్ల బాలుడి ఘాతుకం
- తల్లితో తరచూ గొడవ పడుతోందనే..
- ఛాతీలో తీవ్రగాయం.. రక్తస్రావం
- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి
- జనగామ జిల్లాలో ఘటన

14



రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద ఎంపీఏటీజీఎం పరీక్షలు

యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ పరీక్షలు విజయవంతం

మనిషి మోసుకెళ్లగలిగేలా రూపొందించిన డీఆర్‌డీవో

2



ఫెయిర్‌నెస్ క్రీమ్‌లతో కిడ్నీలకు హాని

- వాటిలోని పాదరసంతో దుష్ప్రభావం
- దేశంలో పెరుగుతున్న కిడ్నీ సమస్యలు
- తాజా అధ్యయనంలో వెల్లడి

2

టవర్ లేకున్నా మొబైల్ కమ్యూనికేషన్!

- శాటిలైట్ కనెక్టివిటీతో స్మార్ట్ ఫోన్లు
- చైనా విప్లవాత్మక ఆవిష్కరణ

దాడికి మేమూ సిద్ధం: నెతన్యాహు



ఇరాన్ దాడిపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అత్యవసర క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో సింహభాగం మంత్రులు ఇరాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం నెతన్యాహు మీడియాతో మాట్లాడారు. తాము ఆత్మరక్షణ(డిఫెన్స్), దాడి(అఫెన్స్)కు సర్వసన్నద్ధంగా ఉన్నామన్నారు. "ఆత్మరక్షణ కోసం మేము ప్రత్యేక వ్యవస్థను రూపొందించుకున్నాం. ఆత్మరక్షణకు ఎంతలా సిద్ధంగా ఉన్నామో.. దాడులకు కూడా అంతే సర్వసన్నద్ధంగా ఉన్నాం" అని వ్యాఖ్యానించారు. అయితే బైడెన్ చొరవతో నెతన్యాహు ప్రతిదాడి జోలికి వెళ్లకపోవచ్చంటూ ఇజ్రాయెల్ అధికారిక వార్తాసంస్థ యెదియోత్ అహ్రోనోత్(వైనెట్) ఓ కథనాన్ని ప్రసారం చేసింది.

ఇజ్రాయెల్‌కు మా అండ: బైడెన్



ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి జరిగిన వెంటనే.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వరుస భేటీల్లో బిజీ అయ్యారు. అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ సీఐఏ, నిఘా సంస్థ, జాతీయ భద్రత తదితర విభాగాల అధికారులతో భేటీ అయ్యారు. ఆ తర్వాత జీ7 దేశాధినేతలతో భేటీకి ఏర్పాట్లు చేశారు. నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడి, ఎప్పటికప్పుడు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. "ఇజ్రాయెల్‌కు అండగా ఉంటాం. ఉక్కు పిడికిలితో ఇజ్రాయెల్‌కు రక్షణగా నిలుస్తాం" అని వ్యాఖ్యానించారు. ఇరాన్ భీకర దాడులను ఎదుర్కొని, శత్రువును ఓడించడంలో ఇజ్రాయెల్ అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శించిందని కొనియాడారు. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను కూల్చివేయడంలో సాయం చేశామన్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతును కొనసాగిస్తామని చెప్పారు.

మేం కూడా రంగంలోకి దిగుతాం: పుతిన్



ఇరాన్-ఇజ్రాయెల్ విభేదాలను పరిశీలిస్తున్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ఒకవేళ ఇజ్రాయెల్ తరఫున అమెరికా ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొంటే.. ఇరాన్ తరఫున తాము రంగంలోకి దిగుతామని హెచ్చరించారు. అదే జరిగితే.. రష్యాకు అండగా ఉత్తరకొరియా, చైనా కూడా యుద్ధంలో పాల్గొనే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే.. ఈ యుద్ధంలో అమెరికా పాల్గొనబోదని వైట్‌హౌస్ వర్గాలు చెప్పినట్లు 'రాయిటర్స్' కథనం ప్రచురించింది.

ఇజ్రాయెల్ ప్రతిస్పందిస్తే మరింత తీవ్రం: ఖమేనీ



ఇజ్రాయెల్ సిరియాలోని తమ అధికారుల భవనంపై దాడిచేసి, 13 మందిని హతమార్చడానికి శిక్షగా ఆ దేశంపై దాడి చేసినట్లు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ స్పష్టం చేశారు. తమ దాడికి ఇజ్రాయెల్ ప్రతిస్పందించి మరోమారు తప్పుచేస్తే.. పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.

క్షిపణుల వర్షం



జెరూసలెం వైపునకు దూసుకువస్తున్న ఇరాన్ క్షిపణులు

ఇరాన్ క్షిపణులను గాల్లోనే పేల్చివేస్తున్న ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధారిస్తూ.. ఇరాన్ దాడిని 99% అడ్డుకున్నట్లు ప్రకటించింది. తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు-- ఐరన్‌డోమ్, యారో డిఫెన్స్ సిస్టమ్ ఇరాన్ దాడులను సమర్థంగా ఎదుర్కొన్నట్లు పేర్కొంది. "ఇరాన్ ప్రయోగించిన 185 కామికేజ్ డ్రోన్లను 100% గాల్లోనే కూల్చేశాం. 36 క్రూయిజ్ క్షిపణులను కూడా కూల్చివేశాం. 120 బాలిస్టిక్ క్షిపణుల్లో 103 గాల్లోనే నిర్వీర్యమవ్వగా.. పదిహేడు మాత్రమే ఇజ్రాయెల్ నేలను తాకాయి" అని వివరించింది. ఈ ఘటనలో ఐడీఎఫ్‌కు చెందిన ఓ స్థావరం దెబ్బతిన్నదని, 10 ఏళ్ల ఓ బాలికకు తీవ్ర గాయాలైనట్లు పేర్కొంది.

ఇజ్రాయెల్‌కు అమెరికా, బ్రిటన్ సాయం

దాడి చేస్తామంటూ ఇరాన్ ప్రకటన చేసినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని, ఉక్కు పిడికిలితో దాడులను అడ్డుకుంటామని ప్రకటిస్తూ వచ్చారు. అమెరికా ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్స్‌ను ఎప్పటికప్పుడు ఇజ్రాయెల్‌తో షేర్ చేసుకున్నారు. శనివారం కూడా.. ఏ క్షణాన్నైనా ఇరాన్ దాడులు చేస్తుందంటూ హెచ్చరించారు. శనివారం రాత్రి జరిగిన దాడుల్లోనూ.. పలు బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లను తాము అడ్డుకున్నామని అమెరికా నౌకాదళం స్పష్టం చేసింది. "ముందు నుంచే మధ్యధరా సముద్రంలో మా యుద్ధ నౌకలను మోహరించాం. ఇరాన్ ప్రయోగించిన 70కి పైగా డ్రోన్లు, మూడు బాలిస్టిక్ క్షిపణులను మా ఇంటర్‌సెప్టర్లు కూల్చివేశాయి" అని అమెరికా నౌకాదళం అధికారులు వివరించారు. మరోవైపు బ్రిటన్ కూడా పశ్చిమాసియాలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థకు వ్యతిరేకంగా మోహరించిన తన యుద్ధ నౌకలను ఇజ్రాయెల్‌కు అండగా తరలించింది. అయితే.. శనివారం రాత్రి జరిగిన దాడిలో ఇంటర్‌సెప్టర్ సాయాన్ని ఇజ్రాయెల్‌కు అందించిందా? లేదా? అన్నదానిపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

ఐరాస ఆందోళన.. సమర్థించుకున్న ఇరాన్


ఇరాన్ జరిపిన దాడిపై ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ఈ దాడిని ఖండించారు. ఇరుపక్షాలు సంయమనం పాటించాలని.. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పాలని కోరారు. ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు డెన్నిస్ ఫ్రాన్సిస్ కూడా ఈ దాడిపై తీవ్రంగా స్పందించారు. "ఇరాన్ దాడి వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. దీని పరిష్కారానికి వివేకవంతంగా ఆలోచించి ముందుకు వెళ్లాలి. శాంతియుత చర్చలే ఈ సమస్యకు పరిష్కారం. ఇరాన్ ప్రభుత్వం మా మాటను గౌరవిస్తుందని ఆశిస్తున్నా. ఈ ఉద్రిక్తత ఇక్కడితో ఆగిపోతుందని భావిస్తున్నా" అని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని కోరారు. అయితే.. ఐరాసలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇర్వానీ తమ దాడులను సమర్థించుకున్నారు. "ఐరాస రాజ్యాంగంలోని 51వ అధికరణ మేరకు మాకు ఆత్మరక్షణ హక్కు ఉంది. కేవలం ఆత్మ రక్షణ కోసమే ఇజ్రాయెల్‌పై దాడి చేశాం. ఇజ్రాయెల్ ఏదైనా దుస్సాహసానికి దిగితే.. మా స్పందన మరింత తీవ్రంగా ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు ఐరాసలో ఇజ్రాయెల్ శాశ్వత ప్రతినిధి గిలాడ్ ఎర్డాన్ తాజా దాడిపై ఐరాస భద్రతామండలిని ఆశ్రయించారు. ఇజ్రాయెల్‌పై దాడిచేసిన ఐఆర్‌జీసీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని ఓ లేఖ రాశారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా భద్రతామండలికి లేఖ రాసింది.

కెవిన్ పీటర్సన్ విమానం దారి మళ్లింపు

ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ ఇరాన్ దాడుల కారణంగా తన విమానం దారి మళ్లిందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ముంబైలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లో కామెంటరీ ఇవ్వడానికి ఇంగ్లండ్ నుంచి వస్తున్న తన విమానాన్ని ఇరాన్ క్షిపణి దాడుల కారణంగా దారి మళ్లించినట్లు చెప్పారు. "మా విమానాన్ని రీ-రూట్ చేశారు. పెరిగిన దూరానికి అనుగుణంగా ఇంధనాన్ని నింపుకొన్నాక.. భారత్‌కు మళ్లించారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

జీ7 దేశాధినేతలతో భేటీకి బైడెన్ చర్యలు

పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటుండడంతో.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జీ7(కెనెడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్, అమెరికా) దేశాధినేతలతో భేటీ అయ్యేందుకు సన్నాహాలు చేశారు. ఇరాన్ దాడి జరిగిన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు జీ7 భేటీ అత్యవసరమని బైడెన్ భావిస్తున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి.



భారత్ ఆందోళన

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం పెరుగుతుండడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితిని పరిశీలిస్తున్నామని, ఇరుపక్షాలు శాంతిని నెలకొల్పాలని భారత విదేశాంగ శాఖ కోరింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించాలని.. చర్చలతోనే అది సాధ్యమని 'ఎక్స్'లో అభిప్రాయపడింది. ఇజ్రాయెల్‌లోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇజ్రాయెల్‌లోని భారతీయుల కోసం అక్కడి ఎంబసీ హెల్ప్‌లైన్ నంబర్లను(+972-5475207112, +972-543278392) విడుదల చేసింది. మరోవైపు.. హార్ముజ్ జలసంధి సమీపంలో ఇరాన్ స్వాధీనం చేసుకున్న నౌకలోని 17 మంది భారతీయుల విడుదల కోసం అక్కడి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశాంగ శాఖ వివరించింది. కాగా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. విస్తారా, ఇండిగో, ఇతర అంతర్జాతీయ విమానయాన సంస్థలు కూడా ఇరాన్, ఇజ్రాయెల్ గగనతలాల మీదుగా విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు పేర్కొన్నాయి.

ఈ నెలలోనే ఇజ్రాయెల్ వెళ్లిన 500 మంది భారత కార్మికులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడితో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో.. నిర్మాణ రంగంలో పనుల కోసం ఇజ్రాయెల్ వెళ్లిన భారతీయ కార్మికుల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని నెలలుగా ఇజ్రాయెల్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా అక్కడ నియామకాలకు భారత ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని పలువురు నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఈ నెలలోనే 500 మంది కార్మికులు జాతీయ నైపుణ్య అభివృద్ధి మండలి(ఎన్ఎస్‌డీసీ) ద్వారా ఇజ్రాయెల్ వెళ్లారు. మంగళవారం మరో 325 మంది బయలుదేరి వెళ్లాల్సి ఉంది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడితో వారి ప్రయాణం ఆగిపోయింది. నియామక ప్రక్రియను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎన్ఎస్‌డీసీ వర్గాలు తెలిపాయి. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రదాడి తర్వాత పాలస్తీనాకు చెందిన లక్ష మందికి పైగా అరబ్ ముస్లిం కార్మికులను తొలగించారు. దీంతో కుంటుపడిన నిర్మాణ రంగాన్ని పట్టాలెక్కించేందుకు ఇజ్రాయెల్ భారత్ నుంచి కార్మికులను రప్పించుకుంటోంది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	40.7	21.4
నల్లగొండ	40.0	24.0
వరంగల్	38.0	24.5
ఖమ్మం	38.0	25.0
హైదరాబాద్	36.0	26.0
ఆదిలాబాద్	33.8	22.4

సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులు

ముంబై, ఏప్రిల్ 14: బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద కాల్పుల కలకలం రేగింది. ముంబైలోని బాంద్రాలో ఆయన నివాసం ఉంటున్న గెలాక్సీ అపార్ట్‌మెంట్ బయట ఇద్దరు ఆగంతుకులు కాల్పులు జరిపారు. ఆదివారం తెల్లవారుజామున 4.50 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనంపై వచ్చి సల్మాన్ నివాసం వద్ద గాల్లోకి నాలుగైదు రౌండ్ల కాల్పులు జరిపి పారిపోయారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఓ బుల్లెట్ సల్మాన్ ఇంటి బాల్కనీలో పడిందని వారు చెప్పారు. కాల్పులు జరిగిన సమయంలో సల్మాన్ ఇంట్లోనే ఉన్నారని, ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదని తెలిపారు. దుండగులు వాడిన బైక్‌ను పట్టుకున్నామన్నారు.

ఇది ట్రైలర్ మాత్రమే: బిష్ణోయ్ సోదరుడు

ఈ కాల్పులు తామే జరిపామని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఇది ట్రైలర్ మాత్రమేనని చెప్పారు. ఇదే చివరి హెచ్చరిక అని, ఈసారి కాల్పులు ఇంటి బయట మాత్రమే జరగబోవని హెచ్చరించారు. సల్మాన్‌ఖాన్‌కు ఇప్పటికే పలుమార్లు చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. గతేడాది మార్చిలోనూ ఆయనకు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపు వచ్చింది.

ఇజ్రాయెల్ బ్రహ్మాస్త్రం.. యారో

ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలో అత్యంత శక్తిమంతమైనది

- 2400 కి.మీ. నుంచి దూసుకొచ్చే క్షిపణులకు మార్గమధ్యంలోనే చెక్
- ఆ వ్యవస్థ సాయంతోనే.. ఇరాన్ క్షిపణులను కూల్చివేసిన ఇజ్రాయెల్

పాత పౌరాణిక సినిమాల్లో యుద్ధాలు గుర్తున్నాయా? కర్ణుడు ఆగ్నేయాస్త్రం వేస్తే.. అర్జునుడు సింపుల్‌గా వారుణాస్త్రం వేస్తాడు! రెండు బాణాలూ అర్ధ చంద్రాకారంలో పైకెళ్లి ఒకదాన్నొకటి ఢీకొంటాయి!! కాసేపటికి.. వారుణాస్త్రంలోని నీళ్ల ఆగ్నేయాస్త్రంలోని అగ్గిని ఆర్పేస్తాయి! ఇప్పుడు ఆ సీన్‌లో బాణాలకు బదులు రెండు క్షిపణులను ఊహించుకోండి. డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడ్డ ఇరాన్‌కు.. ఇజ్రాయెల్ ఇదే రీతిలో బదులిచ్చింది. ఇరాన్ తనపైకి ప్రయోగించిన క్షిపణులను.. అత్యంత సమర్థవంతమైన తన 'యారో' రక్షణ వ్యవస్థ'ను ఉపయోగించి మధ్యలోనే కూల్చేయగలిగింది. ఏమిటా యారో వ్యవస్థ అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే.. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ గురించి పూర్తిగా తెలుసుకోవాలి. పుట్టుకతోనే చుట్టూ పుట్టెడు శత్రువులను సంపాదించుకున్న దేశం ఇజ్రాయెల్. లెబనాన్‌లోని హెజ్బొల్లా, సిరియా, ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల ఉగ్రవాద గ్రూపులు, యెమెన్‌లోని హౌతీలు, గాజా స్ట్రిప్‌లోని హమాస్ నుంచి ఆ దేశం తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. వేలాది రాకెట్లు, క్షిపణులను కలిగి ఉన్న ఆయా గ్రూపులకు ఆర్థిక అండ ఇరాన్. ఇలా చుట్టూ వేర్వేరు దూరాల్లో పొంచి ఉన్న ఈ గ్రూపులు, వాటికి మద్దతుగా ఉన్న ఇరాన్ చేసే గగనతల దాడుల నుంచి రక్షించుకోవడం కోసం ఇజ్రాయెల్ మూడంచెల గగనతల రక్షణ వ్యవస్థను రూపొందించుకున్నది. ఆ దశలు వరుసగా.. ఐరన్ డోమ్, డేవిడ్స్ స్లింగ్, యారో-3.


ఐరన్ డోమ్: ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థల గురించి చెప్పగానే చాలా మందికి గుర్తొచ్చేది ఈ ఐరన్ డోమే. 4-70 కిలోమీటర్ల దూరం నుంచి దూసుకొచ్చే స్వల్పశ్రేణి రాకెట్లు, ఆర్టిలరీ షెల్స్‌ను దారిలోనే అడ్డుకుని తునాతునకలు చేసేందుకు ఇజ్రాయెల్ రూపొందించుకున్న వ్యవస్థ ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే.. హమాస్ దాడులను నిరోధించడానికి అభివృద్ధి చేసుకున్న వ్యవస్థ. దీంట్లో డిటెక్షన్ అండ్ రాడార్ ట్రాకింగ్ వ్యవస్థ, బ్యాటిల్ మేనేజ్‌మెంట్ అండ్ వెపన్ కంట్రోల్ వ్యవస్థ, మిసైల్ ఫైరింగ్ యూనిట్ ఉంటాయి. ఇవి 24 గంటలూ, అన్ని రకాల వాతావరణాల్లోనూ అప్రమత్తంగా ఉంటాయి. ఈ వ్యవస్థ సక్సెస్ రేటు 90 శాతం. తొలుత దీనికి 'గోల్డెన్ డోమ్' అనే పేరు పెడదామనుకున్నారు.

డేవిడ్స్ స్లింగ్: బైబిల్ కథల్లో డేవిడ్ అండ్ గోలియత్ కథలో.. మహాకాయుడైన గోలియత్‌ను సాధారణ గొర్రెల కాపరి అయిన డేవిడ్ వడిశెల రాయితో పడగొడతాడు! ఆ కథలో డేవిడ్ వాడిన వడిశెల రాయి స్ఫూర్తిగా పెట్టిన పేరు ఇది. 40-300 కిలోమీటర్ల పరిధి నుంచి దూసుకొచ్చే డ్రోన్లు, టాక్టికల్ బాలిస్టిక్ మిసైళ్లు, మీడియం-టు-లాంగ్ రేంజ్ రాకెట్లు, క్రూయిజ్ మిసైళ్లను స్టనర్ అనే ఇంటర్‌సెప్టర్‌తో మార్గమధ్యంలోనే అడ్డుకునే వ్యవస్థ ఈ డేవిడ్స్ స్లింగ్. ఇజ్రాయెల్ దీన్ని లెబనాన్, సిరియా సరిహద్దుకు సమీపంలో మోహరించింది.

యారో-3: ఇరాన్, యెమెన్ నుంచి దూసుకొచ్చే లాంగ్ రేంజ్ క్షిపణులను సమర్థంగా నాశనం చేయడానికి అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ అభివృద్ధి చేసుకున్న గగనతల రక్షణ వ్యవస్థ ఇది. ప్రపంచంలోనే తొలి యాంటీ-టాక్టికల్ బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ సిస్టమ్‌గా దీనికి పేరుంది. వెయ్యికి పైగా కిలోమీటర్ల దూరం నుంచి దూసుకొచ్చే బాలిస్టిక్ క్షిపణులను భూవాతావరణానికి పైనే ఢీకొట్టే వ్యవస్థ ఇది. తాజాగా ఇరాన్ చేసిన దాడిని ఇజ్రాయెల్ దీని సాయంతోనే తిప్పికొట్టింది. ఇరాన్ ప్రయోగించిన 131 బాలిస్టిక్ క్షిపణుల్లో 124 క్షిపణులను, 170 డ్రోన్లను, 30 క్రూయిజ్ క్షిపణులను యారో వ్యవస్థ కూల్చేసిందని ఇజ్రాయెల్ ఆర్మీ వర్గాలు ప్రకటించాయి. 2023 నవంబరులో.. యెమెన్ నుంచి హౌతీలు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని ఇజ్రాయెల్ ఈ యారో-3 వ్యవస్థ ద్వారానే సమర్థంగా అడ్డుకుంది. కాగా.. దీనికన్నా సమర్థంగా పనిచేసే యారో-4 రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ఇజ్రాయెల్, అమెరికా కలిసి పనిచేస్తున్నాయి. ఇవికాక, పేట్రియాట్ పేరుతో అమెరికా రూపొందించిన రక్షణ వ్యవస్థను కూడా ఇజ్రాయెల్ చాలాకాలంగా ఉపయోగిస్తోంది. 1991లో గల్ఫ్ యుద్ధం సమయంలో ఇరాక్ ప్రయోగించిన స్కడ్ మిసైళ్లను అమెరికా ఈ వ్యవస్థ సాయంతోనే కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఆ పేట్రియాట్ వ్యవస్థను ఇప్పుడు ఇజ్రాయెల్.. విమానాలను, డ్రోన్లను కూల్చేయడానికి ఉపయోగిస్తోంది. అలాగే, లేజర్ టెక్నాలజీ సంబంధిత ముప్పులను ఎదుర్కొనడానికి ఆ దేశం 'ఐరన్ బీమ్' అనే వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తోంది.

-సెంట్రల్ డెస్క్

ఇజ్రాయెల్ రక్షణ ఛత్రం



ఎవరీ రెవల్యూషనరీ గార్డ్స్?



ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ)..! ఇజ్రాయెల్‌పై దాడిలో వినిపిస్తున్న పేరిది. ఎవరీ గార్డ్స్? అంటే ఇరాన్‌కు చెందిన సమాంతర సైనిక వ్యవస్థ. ఇరాన్ రాజు (షా)మొహమ్మద్ రెజా పహ్లవి ప్రభుత్వం పతనం తర్వాత మతవాద నాయకుల సైద్ధాంతిక ఆలోచనల మేరకు 1979లో ఇస్లామిక్ విప్లవం అనంతరం ఏర్పాటైంది ఐఆర్‌జీసీ.ఇప్పుడు ఇజ్రాయెల్‌పై దాడి వెనుకున్నది వీరే. త్రివిధ దళాలు.. 1.90లక్షల మందిపైగా సభ్యులతో హెజ్బొల్లా, పాలస్తీనా ఉగ్రసంస్థలకు సాయం అందిస్తోంది. అత్యంత బలమైన దళంగా ఎదిగిన గార్డ్స్.. "ఆపరేషన్ హానెస్ట్ ప్రామిస్" పేరిట ఇజ్రాయెల్‌పై దాడిలో పాల్గొంటున్నారు. ఈ దళం ప్రధాన బాధ్యత అంతర్గత, బాహ్య ముప్పు నుంచి ఇరాన్‌ను కాపాడడం. గార్డ్స్.. సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమైనీకి మాత్రమే జవాబుదారీ. ఐఆర్‌జీసీను 2019లోనే అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. కాగా ఇరాన్ తొలి సుప్రీం లీడర్ అయతుల్లా రుహొల్లా ఖొమేనీ.. ఐఆర్‌జీసీని 'ఇస్లాం సైనికులు'గా అభివర్ణించారు. "మీరెక్కడున్నా మీలో అంతర్గతంగాఉన్న, మీ చుట్టూ ఉన్న సాతానుల నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోండి" అని ఐఆర్‌జీసీ స్థాపన సందర్భంగా ఖొమేనీ అన్నారు. గార్డ్స్‌కు రాజకీయాల్లోకి వెళ్లే అధికారం కల్పించగా కొందరు సీనియర్ అధికారులు ఇలానే వెళ్లడంతో ఇరాన్ అంతర్గత రాజకీయాల్లోనూ గార్డ్స్ పాత్ర మరింత పెరిగింది. మతరాజ్య స్థాపన లక్ష్యంగా పెట్టుకున్న, ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను అణచివేసే స్వచ్ఛంద పారా మిలటరీ ఫోర్స్ అయిన 'బసిజ్'ను గార్డ్స్ నియంత్రిస్తుంటారు. ఇరాన్‌లో రాజకీయం, సైనికంలోనూ గార్డ్స్ ఇప్పుడు అంతర్భాగమయ్యారు. చాలా దేశాలపై సైనిక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు. ఐఆర్‌జీసీ విదేశీ విభాగమే ఖుద్స్ ఫోర్స్ లెబనాన్, ఇరాక్, యెమెన్, సిరియాల్లో తమ ప్రభావం చూపుతోంది. సిరియా అంతర్యుద్ధంలో ఆ దేశ అధ్యక్షు డు బషర్ అల్ అసద్‌కు అండగాఉంది. కొంతకాలం ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఇరాక్ భద్రతాదళాలకు ఖుద్స్ ఫోర్స్ మద్దతిచ్చింది. ఐఆర్‌జీసీ టాప్ కమాండర్ మేజర్ ఖాసీం సులేమానీ ఇరాక్‌లో ఉండగా 2020లో డ్రోన్ దాడితో అమెరికా హతమార్చింది. అప్పుడు ఇరాన్‌నుంచి తీవ్రస్పందన ఉంటుందనుకున్నా అలాంటిదేమీ జరగలేదు.

- సెంట్రల్ డెస్క్

ఫెయిర్‌నెస్ క్రీమ్‌లతో కిడ్నీలకు హాని

- వాటిలోని పాదరసంతో ప్రభావం
- తాజా అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: మీ చర్మ సౌందర్యం కోసం ఫెయిర్‌నెస్ క్రీమ్ వాడుతున్నారా? టీవీల్లో కనిపించే ప్రకటనలు చూసి ఆకర్షితులై ఆ క్రీమ్‌లను ట్రై చేస్తున్నారా? అయితే ఇలాంటి క్రీమ్‌ల వాడకం వల్ల భారత్‌లో కిడ్నీ సమస్యలు పెరుగుతున్నట్లు తాజాగా ఓ అధ్యయనంలో వెల్లడైంది. వీటిలో ఉండే పాదరసం మూత్రపిండాలకు హాని కలిగిస్తున్నట్టుగా పేర్కొంది. చర్మం నిగారింపు కోసం ఫెయిర్‌నెస్ క్రీముల వాడకం క్రమంగా పెరుగుతోంది. ఫలితంగా భారత మార్కెట్ వీటికి లాభదాయకమైనదిగా మారిపోయింది. అయితే ఈ క్రీమ్‌ల వాడకం వల్ల కిడ్నీలకు హాని కలుగుతుందనడం ఆందోళన కలిగిస్తోంది. తాజా అధ్యయన వివరాలను కిడ్నీ ఇంటర్నేషనల్ అనే మెడికల్ జర్నల్‌లో ప్రచురించారు. అధిక పాదరసం ఉన్న క్రీమ్‌ల వాడకం వల్ల మెంబ్రానస్ నెఫ్రోపతి (ఎంఎన్) కేసులు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితి కిడ్నీ ఫిల్టర్లను దెబ్బతీయడమేకాకుండా ప్రొటీన్ లీకేజీకి కారణమవుతుందని అధ్యయనం పేర్కొంది. ఎంఎన్ అనేది ఆటోఇమ్యూన్ డిసీజ్. దీని ఫలితంగా నెఫ్రోటిక్ సిండ్రోమ్ ఏర్పడుతుంది. ఇది మూత్రంలో ఎక్కువ ప్రొటీన్ విసర్జించేలా చేస్తుంది. 2021 జూలై నుంచి 2023 సెప్టెంబరు మధ్య కాలంలో నమోదైన 22 ఎంఎన్ కేసులను ఈ అధ్యయనంలో భాగంగా పరీక్షించారు. చర్మం ద్వారా పాదరసం శరీరంలోకి వెళ్లి మూత్రపిండాల ఫిల్టర్లను ప్రభావితం చేస్తుందని, ఇది నెఫ్రోటిక్ సిండ్రోమ్ కేసుల పెరుగుదలకు దారితీస్తుందని పరిశోధకుల్లో ఒకరైన ఆస్టర్ ఎంఐఎంఎస్ హాస్పిటల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ నెఫ్రాలజీ డాక్టర్ సజీష్ శివదాస్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశీయ మార్కెట్లో ఈ క్రీమ్‌లు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ క్రీములు త్వరగా ప్రభావం చూపుతాయన్న ప్రచారం వల్ల చాలా మంది ఆకర్షితులవుతున్నారని తెలిపారు.

సెల్ టవర్ లేకున్నా మొబైల్ కమ్యూనికేషన్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్స్‌లో చైనా విప్లవాత్మక ఆవిష్కరణను తీసుకొచ్చింది. భూమిపై ఉన్న సెల్ టవర్ల అవసరం లేకుండా నేరుగా స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్‌ను సాధ్యం చేయగలిగేలా ప్రపంచంలోనే మొదటి ఉపగ్రహాన్ని ఆ దేశ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్వర్గంతో కనెక్ట్ అవ్వడం అని అర్థం వచ్చేలా దీనికి 'టియాంటాంగ్' అని దీనికి పేరుపెట్టారు. ఎనిమిదేళ్ల క్రితం చైనా రోదసీలోకి పంపిన 'టియాంటాంగ్-1' ఉపగ్రహ శ్రేణి ప్రస్తుతం మూడుకు చేరింది. ఇవి జియోసింక్రోనస్ కక్ష్యలో తిరుగుతూ మొత్తం ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్ని కవర్ చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతమంతా మొబైల్ శాటిలైట్ కనెక్టివిటీకి మార్గం సుగమమైంది. చైనాకు చెందిన 'హువావే' ఇప్పటికే ప్రపంచంలోనే శాటిలైట్ కనెక్టివిటీని సపోర్ట్ చేసే మొదటి మొబైల్ కంపెనీగా గుర్తింపు పొందింది. హువావే టెక్నాలజీస్ గతేడాది సెప్టెంబరులో శాటిలైట్ కాల్స్‌కు మద్దతునిచ్చే స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ జాబితాలో షియోమి, హానర్, ఒప్పో వంటి మొబైల్ కంపెనీలు కూడా చేరాయి. గతేడాది డిసెంబరు 18న చైనాలోని గాన్సు ప్రావిన్స్‌లో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినప్పుడు.. సాంప్రదాయ కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయలేదు. ఈ సమయంలో బాధితుల్లో కొందరు శాటిలైట్ కాల్ సౌకర్యం ద్వారా బాహ్య ప్రపంచంతో సమాచారాన్ని పంచుకోగలిగారు.

యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్ పరీక్షలు విజయవంతం

అల్వాల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దేశీయ రక్షణ సామర్థ్యాలను పెంపొందించే దిశగా భారత్ గణనీయమైన పురోగతిని సాధించింది. తక్కువ బరువుతో మనిషి మోసుకెళ్లగలిగేలా.. స్వదేశీ పరిజ్ఞానంతో డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన 'మ్యాన్-పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్' (ఎంపీఏటీజీఎం) ఆయుధ వ్యవస్థకు క్షేత్రస్థాయి పరీక్షలను భారత సైన్యం విజయవంతంగా నిర్వహించింది. రాజస్థాన్‌లోని 'పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్' (పీఎఫ్ఎఫ్ఆర్) వద్ద నిర్వహించిన ట్రయల్స్ విజయవంతమయ్యాయని డీఆర్‌డీవో అధికారులు ఆదివారం వెల్లడించారు. ఎంపీఏటీజీఎం ఆయుధ వ్యవస్థలో లాంచర్లు, టార్గెట్ అక్విజిషన్ డివైజ్, ఫైర్ కంట్రోల్ యూనిట్ ఉన్నాయి. ఈ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో, భారత సైన్యాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

కెనడాలో భారతీయ విద్యార్థి హత్య

వాంకోవర్, ఏప్రిల్14: కెనడాలోని వాంకోవర్ నగరంలో భారతీయ విద్యార్థి చిరాగ్ అంటిల్ (24) శుక్రవారం రాత్రి హత్యకు గురయ్యాడు. ఆయన వాహనంలో ఉండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. హరియాణాకు చెందిన చిరాగ్ 2022లో కెనడాకు వచ్చి ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తి చేశాడు. వర్క్ పర్మిట్ పొంది ఈ నగరంలో ఉంటున్నాడు.

వెయ్యి కిలోల బంగారం స్వాధీనం

చెన్నై, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): చెన్నై సమీప కుంద్రత్తూర్ వద్ద మినీ లారీలో తరలించిన 1,000 కిలోల బంగారు కడ్డీలను ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 425 కిలోల బంగారు కడ్డీలకు సంబంధించి రసీదులు, ఆధారపత్రాలు ఉండడంతో తిరిగి ఇచ్చేశారు. శ్రీ పెరుంబుదూర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కుంద్రత్తూర్ జంక్షన్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కుంద్రత్తూర్ నుంచి శ్రీ పెరుంబుదూర్‌కు వెళ్తున్న మినీ లారీని ఆపి తనిఖీ చేసి బంగారు కడ్డీలు గుర్తించారు.

సైబర్ నేరాల కట్టడికి పక్కాగా కేవైసీ

న్యూఢిల్లీ: సైబర్ నేరాలను అడ్డుకునేందుకు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలు మరింత పటిష్ఠం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఇందుకోసం కేవైసీ నిబంధనలను మరింత పక్కాగా అమలు చేయాలని బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కోరింది. ముఖ్యంగా మర్చంట్స్, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు అందించే బిజినెస్ కరస్పాండెంట్స్ సేకరించే ఖాతాదారుల వివరాలు.. కేటుగాళ్ల చేతిలో పడకుండా పక్కాగా నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరింది.

మాల్దీవుల నుంచి సైనిక బృందం వెనక్కి

మాలే, ఏప్రిల్ 14: మాల్దీవుల నుంచి మరో భారత సైనిక బృందం వెనక్కి వచ్చేసింది. మాల్దీవులకు భారత్ గిఫ్టుగా ఇచ్చిన హెలికాప్టర్‌లో విధులు నిర్వహిస్తున్న సైనిక బృందం ఈ నెల 9న వెనక్కి వెళ్లిందని దేశ అధ్యక్షుడు ముయిజ్జు పేర్కొన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. "మాల్దీవుల్లో భారత్‌కు చెందిన మరో సైనిక బృందం మాత్రమే ఉంది. మే 10 లోపు వారు కూడా వెళ్లిపోతారు" అని సదరు మీడియా తెలిపింది.

అప్పులు తక్కువ.. చెల్లింపులు ఎక్కువ!

(మొదటి పేజీ తరువాయి)

వడ్డీలు, కిస్తీలే తడిసిమోపెడయ్యాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటి వరకు అంటే.. డిసెంబరు నుంచి ఈ నెల 13 వరకు రూ.17,618 కోట్ల రుణాలు (బడ్జెట్, బడ్జెటేతర) చేసింది. అయితే.. ఇదే వ్యవధిలో రూ.25,911 కోట్ల మేర (అప్పులు, వడ్డీలు) కిస్తీల పేరిట తిరిగి చెల్లించింది. కొత్తగా చేసిన అప్పుల కంటే సుమారు రూ.8 వేల కోట్లకు పైగా చెల్లింపులను ఎక్కువగా చేశారు. ఆ మేరకు రాష్ట్ర ప్రజలపై రుణ భారం తగ్గినట్లయిందని అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కలిపి తిరిగి చెల్లించేందుకు గడిచిన 125 రోజుల్లో రేవంత్ సర్కారు సగటున రోజుకు రూ.207 కోట్లు ఖర్చు పెట్టింది. గత ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పులకు వడ్డీలు, కిస్తీలను చెల్లించేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్లు అర్థమవుతోంది. ఇక అప్పులు, వడ్డీల చెల్లింపులే కాకుండా ప్రజోపయోగమైన పనులకు మరో రూ.5,816 కోట్లు మూలధన వ్యయం కూడా చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా భారీ అప్పుల జోలికి వెళ్లకుండా ప్రస్తుత ప్రభుత్వం నియంత్రణను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ పరిమితులకు లోబడి మార్కెట్ రుణాలు తీసుకొని, ఖర్చులకు సరిపడేలా సర్దుబాటు విధానం అనుసరిస్తోంది. గతంతో పోలిస్తే అప్పులు తగ్గుముఖం పట్టడం శుభసూచకమని ప్రభుత్వ పెద్దలు పేర్కొంటున్నారు. రాష్ట్ర రుణ భారాన్ని తగ్గించినట్లవుతుందని అంచనా వేస్తున్నారు. 2023 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు అంటే నాలుగు నెలల్లో రూ.15,968 కోట్ల మేర ప్రభుత్వం అప్పులు తీసుకుంది. గత ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో రూ.19,569 కోట్లు, 2021-22లో రూ.26,995 కోట్ల అప్పులు తీసుకుంది. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో రూ.59,625 కోట్ల రుణాలను రేవంత్ సర్కారు అంచనా వేసింది. అందులో ఇప్పటివరకు కేవలం రూ.2,500 కోట్లు అప్పుగా తీసుకుంది. గతంతో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) పెరిగినందున రుణాలు తీసుకునే పరిధి పెరిగింది. జీఎస్‌డీపీ ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వం తక్కువ అప్పులు చేయడం కొత్త మార్పునకు సంకేతమని పేర్కొంటున్నారు.

అంబేడ్కర్ అందరివాడు

భారతావనిన ఉదయించిన భాస్కరుడు.. రాజ్యాంగ నిర్మాతకు సీఎం రేవంత్ నివాళి

- ట్యాంక్ బండ్ వద్ద విగ్రహానికి పూల మాల
- అంజలి ఘటించిన గవర్నర్ రాధాకృష్ణన్
- ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- పార్టీలు, సంఘాల నేతల నివాళులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. దేశానికి బాబాసాహెబ్ చేసిన సేవలను గుర్తు చేసుకున్న పౌరులు, ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. గవర్నర్ సీ.పీ రాధాకృష్ణన్, సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. ఈ సందర్భంగా.. ఒక వర్గాన్ని ఇంకో వర్గంపైకి ఉసిగొలిపే ధోరణి చాలా ప్రమాదకరం అన్న అంబేడ్కర్ వ్యాఖ్యలను రేవంత్ గుర్తు చేశారు. "అందరివాడు అంబేడ్కర్.. భారతావనిన ఉదయించిన భాస్కరుడు, మహనీయుడు, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఘన నివాళులు" అంటూ రేవంత్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. వివిధ పార్టీల నేతలు, దళిత, ప్రజా సంఘాల నాయకులు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పద్మారావు గౌడ్, దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్.. రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్, ఎం.అనిల్ కుమార్ యాదవ్.. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం అధ్యక్షుడు బైరి నరేశ్ ఆధ్వర్యంలో మానవ హారం వేశారు. గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నేతలు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

దళితులతో కిషన్‌రెడ్డి భోజనం

రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 1943లో హైదరాబాద్‌కు వచ్చిన అంబేడ్కర్.. అడిక్‌మెట్‌లోని కట్టంబావి దళిత బస్తీలో పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం కిషన్‌రెడ్డి ఆ బస్తీకి వెళ్లారు. నాడు అంబేడ్కర్‌ను కలిసిన బస్తీ వాసులు జి.ఎల్లమయ్యను సత్కరించారు. అనంతరం బస్తీ వాసులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. బస్తీ అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ పరిపాలన సాగుతోందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.


ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అంబేడ్కర్ స్ఫూర్తితోనే పోరు: కేటీఆర్

మహనీయుడు అంబేడ్కర్ సూచించిన బోధించు.. సమీకరించు.. పోరాడు అనే స్ఫూర్తితోనే కేసీఆర్ లక్షలాది మందిని సమీకరించి 14 ఏళ్ల పోరాడి తెలంగాణను సాధించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయ సాధనకు పదేళ్ల తమ ప్రభుత్వం పని చేసిందన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ప్రసంగించారు.

రేవంత్‌రెడ్డి దళిత ద్రోహి: మందకృష్ణ

రేవంత్‌రెడ్డి మాదిగల ద్రోహి.. మాలల పక్షపాతి అని మందకృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ రిజర్వుడ్‌గా ఉన్న మూడు పార్లమెంటు, ఒక అసెంబ్లీ స్థానానికి జరిగే ఎన్నికల్లో మాదిగలకు ఒక్క టికెట్ కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి సీఎం తొలుత నివాళులు అర్పించడం ఉమ్మడి రాష్ట్రం నుంచి సంప్రదాయమని.. దానిని రేవంత్ పాటించలేదని మండిపడ్డారు. ఉదయం 9 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చిన దళిత, ప్రజా సంఘాల నేతలతో పాటు మందకృష్ణను పోలీసులు అడ్డుకున్నారు. రేవంత్ నివాళులర్పించిన తర్వాతే ఇతరులను అనుమతిస్తామని చెప్పారు. కాసేపటి తర్వాత పోలీసులు అందరినీ అనుమతించారు.

అంతరాలు పోయేదాకా పోరాడాలి: అసద్

అంబేడ్కర్ భారత జాతికి అందించిన గొప్ప బహుమతి రాజ్యాంగం మాత్రమే కాదని.. అణచివేత, వివక్ష అంతమయ్యే వరకు ప్రజాస్వామ్య విధానంలో పోరాటం చేసే అవకాశాన్ని కల్పించారని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.




ట్యాంక్‌బండ్ వద్ద, తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కిషన్ రెడ్డి, కేటీఆర్


అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, తదితరులు

దూరదృష్టి కలిగిన నేత అంబేడ్కర్

- హైకోర్టు సీజే అలోక్ అరాధే

దేశ ప్రజల మధ్య ఆర్థిక సమానత్వంతోపాటు మహిళా హక్కుల కోసం రాజ్యాంగ రూపశిల్పి బీఆర్ అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైకోర్టులో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని, జస్టిస్ శ్యాంకోషీ, న్యాయమూర్తులు జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ అనిల్‌కుమార్, జస్టిస్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాత నవీన్ ఎర్నేనిపై కేసు

- మరికొందరిపైన కూడా నమోదు
- హెల్త్‌కేర్ సంస్థ యజమాని కిడ్నాప్, షేర్ల బదిలీ వివాదంలో..

బంజారాహిల్స్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వ్యాపారిని కిడ్నాప్ చేసి నిర్బంధించి కంపెనీ షేర్లను బదిలీ చేయించుకున్న కేసులో మైత్రీ మూవీస్ అధినేత నవీన్ ఎర్నేనితో పాటు మరికొందరి పేర్లను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఇప్పటివరకు ఈ కేసులో కొందరి జాబితాలో నవీన్ పేరుంది. తాజాగా బయటకు వెల్లడించారు. జూబ్లీహిల్స్‌కు చెందిన వ్యాపారి చెన్నుపాటి వేణుమాధవ్ క్రియా హెల్త్ కేర్‌ను నెలకొల్పారు. అది వృద్ధిలోకి వస్తున్న క్రమంలో టేకోవర్ చేసేందుకు సంస్థ డైరెక్టర్లు మరికొంతమంది పథకం వేశారు. ఇందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసుల సాయం తీసుకున్నారు. ఆ విభాగం పోలీసులు 2018లో వేణుమాధవ్‌ను కిడ్నాప్ చేసి రూ.40 కోట్ల విలువ చేసే షేర్లను అక్రమంగా బదలాయించారు. విషయం బయటకు చెబితే చంపేస్తామని బెదిరించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్‌రావు అరెస్టుతో వేణుమాధవ్ నాలుగు రోజుల క్రితం జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు.. రాధాకిషన్ రావు, అప్పటి టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు, ఎస్ఐ మల్లికార్జున్, గోల్డ్‌ఫిష్ సీఈవో చంద్రశేఖర్, క్రియా హెల్త్ కేర్ డైరెక్టర్లు గోపాల్, రాజ్, నవీన్, రవి, బాలాజీపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నవీన్ ఎర్నేనితో పాటు మరికొందరి పాత్ర ఉన్నట్టు నిర్ధారణ అయింది. దీంతో ఆయన పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు.. పరారీలో కీలక నిందితులు

- డీసీపీ విజయ్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందని పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఈ మేరకు దర్యాప్తు తీరుపై ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. "ఈ కేసుతో మరికొందరికి లింకులు ఉన్న ఆధారాలు దొరికాయి. వారిలో కొందరు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి" అని వివరించారు. ఈ కేసు విచారణకు సంబంధించిన సోషల్ మీడియాలో ఊహాజనిత కథనాలు ప్రసారమవుతున్నాయని, ఈ చర్యలు దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని తెలిపారు. సున్నితమైన కేసు దర్యాప్తు గురించి, అలాంటి కథనాలను ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తరహా ప్రచారం దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు నాలుగు ప్రెస్‌నోట్లను విడుదల చేశాం. సంఘ విద్రోహక శక్తులపై నిఘా పెట్టాల్సిన కీలక విభాగం ఎస్ఐబీలో జరిగిన పరిణామాలపై నిపుణులైన అధికారుల బృందం, చట్టబద్ధంగా దర్యాప్తు జరుపుతోంది. సున్నితమైన కేసు కావడం వల్ల.. పారదర్శకంగా దర్యాప్తు కొనసాగుతోంది. సేకరించిన ఆధారాలను కోర్టుకు సమర్పిస్తాం. ఇలాంటి సున్నిత కేసులో కల్పిత కథనాలతో దర్యాప్తునకు ఆటంకం కలిగించొద్దు" అని విజ్ఞప్తి చేశారు.

దళిత సమాజానికి రేవంత్ క్షమాపణ చెప్పాలి

- దమ్ముంటే దానం

రాజీనామా చేయాలి: బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా సచివాలయం పక్కన ఉన్న ఆయన భారీ విగ్రహం వద్ద కనీసం పరిసరాలను శుభ్రం చేయలేదని, తద్వారా రాజ్యాంగ నిర్మాతను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందని బీఆర్ఎస్ నేతలు బాల్కసుమన్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఆరోపించారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారనే అక్కడ జయంతి వేడుకలు నిర్వహించలేదని, ఎలాంటి అలంకరణ చేయలేదని విమర్శించారు. నయాదేశ్‌ముఖ్‌లాగా రేవంత్ వ్యవహరిస్తున్నారని, ఆయనకు ఎందుకంత అహంకారమని ప్రశ్నించారు. దళిత సమాజానికి సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేస్తున్న దానం నాగేందర్‌కు కనీసం సిగ్గులేదని విమర్శించారు. ఆయనకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, పోటీ పడాలని వారు డిమాండ్ చేశారు.

బెయిల్ వస్తది.. ధైర్యంగా ఉండు!

కవితకు భరోసా ఇచ్చిన కేటీఆర్.. సీబీఐ కస్టడీలో వసతులు, విచారణపై ఆరా

- 35 నిమిషాల పాటు పలు అంశాలపై చర్చ
- కేటీఆర్ వెంట బావ అనిల్, న్యాయవాది మోహిత్
- ముగిసిన సీబీఐ కస్టడీ.. నేడు మళ్లీ కోర్టుకు కవిత


ఢిల్లీలోని సీబీఐ ఆఫీసుకు వెళ్తున్న కేటీఆర్, అనిల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై సీబీఐ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె సోదరుడు కేటీఆర్ కలిశారు. కవిత భర్త అనిల్, న్యాయవాది మోహిత్ రావు, వ్యక్తిగత సహాయకుడు శరత్‌తో కలిసి ఢిల్లీలోని సీబీఐ కార్యాలయానికి వెళ్లిన కేటీఆర్.. కవితతో ములాఖత్ అయ్యారు. ఆదివారం సాయంత్రం 5:45 గంటలకు సీబీఐ కార్యాలయంలోకి వెళ్లిన కేటీఆర్.. 7:40 గంటలకు బయటకు వచ్చారు. అయితే, కవితతో 35 నిమిషాల పాటు వీరి భేటీ కొనసాగినట్లు తెలిసింది. సీబీఐ కస్టడీలో వసతులు, విచారణ తీరు, ఏయే అంశాలపై విచారణ నడుస్తున్నది, తిహాడ్ జైలులో పరిస్థితి, సీబీఐ అరెస్టు సమాచారం ఎప్పుడు తెలిసింది? కేసు విచారణలో ఈడీ, సీబీఐ వ్యవహరిస్తున్న తీరు, బెయిల్ పిటిషన్ తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. బెయిల్ వస్తుందని, ధైర్యంగా ఉండాలని కవితకు కేటీఆర్ ధైర్యం చెప్పినట్టు తెలిసింది. వాస్తవానికి శనివారమే కేటీఆర్ ఢిల్లీకి వచ్చి, తిహాడ్ జైలులో కవితను కలవాల్సి ఉంది. అయితే, కవితను సీబీఐ అరెస్టు చేయడం, కస్టడీలోకి తీసుకోవడంతో కేటీఆర్ షెడ్యూల్‌లో మార్పు జరిగింది. ఒకరోజు ఆలస్యంగా ఆదివారం ఆయన కవితను కలిశారు.

నేడు కోర్టు ముందుకు కవిత

కవిత సీబీఐ కస్టడీ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. దీంతో సోమవారం ఉదయం 10 గంటలకు కవితను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరచనున్నారు. 3 రోజుల కస్టడీలో కవిత వెల్లడించిన పలు అంశాలను సీబీఐ కోర్టుకు చెప్పే అవకాశం ఉంది. విచారణకు కవిత సహకరించలేదని సీబీఐ భావిస్తే.. మరో 3-5 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని న్యాయమూర్తిని కోరే అవకాశం ఉంది. గతంలో ఈడీ కూడా కవితను రెండు సార్లు కస్టడీలోకి తీసుకుని విచారించింది. ఇప్పుడు సీబీఐ కూడా మరోసారి కస్టడీకి తీసుకుంటుందా? లేదా అనేది ఉత్కంఠగా మారింది. సీబీఐ కస్టడీకి కోర్టు అంగీకరిస్తే కవితను మళ్లీ సీబీఐ హెడ్ ఆఫీసుకు తరలించనున్నారు.

శరత్ చంద్రారెడ్డిని ఎన్నిసార్లు కలిశారు?

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో గత రెండేళ్లుగా అనేక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు సేకరించిన తర్వాత కవితతోపాటు కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈడీ విచారణతో పోలిస్తే సీబీఐ మరికొన్ని అదనపు సాక్ష్యాలను సేకరించింది. కవిత కస్టడీ రిపోర్టులో అనేక విషయాలను బహిర్గతం చేసింది. కేసులో అసలు సూత్రధారి, పాత్రధారి కవితేనని ఆరోపించింది. మద్యం వ్యాపారిని కేజ్రీవాల్‌కు పరిచయం చేసిందే కవితేనని తెలిపింది. ఆదివారం నాటి విచారణలోనూ శరత్ చంద్రారెడ్డికి సంబంధించిన ప్రశ్నలే ఎక్కువగా అడిగినట్టు సమాచారం. శరత్ చంద్రారెడ్డి ఎలా పరిచయం? ఎన్నిసార్లు కలిశారు? అని ప్రశ్నించినట్టు తెలిసింది. మహబూబ్‌నగర్‌లో రూ.14 కోట్ల భూమిని బలవంతంగా అమ్మిన విషయంలో శరత్‌చంద్రారెడ్డి వాంగ్మూలంతోపాటు ఇతర సాక్ష్యాలను కవిత ముందు పెట్టి పలు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం.

సౌదీలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు హైదరాబాదీ మహిళల మృతి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

రంజాన్ పండగ పూట సౌదీలోని దమ్మాంలో ఒక తెలుగు ప్రవాసీ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తోడికోడళ్లు మృతి చెందారు. ఓ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఫర్హాత్ అంజుం హుస్సేనీ, గృహిణి అయిన రషీదా ఫారూఖీలు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందగా.. వారి భర్తలకు గాయాలయ్యాయి. సోదరులైన రషీద్ ఫారూఖీ, షాహబొద్దీన్ ఫారూఖీలు దమ్మాం నగరంలో పని చేస్తున్నారు. వీరి స్వస్థలం నెల్లూరు జిల్లా కేంద్రమైనా కొంత కాలం క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కాగా, రంజాన్ పండుగ సందర్భంగా దమ్మాం నుంచి మక్కాకు వెళ్తుండగా ఈ నెల 8న రోడ్డు ప్రమాద ఘటన జరిగింది. పండుగ పూట సెలవులుండటం వల్ల ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇద్దరి మృతదేహాలను అల్ ఆఫీఫ్ మార్చురీలో భద్రపరిచారు. అధికారిక లాంఛనాలు పూర్తయ్యాక వీరికి అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాములోరి కల్యాణ ఏర్పాట్లు పూర్తి

- భద్రాచలంలో నేడు ధ్వజారోహణం.. బుధవారం కల్యాణోత్సవం


తయారైన పట్టుచీర

భద్రాచలం, ఏప్రిల్ 14: భద్రాచలంలో సీతారామ స్వామి కల్యాణ ఏర్పాట్లు పూర్తయ్యాయి. మిథిలా స్టేడియంలో 24సెక్టార్లలో 31,860 మంది కల్యాణాన్ని వీక్షించొచ్చని అధికారులు తెలిపారు. కల్యాణ తలంబ్రాలను 60 కౌంటర్లలో ఉచితంగా అందజేయనుండగా 19 కౌంటర్లలో లడ్డూ ప్రసాద విక్రయాలు చేపట్టనున్నారు. ఇక, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజపట మండల లేఖనం నిర్వహించారు. సోమవారం ధ్వజారోహణం, మంగళవారం ఎదుర్కోలు, బుధవారం కల్యాణం నిర్వహిస్తారు. కాగా, ప్రభుత్వం తరఫున స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తీసుకురానున్నట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉన్నందున సీఎం ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. దేశం నలుమూలల నుంచి భద్రాచలం వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. భద్రాద్రిలో 10 మినీ బస్సులను ఏర్పాటు చేసింది.


కల్యాణానికి సిరిసిల్ల బంగారు పట్టుచీర

సిరిసిల్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణానికి సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ తాను నేసిన బంగారు పట్టుచీరను అందించనున్నాడు. బంగారు, వెండి, జరీ పోగులతో 5.50 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పు ఉన్న ఈ చీర 600 గ్రాముల బరువున్నట్లు విజయ్ పేర్కొన్నాడు.

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



"ఈ సంకలనానికి 30 ఏళ్ళ భారతి పత్రికల్ని పరిశీలించాం"

వందేళ్ళ తెలుగు సాహిత్యం నుంచి ఏరిన వందమంది కవుల కవితలతో, పరిచయాలతో, విశ్లేషణలతో మీతోపాటు చేపూరు సుబ్బారావు సంపాదకత్వంలో 'కవన గర్భరాలు' పేరిట వెయ్యి పేజీల బృహత్ సంకలనాన్ని కూర్చారు. ఈ ఆలోచన ఎలా మొదలైందో చెప్తారా?

కొన్ని సంవత్సరాల క్రితం, 'తెలుగు జాతి మనది' అనే శీర్షికతో ఒక టి.వి. సీరియల్ తీయాలని సంకల్పించాను. తెలుగు వారి జీవితాల్ని రకరకాల కోణాలనుండి ప్రేక్షకులకు ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా చూపించడం దాని ఉద్దేశ్యం. ప్రతి ఎపిసోడ్‌లో 7 భాగాలుంటాయి. 6వ భాగం శీర్షిక పేరు 'వెలకట్టలేని వారసత్వాలు, అలనాటి పద్యాలు, ఇలనాటి గేయాలు'. ఈ శీర్షిక క్రింద ప్రతి వారం తెలుగు సాహిత్యం లోని ఒక గొప్ప పద్యాన్ని, ఒక మంచి గేయాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయాలనేది నాకోరిక. అయితే సీరియల్ ఆలస్యమవుతుండటంతో, ఛందోరహిత కవితలను ఒక పుస్తకంగానూ, ఛందోసహిత కవితలను మరో పుస్తకంగానూ, తీసుకొస్తే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చాను. కాని సంకల్పించిన సంకలనాలు, మామూలుగా వచ్చే సంకలనాలకన్న భిన్నంగానూ, ఆసక్తికరంగానూ ఉండాలనుకున్నాను. ఛందోరహిత కవితలను 'కవన గర్భరాలు' అనీ, ఛందోసహిత కవితలను 'వెయ్యేళ్ళ పద్యానికి వందనం' అని నామకరణం చేశాం. 'కవన గర్భరాలు' మార్కెట్లోకి వచ్చింది. 'వెయ్యేళ్ళ పద్యానికి వందనం' మరో నాలుగైదు నెలల్లో వస్తుంది.

ఈ పుస్తకంలో కవితల తోపాటు కవుల వివరాలు, వారిపై, వారి కవితలపై వచ్చిన విశ్లేషణలు పొందుపరిచారు. దీని వెనకాల జరిగిన పరిశోధన గురించి చెప్పండి?

సంకలనంలో కవితను ఉదహరించి, రచయిత నేపథ్యం, సంక్షిప్త జీవిత చరిత్ర ఇవ్వక పోవడం సబబు కాదని నా అభిప్రాయం. 'కవన గర్భరాలు'లో ప్రధాన విభాగంలో ప్రస్తావించబడ్డ ప్రతి రచయిత సంక్షిప్త జీవిత చరిత్ర ఉంది. కొంతమంది రచయితలపై ప్రముఖుల అభిప్రాయాలున్నాయి. కొంతమంది ప్రముఖ రచయితల వ్యక్తిత్వాల్ని అర్థం చేసుకోవడానికి 'మనసులోని కొన్ని మాటలు' పేరుతో కొంత సమాచారం ఇవ్వబడ్డది. ప్రతి కవితపై, వ్యాఖ్యానం ఉంచబడింది. వ్యాఖ్యానాలు నా సహసంకలనకర్త చేపూరు సుబ్బారావు చాలా ఓపిగ్గా అద్భుతంగా రాశారు. కొన్ని కవితలకు సంబంధిత నేపథ్యం ఇవ్వబడింది. క్లిష్టమైన పదాలకు అర్థాలను పొందుపరచడం జరిగింది.

జీవిత చరిత్రల కొరకు మేము పడ్డ శ్రమ ఇంతా అంతా కాదు. ముఖ్యంగా వెలుగులో లేని రచయితలు కాని, చనిపోయిన వారి సమాచారం కాని పట్టుకోవడం అంత తేలిక కాదు. ముగ్గురు నలుగురి విషయంలో చాలా చాలా కష్టపడాల్సి వచ్చింది. 'నగ్నవృక్షం' పేరుతో ఒక మంచి కవితకు పుస్తకంలో స్థానం కల్పించాం. దాని రచయిత పాశం వెంకటేశ్వర్ రెడ్డి. ఆయన జీవిత చరిత్ర కొరకు, నేనూ, మౌనశ్రీ మల్లిక్ చేయని ప్రయత్నం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలిసిన సాహితీవేత్తలందరినీ అడిగాం. ఎక్కడా లభ్యం కాలేదు. అతని జీవిత చరిత్ర పెట్టలేదనే అసంతృప్తి విగిలిపోయింది.

> **సంకలనంలో కవితను ఉదహరించి, రచయిత నేపథ్యం, సంక్షిప్త జీవిత చరిత్ర ఇవ్వక పోవడం సబబు కాదని నా అభిప్రాయం. 'కవన గర్భరాలు'లో ప్రధాన విభాగంలో ప్రస్తావించబడ్డ ప్రతి రచయిత సంక్షిప్త జీవిత చరిత్ర ఉంది. ప్రతి కవితపై, వ్యాఖ్యానం ఉంచబడింది.**


ఈ కవితల ఎంపిక గురించి రాసిన ముందు మాటలో 'లయ' గురించి మాట్లాడారు. 'లయ'ను ఒక ప్రమాణంగా తీసుకోవటానికి కారణం ఏమిటి?

ఈ సందర్భంలో, గణిత శాస్త్రంలో వాడే రెండు పదాలను ఉదహరించాలి. అవి necessary, sufficient అనే పదాలు. లయ అనేది కవితకు necessity కాదు. లయ అనేది మంచి కవిత అనిపించుకోవడానికి sufficient కూడా కాదు. ఉపోద్ఘాతంలో మేము సి. నారాయణ రెడ్డి మాటను ఉంటకించాం. ఏ నియమం లేకుండా శుద్ధ వచనాన్ని లయబద్ధంగా మార్చినచో, అది వచన కవిత అవుతుందని అన్నాడు. ఆయన అన్నప్పటికీ, అధునాతన వచన కవిత్వంలో లయకు అంతగా ప్రాధాన్యత నివ్వడం లేదు. మేము పుస్తకంలో స్థానం కల్పించిన అనేక కవితల్లో లయ ప్రత్యక్షంగానో, అంతర్లీనంగానో ఉంది. లయ ఉన్న కవితలు పాఠకులకు, శ్రోతలకు ఎక్కువ ఆనందాన్ని కలిగిస్తాయి.

కవితల్లో లయతో పాటు కవితాశిల్పం కూడా ముఖ్యం. కవితల్లో వస్తువుని, శిల్పాన్ని, రెండింటినీ పరిశీలించాలి. పూర్తిగా వస్తువు వల్లనే కవిత శోభాయమానంగా ఉండదు. వస్తువుకు కవితాశిల్పాన్ని జోడించినప్పుడే అది బాగుంటుంది.

కవితల ఎంపికలో ఎలాంటి కొలమానాలు తీసుకున్నారు?

మొదటిది, రచయిత తీసుకున్న విషయాన్ని అందంగా, ఆసక్తికరంగా చెప్పగలిగాడా అనేది ముఖ్యమైనది. రెండవది, shared experience. రచయిత కవితలో వ్యక్తీకరించిన అనుభవాన్ని కాని, అనుభూతిని కాని, చదువరి పొందగలిగాడా అనేది ముఖ్యం. పాఠకుల వ్యక్తిత్వాలను బట్టి, వారి ఆసక్తులను బట్టి, ఈ shared experience, విభిన్నమైన వ్యక్తుల్లో విభిన్నమైన degrees లో ఉండవచ్చు. కాని, targeted readers కు అట్లాంటి shared experience లభించిందా అనేది ముఖ్యం. ఉదాహరణకు, పాపినేని శివశంకర్ రాసిన రెండు కవితలు ఒకటి ముఖేశ్ పైన, రెండవది హరిప్రసాద్ చౌరాసియా పైన. కొంతమంది పాఠకులకు వారిపై ఆసక్తి ఉండకపోవచ్చు. అందువల్ల



వి.కె. ప్రేమ్‌చంద్ పలకరింపు

అవి మంచి కవితలు కాదనలేం.

ఈ సంకలనంలో కవితల్లో ఎక్కువ శాతం ఎలాంటి ఇతివృత్తాలు ఉన్నాయని గమనించారు?

ఏ ఇతివృత్తం పై అయినా ఎక్కువగా కవితలుంటే అది యాదృచ్ఛికమే కాని conscious decision కాదు. వెనక్కి మరలి చూస్తే, నలుగురు కళాకారులపైన కవితలున్నాయి. ఒకటి సూర్యకాంతం, రెండవది భానుమతి, మూడవది ముఖేశ్, నాల్గవది హరిప్రసాద్ చౌరాసియా. మైకేల్ జాక్సన్‌పై కొండెపోగు డేవిడ్ లివింగ్‌స్టన్ రాసిన కవితను కూడా కలుపుకుంటే అయిదు కవితలనుకోవచ్చు.

ఈ సంకలనం కూర్పులో మీకు దారి చూపిన, ప్రేరేపించిన సంకలనాలు?

ఏ ఒక్క సంకలనమో మాకు దారి చూపించిందని భావించడంలేదు. కాని ప్రప్రథమంగా, దాదాపు 90 ఏళ్ళ క్రింద, 1935లో ముద్దుకృష్ణ ద్వారా ప్రచురించబడ్డ 'వైతాళికులు' పుస్తకం పేరు చెప్పాలి. తరువాత ఎన్నో సంకలనాలు వచ్చినా, ఇప్పటి వరకు కూడా సంకలనం అంటే జ్ఞాపకం వచ్చేది 'వైతాళికులు' పుస్తకమే. అయితే ప్రస్తుత కొలమానాలను బట్టి చూస్తే 'వైతాళికులు' పుస్తకంలో దోషాలు, పరిమితులు కనిపిస్తాయి. ఈ కొలమానాలను బట్టి ఆ పుస్తకాన్ని విమర్శించడమూ సరి అయింది కాదు. ఆ పుస్తకం వచ్చిన తరవాత గేయకవితలో మార్పులొచ్చాయి. వచన కవిత చాలా ముఖ్యమైన మార్పును తెచ్చింది.

సంకలనానికి సహాయం చేసిన మరికొన్ని inputsను ప్రస్తావించడం ఉచితం. 1960 నుండి 1990 వరకు నిరాఘాటంగా అత్యుత్తమ సాహిత్య పత్రికగా పేరొందింది భారతి. ఈ సంకలనం రూపకల్పన జరిగినప్పుడు, దాదాపు 30 ఏళ్ళ భారతి పత్రికల్ని అంటే సుమారు 360 పత్రికలను సంపాదించి పరిశీలించాం. వాటిలో నుండి కొన్ని ఉత్తమ కవితల్ని ఎంపిక చేశాం. అట్లాంటి కవితలు ఇప్పుడు ఎక్కడా దొరకవు. ఉదాహరణకు, గంధం వేదవేశ్వరావు తెలంగాణ మాండలికంలో రాసిన 'నా దేశం శాన శాన మారింది'.

విజయవాడ నుండి సాహితీమిత్రులు ఏటా ప్రచురించే 'కవిత' సంకలనాలు కూడా బాగా ఉపయోగపడ్డాయి. రచయితల పుస్తకాలు ఎంత సహాయపడతాయో చెప్పనక్కరలేదు. అనువాద కవితలకు అనిల్ బత్తుల తీసుకొచ్చిన 'దేశదేశాల కవిత్వం' ఉపయోగపడింది.

98480 52486

పద్యం రాస్తా...

దిశమొలతో చిత్తుకాగితాలేరుతున్న
ఒక చీమిడిముక్కు పిల్లవాడు
ఈ దేశమై కనిపిస్తుంటే
నేనొక పద్యం రాస్తా

మేఘం చిట్లి నగరం
నడుము మీద కూలితే
విరిగి పోయిన
పిట్ట గూళ్ళ ఇండ్లలో
కన్నీటి వరదలో ఈదుతున్న మానవ పక్షుల
జీవన సంధ్యను చూస్తూ
నేను పద్యం రాస్తా

మాధ్యమాల మాయతెరలమీద
కనిపిస్తున్న ప్రగతి
ఈ దేశపు జండా అంటూ
పరిహాసం స్వాభావికం చేస్తున్నపుడు
నేనొక పద్యం రాయకుండా ఎలా ఉంటాను?

ఆకాశంలో సగం చేసే
శోకాలాపాలే జీవన సంగీతం
అయినపుడు,
ఉత్పత్తి శక్తులు పాదాల నుండి
పుట్టిన సూత్రీకరణలు
చాపకింద నీరై
తెలియకుండా
కాటు వేస్తూనే ఉంటే
పద్యంగా శోకించని కవి ఎవ్వడు?

రాజ్యానికి మతాన్ని కవచం
చేసుకునే మహాయోగం
నిస్సిగ్గు వెలుగులతో
రొమ్ము చూపిస్తుంటే
పద్య గర్జనతో, కలం
లక్ష్యాన్ని చాటి చెబుతా

నిశ్శబ్ద రాత్రిలో
నల్లటి కొండ కొనలో
చేతిలో కాగడాతో
నడుస్తూ అదిగో ఒకడు...
రెక్కలు మొలచిన
రేపటి ఆశకు వాడొక సంకేతం

భూమిని చీల్చుకొని మొలిచే
ఆకుపచ్చని రైతు ప్రాణం
సూర్యుణ్ణి తలమీద మోస్తూ
ఎదుగుతున్న కలను
ఆవాహన చేసుకొంటూ
కనిపించని తాళ్ళతో
కట్టేసే శాసనపు గొలుసులను
పడగవిప్పిన పద్యమై
సవాల్ చేస్తూనే ఉంటా
మరణం అంచు మీద
జీవన శాసనం
రాస్తూనే ఉంటా.

కాంచనపల్లి గోవర్ధన్ రాజు
96760 96614



"హరిజనులలో నేడు మంచి కవులు పుట్టినారు. పుట్టుచున్నారు. మనము ఏర్పాటు చేయబోవుచున్న ఒకానొక సామ్యవాద రాజ్యాంగమునకు ఇది గొప్ప శుభసూచికము" (జ్ఞానానంద కవి 'అక్షరాభిషేకం' కావ్యానికి ముందుమాట) అని విశ్వనాథ సత్యనారాయణ ప్రకటించడం విశేషంగా భావించవచ్చు. మిగతా కవుల కంటే హరిజన కవులు కరుణ రసముట్టిపడునట్లు కవిత్వం రాస్తున్నారని విశ్వనాథ ప్రశంసించాడు. నెత్తుటి సిరాతో తన జాతి కవులు కఠినాత్ముల హృదయాలు ద్రవించేలా కరుణరస భరితమైన అనేక కావ్యాలు రచిస్తున్నారని గుర్రం జాషువ గబ్బిలం కావ్యంలో చాటిచెప్పాడు. వీరివురి మాటల్లో దళిత వర్గానికి చెందిన అప్పటి కవుల సృజన ప్రాభవం అర్థమవుతుంది.

భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న అందించిన రాజకీయ, సాహిత్య ప్రేరణతో, జాషువ కవిత్వ ప్రభావంతో, హరిజనోద్యమ సాహిత్య స్ఫూర్తితో, ఈ వర్గాల నుండి వచ్చిన ఎంతో మంది కవులు ఆధునిక తెలుగు పద్య కవిత్వానికి జవజీవాలను అందించారు. తరతరాలుగా అక్షరానికి దూరం చేయబడిన జాతిలో నుండి దూసుకు వచ్చిన ఈ

అంబేద్కర్ భావాలకు కవిత్వ రూపమిచ్చిన కవి

కవులు కఠోరమైన సాధన జేసి, పద్య రచనా నైపుణ్యాన్ని వశ పరచుకొని ఆత్మగౌరవ స్పృహతో మహాకావ్యాలు రాశారు. తక్షణ సామాజిక గౌరవాన్ని అందుకోవడానికి, తమ జాతిని తృణీకరించే ప్రాబల్య వర్గాల కవి పండితుల ఆదరణను పొందడానికి ఈ కవులు పద్య కావ్య సృజనను సరియైన ఆలంబనగా భావించారని అనిపిస్తుంది. అందుకే జాషువతో పాటు, బోయి భీమన్న, జ్ఞానానంద కవి, గద్దల జోసెఫ్, బీర్నీడి మోషే, ప్రసన్న, నంబూరు దుర్వాస మహర్షి, అత్తోట రత్నకవి, నూతక్కి అబ్రహం, మల్లవరపు జాన్, దైద వేములపల్లి దేవేందర్, కొలకలూరి స్వరూపరాణి లాంటి ఎంతోమంది కవులు పట్టుబట్టి పద్య కవిత్వమే రాశారు. వీరిలో ప్రధానంగా జాషువ, భీమన్నల కేంద్రంగా సాహిత్యంలో విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యంగా గుర్రం జాషువా కవితా ప్రభంజనంలో చాలామంది విస్మృత కవులుగా మిగిలిపోయారు. ఇలాంటి విస్మృతకవుల్లో చోడగిరి చంద్రరావు ఎంతో ప్రాసంగికత ఉన్న కవి.

చంద్రరావు గురించి ఆధునిక సాహిత్యంలో, దళిత సాహిత్యంలో చర్చ జరగ లేదు. కల్లూరి ఆనందరావు పరిశోధనా గ్రంథంలో తప్ప ఈ కవికి సంబంధించిన రచనల ప్రస్తావన ఆధునిక సాహిత్య చరిత్రలో మృగ్యం. డెబ్బయ్యో దశకం లోనే విప్లవ కవితా ఉధృతికి భిన్నంగా స్పష్టమైన దళిత తాత్వికతతో చంద్రరావు ప్రభావశీలమైన పద్య కవిత్వం రాయడం గొప్ప విషయం.

'భీమ' కవిగా సాటి కవుల నీరాజనాలందుకున్న చోడగిరి చంద్రరావు గోదావరి తీరంలో కోరుమిల్లి గ్రామంలో 1932 జూలై 15న జన్మించాడు. తల్లితండ్రులు బుల్లెమాంబ, వెంకటస్వామి. చంద్రరావు కొంతకాలం రక్షణ శాఖలో సైనికుడిగా, ఆ తరువాత భారతీయ రైల్వే శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి, సూపర్‌వైజర్‌గా పదవీ విరమణ చేశాడు. రెండుపదుల వయసులోనే కవిత్వ రచనను ప్రారంభించిన చంద్రరావు మూడున్నర దశాబ్దాల పాటు అప్రతిహతంగా సాహిత్య సృజన కొనసాగించాడు. వేమన, వేదుల సత్యనారాయణ, జాషువ, భీమన్నలను సాహిత్య గురువులుగా భావించాడు. గేయం, ఖండ కావ్యం, శతకం, పాట లాంటి ప్రక్రియల్లో చైతన్యభరితమైన రచనలు చేశాడు. వేకువ, మన గేయాలు, హృదయవీణ, చంద్రరావు గీతాలు, భీమ త్రిశతి తదితర రచనలతో కవిగా గుర్తింపు పొందాడు. మధుర కవిగా ప్రఖ్యాతి గాంచిన చంద్రరావు సుమధుర గాయకుడు, హార్మోనిస్టు కూడా. తాను రాసిన సామాజిక చైతన్య గీతాలను స్వయంగా తానే స్వరపరిచి, శ్రవణ శుభగంగా గానం చేస్తుంటే, ఆయన రాగవాహినిలో శ్రోతలు ఆనంద పరవశులయ్యే వారు. 'చంద్రరావు కవిత' అనే ఖండ కావ్యం అమెరికన్ల ఆదరణ అందుకున్నదని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'వాషింగ్టన్' గ్రంథాలయంలో ఈ కావ్యానికి చోటు లభించిందని ఈ గ్రంథ ప్రచురణకర్తలు తెలియజేశారు.

కవిత్వం పట్ల, కవిత్వ ప్రయోజనం పట్ల చంద్రరావు స్పష్టమైన అభిప్రాయాలను ప్రకటించాడు. పీడితుల దుఃఖ విముక్తికి దోహద పడేదే ఉత్తమ కవిత్వమని సూత్రీకరించాడు. 'చంద్రరావు గీతాలు' సంపుటిలోని వస్త్రాపహరణం, మన కార్యం తదితర కవితల్లో చంద్రరావు తన కాలం నాటి కవితాధోరణులను విమర్శించాడు. కవి దుశ్శాసనులు తమ దుష్ట సృజన చేష్టలతో కవితా ద్రౌపదికి వస్త్రాపహరణం చేస్తున్నారని ఆవేదన చెందాడు. వర్ణాశ్రమ ధర్మసూత్రాలను కవిత్వంలో వల్లిస్తూ "జాతిని రాతియుగం గుహలోనికి రమ్మని పిలిచే" తిరోగమన కవిత్వాన్ని ఈ కవి తిరస్కరించాడు. నవ్య సంప్రదాయ కవుల తీరుతెన్నులను వ్యంగ్యంగా ఎత్తి చూపాడు. "నీవు కన్న వారు నిన్ను కొల్లెడి వారు/ నీకు భర్తలందు నిక్కువారు/ భాష యనెడి పాడు బావిలో పడ్డారు" అంటూ పాండిత్య ప్రకర్షతో సాధారణ పాఠకులను గంగవెర్రులెత్తించే కవి పుంగవులను వ్యతిరేకించాడు. వీరంతా సమాజాన్ని విడిచి, సగటు మనిషిని విస్మరించి సాహిత్య సాము చేసి, "బంద కవితలల్లి తెలుగు సొగసును పాడు జేశారని" చంద్రరావు ఆక్షేపించాడు. కేవలం శాబ్దిక పరమైన ఆడంబరంతో, భావ పరమైన క్లిష్టతతో కొంతమంది కవులు కవితాసారాన్ని పాఠకులకు అందకుండా చేస్తున్నారని చంద్ర రావు నిరసించాడు. "పేరు వచన కవిత నోరైన తిరగని/ బండరాళ్ళు నింపి, బండినిండ/ దుష్ట కృతులు జెప్పి దుంపతెంచదరయ్య" అని కొంతమంది వచవ కవుల



> **"కవిత నీవు నాదు కావ్య వస్తువు నీవు/ కంఠ మందు నీవు, కనుల నీవు/ నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే/ ఏమి చెప్పనయ్య భీమరాయ" అంటూ చోడగిరి చంద్రరావు అంబేద్కర్ స్ఫూర్తిని ఆవాహన చేసుకొని, ఆయన రాజకీయ, సామాజిక లక్ష్యాలను సుబోధకంగా పద్యీకరించాడు.**

విపరీత ధోరణులను ప్రశ్నించాడు. వచన కవిత్వాన్ని ఆవరించిన అస్పష్టతను ఈ కవి తీవ్రంగా వ్యతిరేకించాడు. ఏ ఎండకా గొడుగు పట్టే వారిని "కాకా కవీశ్వరుల" అని నిందించాడు.

దివాకర్ల వేంకటావధాని చెప్పినట్టుగా ప్రారంభ దశలో చంద్రరావు "నిష్కపటాను రాగమునకు, మాధుర్యమునకు నిలయమైన భావగీతములు" రచించాడు. ఆత్మాశ్రయ ధోరణిలో ప్రణయ వేదనను కవిత్వంలో రసరమ్యంగా పలికించాడు. "నన్ను కన్నభూమి, నా అన్నదమ్ములన్/ చిత్రహింస జెసి చితుల ద్రోయ/ ప్రేమ కవిత నేను ఏ మొగమ్మున వ్రాతు" నని ఆత్మవిమర్శ చేసుకొని, అసమ సమాజంలో దుర్భరమైన అణచివేతతో కునారిల్లుతున్న తన జాతి జనుల బతుకు వెతలను ఆర్ద్రంగా కవిత్వీకరించాడు. తీయనైన అబద్ధాలను శిల్పశోభితంగా వర్ణించడం కంటే వేదనాభరితమైన చేదునిజాలను సరళ సుందరంగా ప్రజలకు తెలియజెప్పాలనే సమున్నత సంకల్పంతో అట్టడుగు జన సమూహం వైపు చంద్రరావు చూపు సారించాడు. "విసిరేసిన విస్తరి కోసం కుక్కలతో పోరాడే" ఆగర్భదరిద్రులను, రూపాయి కోసం మండే ఎండలో తమ రూపాన్ని కరిగించుకుంటున్న మట్టిమనుషులను, రక్కసిమూకల కర్కశత్వానికి బలవుతున్న దిక్కులేని మానవతులను దర్శించి, వారి వేడి కన్నీటి బాష్పాలకు కవితాభాష్యం చెప్పాడు. "దీనుల బాధల చీకటి/ దీపావళినే మ్రింగును/ దీనుల కన్నీటి ఝరులు/ దిక్కులన్నీ ముంచెత్తును" అని దీన మానవ జీవన స్థితిగతుల ఎరుకతో దీపావళిని అభివర్ణించాడు. బూర్జువా వర్గం నశించి, కార్మిక వర్గం గెలిచినప్పుడే నిజమైన దీపావళి యని చంద్రరావు భావించాడు. "భక్తులు పుట్టిన దేశంలో, శక్తులు పుట్టిన దేశంలో, భక్తి మరిగిన దేశంలో" కొందరికి భుక్తి ఎందుకు కరువైందని చంద్రరావు ప్రశ్నించాడు.

కవికి భావుకత ఎంత ముఖ్యమో భావజాలపరమైన పరిణతి కూడా అంతే ముఖ్యం. వైవిధ్యంతో పాటు, వైరుధ్య భరితమైన భారతీయ సమాజ స్వరూప స్వభావాలను అర్థం చేసుకొని కవితా రచన చేయడానికి స్పష్టమైన తాత్విక మార్గం అవసరం. చంద్రరావు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ తాత్విక పథంలో వడి వడిగా ముందుకు సాగిపోయాడు. కాకినాడ, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో అంబేద్కర్ చైతన్యం గోదావరి నదిలా పరవళ్ళ తొక్కుతుంది. ఈలివాడవల్లి, కుసుమ ధర్మన్న తదితర నాయకుల, కవుల ప్రభావంతో చంద్రరావు అంబేద్కర్ ఆలోచనలను, ఆశయాలను అందిపుచ్చుకున్నాడు. యుక్త వయస్సు నుండే ఈ కవి అంబేద్కర్‌ను గురువుగా, ప్రియనేతగా ఆరాధించాడు. అంబేద్కర్ మరణించినపుడు తెలుగులో తొలి స్మృతి గీతం రాసింది కూడా చంద్రరావే. "నీ జీవితమును ఆదర్శముగ నిడుకొని బ్రతికెదమయ్య/ నీ ఆశయములు నెరవేరగ నిరతము పోరెద మయ్య/ నీ నవయానమును మేలుగ పథముగ నెంచి/ నీవు నడిచిన పథమును విడువగ లేము" అంటూ అంబేద్కర్‌కు ఈ కవి గేయ నీరాజనం సమర్పించాడు. ఆ మహనీయుని ఆశయ సాధనకు పునరంకితం కావడమే ఆయనకు నిజమైన నివాళి అనిభావించిన చంద్రరావు ఈ దిశగాతన కవిత్వాన్ని పుటం పెట్టుకున్నాడు. కాకినాడలో 'భీమ సాహితీ స్రవంతి' అనే సంస్థను స్థాపించి అంబేద్కర్ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు. 'భీమ కవిని' నేను అని సగర్వంగా చెప్పుకున్నాడు. "ఏమి చెప్పనయ్య భీమ రాయా!" అనే మకుటంతో మూడు భాగాలుగా భీమశతకం రచించాడు. చంద్రరావు రచనల్లో భీమ శతకం అత్యంత విశిష్టమైనది. దళిత సాహిత్యానికి తాత్విక భూమికను అందించిన ఈ శతకం ఆధునిక సాహిత్యంలో అంబేద్కర్ ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

వ్యక్తిపూజతో చంద్రరావు ఈ శతకం రాయలేదు. బహుముఖీనమైన 'భీమ' తాత్విక ఎరుకతో ఆయన ఈ శతకాన్ని రాశాడు. "కవిత నీవు నాదు కావ్య వస్తువు నీవు/ కంఠ మందు నీవు, కనుల నీవు/ నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే/ ఏమి చెప్పనయ్య భీమరాయ" అంటూ చంద్రరావు అసామాన్యమైన అంబేద్కర్ స్ఫూర్తిని ఆవాహన చేసుకొని, ఆయన రాజకీయ, సామాజిక లక్ష్యాలను సుబోధకంగా పద్యీకరించాడు. అంబేద్కర్ ఆలోచనల వెలుగుల్లోనే కుల మత, వర్గాల ప్రాతిపదికగా రూపుదిద్దుకున్న మనువాదాన్ని, సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలను చంద్రరావు తన కవిత్వం ద్వారా ఖండించాడు. మనిషి బతుకును మతంతో ముడివేసి, మనిషి గుండెను గుడిలో దాచిపెట్టి, మనిషి తెలివిని మంటగలిపారని అర్థ శతాబ్దం క్రితం చంద్రరావు రాసిన కవిత్వానికి ఈనాటికీ ప్రాసంగికత ఉందని చెప్పవచ్చు. "ఆవు పేడ కన్న అంత తక్కువ వీడు/ మంత్రియైన ముఖ్య మంత్రియైన/ ఎవడు సృష్టి జేసె నీ కులమ్ముల తండ్రీ" అని ఎందెందు వెదకినా అందందు బుసలు కొట్టే నాలుగు పడగల నాగరాజు కుటిలత్వాన్ని చంద్రరావు బట్ట బయలు చేశాడు. సర్పంచి నుండి దేశాధ్యక్షుడి వరకు ప్రోటోకాల్ కఠినంగా కులసర్పం చేసిన గాయాలకు లెక్కలేదు. "కులహీనుడని గొడ్డళ్లతో గొట్టి/ గునపములను దించి గుండెలందు/ ఇళ్ళు తగుల బెట్టనేమి మా నేరమ్ము" అని కులం పేరుతో జరుగుతున్న సామాజిక హింసను చంద్రరావు వాస్తవ దృష్టితో అక్షరబద్ధం చేశాడు. కులాధిపత్యాన్ని, దళిత ఉపకులాల మధ్య రగులుతున్న అంతరాలను తద్వారా సంభవించే ప్రమాదాలను హెచ్చరించి, కులనిర్మూలన ఆవశ్యకతను చంద్రరావు తన పద్యాల ద్వారా ఆమోదయోగ్యంగా నిరూపించాడు.

గౌతమబుద్ధుని ఔన్నత్యాన్ని, ఆయన బోధించిన శాంతి సందేశాన్ని, ప్రేమైక దృష్టిని, జీవకారుణ్యాన్ని చంద్రరావు కవిత్వంలో పలికించాడు. అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో ఈనాడు వెలువడుతున్న సాహిత్య తత్వానికి చంద్రరావు రచనలు వెలుగు దారులుగా నిలుస్తాయి. అంబేద్కర్ గురించి విశ్వవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సందర్భంలో భీమ దృక్పథాన్ని సమర్థవంతంగా చాటి చెప్పిన చోడగిరి చంద్రరావు కవిత్వాన్ని మరింత గాఢంగా అధ్యయనం చేయవలసిన అవసరముంది.

కోయి కోటేశ్వరరావు
94404 80274

కవిగాయక సమూహ గానం

దేశం ప్రమాదంలో ఉన్న ప్రస్తుత సందర్భంలో 'ప్రజాస్వామిక లౌకిక రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కలం గళం ఎత్తుదాం!' అనే నినాదంతో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో 'కవి గాయక సమూహ గానం' కార్యక్రమం ఏప్రిల్ 21 రాత్రి 9 గంటలకు దొడ్డి కొమురయ్య హాల్, సుందరయ్య భవన్, హైదరాబాద్‌లో జరుగుతుంది. మొత్తం పన్నెండు సెషన్లలో సభలు జరుగుతాయి. కె.శ్రీనివాస్, కె. శివారెడ్డి, పసునూరి రవీందర్, గోరటి వెంకన్న, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, జయరాజు, కవి యాకూబ్, మాస్టార్జీ, మెర్సీ మార్గరెట్, సిద్ధార్థ, జ్వలిత, ప్రసేన్, నరేష్కుమార్ సూఫీ, నిజం, నాళేశ్వరం శంకరం, కోయి కోటేశ్వరరావు, కటుకోజ్వల ఆనందాచారి, ప్రసాద మూర్తి, జూపాక సుభద్ర, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, సీతారాం, ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు ఈ సభలో పాల్గొంటారు.

సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్

అనుమంద్రం ఆవిష్కరణ సభ

రాళ్ళబండి శశిశ్రీ కవితా సంపుటి 'అనుమంద్రం' ఆవిష్కరణ సభ ఏప్రిల్ 17 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. తల్లావజ్ఝల శివాజీ, అనిల్ డ్యాని, కవి యాకూబ్, మామిడి హరికృష్ణ; వక్తలుగా- అంబటి సురేంద్ర రాజు, ఘంటశాల నిర్మల, సిద్ధార్థ పాల్గొంటారు.

బోధి ఫౌండేషన్

నెచ్చెలి కథ, కవితా పోటీలు

నెచ్చెలి ఐదవ వార్షికోత్సవం (జూలై10, 2024) సందర్భంగా నిర్వహిస్తున్న ద్వితీయ కథ, కవితా పురస్కార పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నాం. కథలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000. కవితలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ. 1500, రూ.1000, రూ.750. ఇతివృత్తం స్త్రీలకు సంబంధించిన అంశమై ఉండాలి. వర్డ్ ఫైల్‌లో కథలు పది పేజీలకు మించకుండా, కవితలు 2 పేజీలకు మించకుండా యూనికోడ్‌లో పీడీఎఫ్‌తో పాటు పంపాలి. ఈ-మెయిలు మీద 'నెచ్చెలి - కథ - కవితల పోటీ - 2024కి' అని రాసి editor@neccheli.comకు మే 10లోగా పంపాలి.

కె. గీత

ఆత్మీయ సభ


బుర్రా లక్ష్మీనారాయణ సంస్మరణార్థం ఆత్మీయ సభ ఏప్రిల్ 15 సా.6గంటలకు సుందరయ్య కళానిలయం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో రూప్ కుమార్ డబ్బీకార్, కె.వి.ఎస్.వర్మ, ఏనుగు నరసింహారెడ్డి, ఎం.నారాయణశర్మ, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ పాల్గొంటారు.

గుడిపాటి

కవిత్వంపై ముఖాముఖి

అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ చైతన్య సాహితి సంయుక్త ఆధ్వర్యంలో వరుకుల శివకుమార్ కవిత్వం 'వేళ్ళరహస్యం'తో ముఖాముఖి సమావేశం ఏప్రిల్ 20 సా.5గంటలకు 'ముఖ్దుంభవన్' హిమాయత్‌నగర్‌లో జరుగుతుంది.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్



మౌనం

నేను కవిత్వం రాస్తున్న కొత్తలో
ఎవరిదైన కవిత్వం చదువుతుంటే
ఒక్కొక్కసారి ఆశ్చర్యపోయి
ఒక్కో వాక్యం దగ్గరే
పిడిగుద్దు గుద్దినవాడిలా నిశ్శబ్దుణ్ణయ్యేవాణ్ణి.

నా జీవితం ఇతనికెలా తెలిసిందని
తెగ ఆలోచించి
ఆ రాసిన కవి వంక అదోలా చూస్తూ నిలబడేది.

మనం అనుభవిస్తున్న వర్తమాన జీవితంలోనో
గతంలో నుండో ఒక సన్నివేశం
మరొక కవి రాసుకొచ్చినా
అదొక ఎడతెగని అనుభూతిలా మన పుస్తకంలో
జ్ఞాపకంగా మిగిలిన నెమలీకలా మిగిలిపోతది.

నేను మోకాళ్లను భూమికి ఆనించి
అడవిలో ఊటసెలిమె దగ్గర నీళ్ళు తాగి
దప్పిక తీర్చుకున్న రహస్య దృశ్యాన్ని
ఎవరో ఓ కవి రాసుకొస్తే
ఆ వాక్యం ముగిసిన చుక్క దగ్గరే ఆగిపోయేవాణ్ణి.

వాన ముసురు పట్టుకుంటే
గోనె కొప్పెర గప్పుకొని మట్టిమిద్దె మీద గవాసి మీద
పగిలిన కుండ పెంకుల్ని మూసి వస్తుంటే
చటుక్కున మెరిసిన మెరుపులో
నా గుండె పగిలిన శబ్దం రాసిన కవి వద్దే
నేను మోకరిల్లుత.

నీళ్ళు దొర్కని ఎండకాలంలో
దిగుడుబాయిల దిగి రెండు బిందెలను భుజం మీద
మోసుకొస్తుంటే బండ మీద నుండి జారి
బావిలో పడి మోకాటిసిప్పలకు గాయమైతే
ఆ సంఘటనను రాసిన కలానికి ప్రణమిల్లుతా.

పల్లె వాకిట పండు వెన్నెల రాలుతున్నప్పుడు
పిలువని పెండ్లికిపోయి ఇసుకకుప్పలమీద
పడుకుంటే ఆ రాత్రి నా కండ్లల్లోకి వచ్చిన
పంచవన్నెల జింకపిల్ల వేటను
అచ్చుగుద్దినట్లు పాటగా వినబడితే ఆ క్షణం
ఆ కలం బట్టిన చేతికింద బానిసగా మారిపోత.

అద్దుమరాత్రి దీపం వెలుగులో
వరిసేనుకు నీళ్ళు పారబెట్టబోయి
పక్కపొలంలో కూడా అటువంటి దీపం వెలుగే కనవడ్తే
లోలోపల మనిషున్నడనే ధైర్యం తెచ్చుకొని
పొలం గెట్ల మీదనే కునికిపాట్లు పడిన గడ్డుకాలాన్ని
ఏ కవైన పట్టుకుంటే
ఆ కవిని ఏడు రంగుల గుర్రం బండి మీద ఊరేగిస్తా.

అవనిశ్రీ
99854 19424



బల్దియా అధికారులు వాడుతున్న తెలుపు రంగు నెంబర్ ప్లేట్ వాహనాలు

మన బండే.. పెట్టేయ్..

- బల్దియాలో వాహనాల కేటాయింపులో కక్కుర్తి
- సొంత కార్లను వినియోగిస్తున్న కొందరు అధికారులు
- టాక్సీ కార్లకు బదులు సొంత వాహనాల వాడకం
- నిరుద్యోగుల పొట్టలు కొడుతున్న వైనం
- కమిషనర్ స్పందించాలని వేడుకోలు
- ఈ యేడు నుంచైనా నిబంధనలు పాటించాలని వినతి

> వారికి నెలకు లక్షల్లో జీతాలు వస్తుంటాయి.. మళ్లీ ప్రభుత్వం నుంచి వచ్చే ప్రత్యేక అలవెన్సులు పొందుతారు. అయినా అక్కడక్కడా హస్తవాసి ఉపయోగించడం షరా మామూలే.. ఇన్ని అవకాశాలున్నా వారికి ధనాపేక్ష ఆగలేదు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో అద్దె కార్ల కేటాయింపులో స్వార్థ బుద్ధి ప్రదర్శిస్తున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులకు కేటాయించే ప్రైవేటు అద్దెవాహనాల విషయంలో కొందరు అధికార దాహాన్ని చూపిస్తున్నారు. నిరుద్యోగులకు జీవన భృతి కోసం ప్రభుత్వం నుంచి ఇచ్చిన కార్లు (వాహనాలు) కాదని.. సొంత వాహనాలను పెట్టుకుంటున్నారు. అడ్డదారిలో కోట్లు సంపాదించి నిరుద్యోగుల పొట్టకొడుతున్నారు. రోజువారి డ్రైవర్లు, ఓనర్ల కుటుంబాలను బజారునేస్తున్నారు.

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 14: వరంగల్ బల్దియా కేంద్రంగా అక్రమంగా వాహనాల కేటాయింపు యథేచ్ఛగా జరుగుతోంది. బల్దియా పరిధిలో వివిధ హోదాల్లో పని చేస్తున్న అధికారులకు నడిపేందుకు 36 అద్దె కార్లు కేటాయించగా.. వీటిలో పెద్ద మొత్తంలో అధికారుల సొంత వాహనాలే వినియోగిస్తున్నారు. పసుపు పచ్చ నెంబర్ ప్లేటు వాహనాల స్థానంలో తెలుపు (సొంత) నెంబర్ ప్లేటు ఉన్న వాహనాలను పెట్టేసుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, బ్యాంకులు, దళిత బంధు పథకం ద్వారా నిరుద్యోగులు తీసుకున్న వాహనాలకు కార్పొరేషన్‌లో అద్దెకు ఉపయోగించాల్సి ఉండగా, నిబంధనలు కాదని సొంత కార్లలో చక్కర్లు కొడుతున్నారు. అయితే కొందరు అధికారులు నిరుద్యోగుల అద్దె కార్లు వాడుతున్నప్పటికీ సమయానికి బిల్లులు చెల్లించడంలో కావాలనే కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులకు వాహనాలు

నగర పాలక సంస్థ పరిధిలోని పలు వింగ్ అధికారులకు 36 కార్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ అనుమతినిచ్చింది. ఇందులో కమిషనర్, మేయర్‌లకు ప్రభుత్వ వాహనాలు కేటాయించగా, సీపీ, టీపీవోలకు ఒక్కో వాహనం, ఇద్దరు డీసీలు, నలుగురు ఆర్వోలు, ఒక ఏసీ, ఇద్దరు ఎస్ఈలను కలుపుకుని 10 వాహనాలు ఉన్నతాధికారులకు కేటాయించింది. మిగతా 26 వాహనాలు డీఈ, ఈఈ, టీపీవో, సీఎంహెచ్‌వోకు కేటాయించారు. వీరి వాహనాలకు ప్రభుత్వం ప్రతీ నెల రూ.33వేలు అద్దె చెల్లిస్తోంది. జీవో ఎంఎస్ నెంబరు 170 ఫైనాన్స్ ఇయర్ 2017 ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే అధికారుల సౌకర్యార్థం నిరుద్యోగుల నుంచి పసుపు పచ్చ నెంబర్ ప్లేటు కలిసిన వాహనాలను టెండర్ల ద్వారా పిలిచి అగ్రిమెంట్ ప్రకారం కార్ల కేటాయింపు జరపాలి.



సొంతవే వినియోగం

వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొందరు అధికారులు తమ భార్య, పిల్లలు, బంధువులు, అనుయాయుల పేర్ల మీద వాహనాలు కొనుగోలు చేసి కార్యాలయంలో పెట్టుకుంటున్నట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక ప్రభుత్వ అధికారికి కేటాయించే వాహనానికి ఎల్లో నెంబర్ ప్లేట్, ఆరు మాసాల పొల్యూషన్ సర్టిఫికెట్, ఒక సంవత్సరం ఇన్సూరెన్స్, వాహన యజమానికి బ్యాడ్జీ సర్టిఫికెట్, లైసెన్స్ కలిగి ఉండాలి. కానీ కొందరు కక్కుర్తి అధికారులు వారే స్వయంగా వాహనం నడపడం, బంధువులు, లేదా శానిటేషన్ సిబ్బందిని సొంత పనులకు, వాహనాలకు డ్రైవర్లుగా ఉపయోగించుకుని వచ్చిన డబ్బులు జేబులో వేసుకుంటున్నట్టు నిరుద్యోగులు తెలిపారు..

నిరుద్యోగుల నిరాశ

అయితే బల్దియాలో కొందరు అధికారులు నిబంధనలు అతిక్రమించి సొంత వాహనాలను వినియోగిస్తూ నెలవారిగా వచ్చే డబ్బులను జేబులో వేసుకుంటున్నారు. అంతేకాక నిరుద్యోగుల పొట్టకొడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అయితే వాహనాలు వినియోగించే అధికారులు.. ప్రతీ నెల డబ్బులు తీసుకోవాలంటే లాగ్ బుక్ నింపాల్సి ఉంది. కానీ ఆ నిబంధన ఎక్కడా కనిపించడం లేదు.

దృష్టి పెట్టాలి..

పదేళ్లుగా బల్దియా కార్యాలయం కేంద్రంగా ఉన్నతస్థాయి అధికారులు ప్రైవేటు అద్దె కార్లకు బదులు సొంత వాహనాలు వాడుతున్నట్టు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందాయి. కానీ వరంగల్ బల్దియాలో పని చేయడానికి వచ్చిన అధికారులు రెండు, మూడు మాసాలకంటే ఎక్కువ రోజులు పని చేయకపోవడం శాపంగా మారింది. చాలామంది అధికారులు అద్దె కార్ల సమస్యను చక్కదిద్దాలనే అనుకున్న తరుణంలోనే బదిలీ కావడంతో సమస్య తిరిగి మొదటికి వస్తోంది. కొత్తగా వచ్చిన కమిషనర్ పట్టించుకుంటే తప్ప.. ఈ అడ్డదారి వాహనాలకు అడ్డుకట్ట వేయలేమని నిరుద్యోగులు పేర్కొంటున్నారు.



కొత్త నిబంధనలు

ఈ యేడు మార్చి 31న వార్షిక సంవత్సరం ముగియగా కార్పొరేషన్‌కు పెట్టిన అద్దె కార్ల అగ్రిమెంట్ కూడా ముగిసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసిన తర్వాత వాహనాలకు ఎంపిక చేసి అధికారులకు కేటాయించనున్నట్లు గ్రేటర్ అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలు ఎంపిక చేసి అధికారులకు ఇవ్వాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఆదివారం ఉష్ణోగ్రత | గరిష్ఠం : 38.0° C | కనిష్ఠం : 24.5° C



హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం కావ్య

అంబేద్కర్ గొప్ప దార్శనికుడు

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఘనంగా అంబేద్కర్ జయంతి

వడ్డెపల్లి, ఏప్రిల్ 14 : రాజ్యాంగ నిర్మాత, భారత తొలి న్యాయశాఖ మంత్రి అంబేద్కర్ గొప్ప దార్శనికుడు, ప్రపంచ మేధావి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సాంఘీక సంక్షేమ జిల్లా అధికారి నిర్మల, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కాంగ్రెస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళాసంపత్ యాదవ్, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, వేముల శ్రీనివాస్ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కుల, మత రహిత, ఆధునిక భారతావని కోసం అంబేద్కర్ జీవిత కాలం పోరాటం చేశారని అన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్, ప్రజా సంఘాల నాయకులు బొట్ల చక్రపాణి, వాంకుడోత్ వీరన్న, కర్రె భిక్షపతి, కన్నం సునిల్, కాంగ్రెస్ నేతలు బంక సంపత్ యాదవ్, మండల సమ్మయ్య, అజ్మీరా వెంకట్ పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



నివాళులర్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

8



గులాబీలతో దర్శనమిస్తున్న అమ్మవారు

భద్రకాళికి లక్ష గులాబీ అర్చన

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 14: వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి దేవాలయంలో కొనసాగుతున్న వసంత నవరాత్రోత్సవాలు ఆదివారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి సుప్రభాత సేవ, నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం నవరాత్రోత్సవాల్లో భాగంగా జపం, హోమం, అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్ష సెంట్ గులాబీలతో పుష్పార్చన నిర్వహించారు. అనంతరం విశేష భోగములతో మహా నివేదన చేశారు. శష్ఠి దేవతకు అది దేవత స్కంధుడు ఆదివారం రోజు దేవత సూర్యుడు. సూర్యుడి ద్వారా లోకానికి వెలుగును ప్రసాదించేది ఆ జగన్మాతే కాబట్టి ఆదివారం అమ్మవారికి గులాబీ వెలుగుపూలతో అర్చన నిర్వహించినట్లు ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన జేవీఎస్ శ్రీధర్, జేఎస్ఎల్ పావని, కుమారి శ్రీయలు అమ్మవారి పుష్పాలంకరణ సేవాకర్తలుగా ఉన్నారు. ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేషుభారతి నేతృత్వంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీజేపీకి మళ్లీ అధికారమిస్తే అంధకారమే..

- రాజ్యాంగాన్ని మారుస్తారు..
- అంబేద్కర్ విగ్రహాలను తొలగిస్తారు..
- ఇంటి ఆడబిడ్డగా ఆదరించండి..
- కాంగ్రెస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య
- పరకాలలో వరంగల్ లోక్‌సభ స్థాయి సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

పరకాల, ఏప్రిల్ 14: బీజేపీకి మళ్లీ అధికారం ఇస్తే దేశం అంధకారం అవుతుందని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ రాజ్యాంగాన్ని రద్దు చేయడంతోపాటు అంబేద్కర్ విగ్రహాలను తొలగిస్తారని తెలిపారు. ఆదివారం పరకాల పట్టణంలోని లలితా కన్వెన్షన్ హాలులో లోక్‌సభ సన్నాహక సమావేశం పరకాల నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తలతో నిర్వహించారు. ఈ సమావేశానికి లోక్‌సభ ఇన్‌చార్జిగా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య పాల్గొని మాట్లాడారు. రాముడు అందరి దేవుడని, బీజేపీ వారికే మాత్రమే దేవుడు కాదని పేర్కొన్నారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్నా బీజేపీ రాష్ట్రానికి ఏమీ చేయలేదన్నారు. బీజేపీ మాయమాటలు నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ తన వ్యాపారాలను పెంచుకునేందుకు రైతులను ఇబ్బంది పెట్టింది అందరికీ తెలిసిన విషయమేనన్నారు. రమేశ్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు అభ్యర్థులు కరువయ్యారని, అందుకే సుధీర్‌కుమార్‌ను నిలబెట్టారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ అని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించాలని ఆమె కోరారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే ఐదు హామీలు అమలవుతాయని తెలిపారు.

ప్రజలకు సేవ చేయడం తనకేమీ కొత్త కాదని, ఎనిమిదేళ్లుగా మహిళలకు, పిల్లలకు ఆరోగ్యపరంగా ఎన్నో సేవలు అందిస్తున్నానని కావ్య తెలిపారు. ఎంపీగా గెలిచాక కేంద్రం నిధులతో వరంగల్ ప్రాంతాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. తనతో పాటుగా రాష్ట్రంలో 14 మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా చూడాలని అన్నారు. మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించి లోక్‌సభ ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించాలని కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, యశస్వినిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, గన్నోజు శ్రీనివాసాచారి, మొలుగూరి భిక్షపతి, కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, పంచగిరి జయమ్మ, సోదా రామకృష్ణ, పూజారి సాంబయ్య, గోల్కొండ సదానందం తదితరులు పాల్గొన్నారు.

కొండా వర్గీయుల హల్‌చల్

పరకాల పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ వరంగల్ లోక్‌సభ స్థాయి సన్నాహక సమావేశంలో కొండా వర్గీయులు హల్‌చల్ చేశారు. అరగంట పాటు 'జిల్లా టైగర్ కొండా మురళి' అంటూ నినాదాలు చేస్తూ స్టేజీపైకి దూసుకెళ్లారు. పక్కనే ఉన్న పోలీసులు కల్పించుకొని కాంగ్రెస్ నాయకుడు గజ్జి విష్ణుతోపాటు కొండా వర్గీయులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేజీపై ఉన్న డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆందోళన చేసిన గజ్జి విష్ణును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. గజ్జి విష్ణును విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద ధర్నాకు ఉపక్రమించడంతో వెంటనే పోలీసులు చేరుకొని ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఆందోళన చేస్తే కేసులు పెడతామని పంపించారు. చివరకు గజ్జి విష్ణును విడిచిపెట్టారు.



వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అమ్మను తిడుతోందని నానమ్మ హత్య

- 13 ఏళ్ల బాలుడి ఘాతుకం
- జనగామ జిల్లాలో దారుణ ఘటన

జఫర్‌గడ్, ఏప్రిల్ 14: తల్లిని తరచుగా దూషిస్తూ గొడవ పెట్టుకుంటోందని ఆగ్రహించిన 13 ఏళ్ల మనవడు.. 65 ఏళ్ల వయసున్న నానమ్మను కత్తితో పొడిచి చంపిన దారుణ ఘటన జనగామ జిల్లాలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జఫర్‌గడ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరి వివాహాలు చేశారు. కొడుకు సుమారు పదేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటికే ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పటి నుంచి కోడలు, ఇద్దరు మనవలతో కలిసి అందరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు.

అయితే కొన్నాళ్లుగా అత్తాకోడళ్ల మధ్య కుటుంబ సమస్యలపై తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా పరస్పర దూషణలతో తీవ్రంగా గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన చిన్న మనవడు కత్తితో నానమ్మ ఛాతిపై పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి కింద పడిపోయింది. కుటుంబీకులు వెంటనే ఆమెను అదే రాత్రి హనుమకొండ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలోనే చనిపోయింది. ఆలస్యంగా సమాచారం అందుకున్న వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్, జఫర్‌గడ్ ఎస్ఐ శీలం రవియాదవ్ ఆదివారం ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొంతగూటికి రాజయ్య

- కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14: స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఎట్టకేలకు సొంతగూటికి చేరుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో ఆదివారం సిద్ధిపేట జిల్లా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో రాజయ్య అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు టికెట్ రానందుకు నిరసనగా ఫిబ్రవరి 3న బీఆర్ఎస్ పార్టీకి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వారం రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర అనుచరులు రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దంటూ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. అయినప్పటికీ రాజయ్య సీఎం రేవంత్ రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను, మంత్రులను కలిసి పార్టీ చేరిక అంశమై చర్చించారు. అయినా రాజయ్యకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఆహ్వానం రాలేదు.

ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్చి 13న వరంగల్ లోక్‌సభ టికెట్‌ను కడియం కావ్యకు ఇస్తున్నట్లు ప్రకటించారు. తదనంతరం మార్చి 28న బీఆర్ఎస్ పార్టీ నుంచి తాను పోటీ చేయనని కావ్య టికెట్‌ను నిరాకరిస్తూ కేసీఆర్‌కు లేఖ రాశారు. మార్చి 29న కాంగ్రెస్ నాయకులు కడియంను పార్టీలోకి ఆహ్వానించడం, 31న కడియం శ్రీహరి, కావ్య రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం, ఏప్రిల్ 1న వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ప్రకటించడం వరుసగా జరిగిపోయాయి. అప్పటి నుంచి రాజయ్య బీఆర్ఎస్ పార్టీ తనకు వరంగల్ లోక్‌సభ టికెట్ ఇస్తే తిరిగి పార్టీలో చేరడానికి సిద్ధమయ్యారు. ఈ నెల 12న ఎంపీ టికెట్ రాజయ్యకు ప్రకటిస్తారనే వార్తలు రావడంతో రాజయ్య ఎర్రవెల్లికి వెళ్లారు. కానీ చివరికి కేసీఆర్ హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ పేరును ప్రకటించడంతో రాజయ్య ఎర్రవెల్లిలో కేసీఆర్‌ను కలువకుండానే వెనుదిరిగారు. చివరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజయ్య ఆదివారం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

మైనారిటీ నిరుద్యోగులకు చక్కటి అవకాశం

వడ్డేపల్లి, ఏప్రిల్ 14 : మైనారిటీల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తోంది. పోటీ పరీక్షల కోసం మైనారిటీ ఉద్యోగులకు ఉచిత శిక్షణను ఇస్తూ వారిని ప్రోత్సహిస్తోంది. యూపీఎస్సీ- సీఎస్ఏటీ- 2025 పరీక్ష కోసం 2024-25 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ 100 మంది మైనారిటీస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తుంది. రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో దివ్యాంగులకు 5 శాతం సీట్లను కేటాయించారు.

దరఖాస్తు చేసుకునే విధానం

యూపీఎస్సీ (సీఎస్ఏటీ- 2025) సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్టులో ప్రవేశం కోసం అన్ని జిల్లాల్లోని సాధారణ/ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థులు ఈ నెల 22 లోగా ఆన్‌లైన్ లో గిగిగ్డిరుట్యుజెట్ట జ్యూఱఙ్య.ఛిజుజౌరి.జీ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. స్క్రీనింగ్ టెస్టు ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మేన శ్రీను, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి



ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని జిల్లాలోని మైనారిటీస్ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. డిగ్రీ పూర్తి చేసిన సాధారణ, ప్రొఫెషనల్ అభ్యర్థులు ఈ నెల 22 లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను చేసుకోవాలి. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపాదికన నిర్వహిస్తారు. ఈ నెల 28న నిర్వహించే స్క్రీనింగ్ టెస్టులో మైనారిటీ అభ్యర్థులు పాల్గొనాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు : 040- 23236112 లో సంప్రదించాలి.

కడియం కావ్యకే మా మద్దతు


ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన దళిత సంఘాల నేతలు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 14 : వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు తెలంగాణ మాదిగ దండోరా, టీ ఎమ్మార్పీఎస్, తెలంగాణ బైండ్ల సంఘం, మాల మహానాడు నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న తెలిపారు. ఆదివారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో కలిసి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించి మంద కృష్ణ మాదిగకు తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. వర్గీకరణ పేరుతో మాదిగలను, మాదిగ ఉప కులాలను మంద కృష్ణ మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ జాతికే ద్రోహం చేయాలని చూస్తున్నారని, దేశ వ్యాప్తంగా దళితుల ఊచ కోతకోస్తున్న బీజేపీ పంచనచేరి ఏ విధంగా ఓటు అడుతున్నాడో చెప్పాలని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని దేశాన్ని మతతత్వ పార్టీ నుంచి కాపాడుకోవాలని కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపకులు జన్ను కనకరాజు, జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం, రాష్ట్ర అధ్యక్షుడు కోరిపెల్లి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మారావు, బైండ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అదుళ్ల గౌరిశంకర్, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి పసుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై కుట్ర


హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ మినీ స్టేడియం

- అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు చుక్కెదురు
- స్పోర్ట్స్ హాస్టల్ నుంచి తరలించేందుకు ప్రయత్నాలు
- అంతర్మథనంలో క్రీడాకారులు.. ఖండిస్తున్న క్రీడా సంఘాలు
- ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 14 : అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ హాస్టల్ అందని ద్రాక్షగా మారుతోందనే సమాచారంతో అంతర్మథనం చెందుతున్నారు. యేళ్లతరబడి అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడల్లో అద్భుత ప్రతిభ చాటుతూ స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినక్రీడాకారులను ఇక్కడి నుంచి తరలించాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వస్తున్న వార్తలతో ఆందోళన చెందుతున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాలతో రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లోని అథ్లెట్లకు వేరే ప్రాంతాలకు పంపించే యోచనలో స్పోర్ట్స్ అధికారులు ఉన్నట్లు తెలిసి క్రీడాకారులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల కేంద్రంగా పేరుగాంచిన హనుమకొండలోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ తీరుపై జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు స్పందించాలని పలు క్రీడా సంఘాల బాధ్యులు వేడుకుంటున్నారు.


హనుమకొండ జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్

తరలింపు ఆలోచన

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) ఆధ్వర్యంలో మూడు దశాబ్దాల నుంచి రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా రాణించిన క్రీడాకారులకు వసతి కల్పిస్తూ క్రీడల్లో శిక్షణ అందిస్తోంది. అయితే జిమ్నాస్టిక్ క్రీడాకారులను మినహాయించి అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నం జరుగుతోందనే వాదనలతో క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడలను హాస్టల్ నుంచి తొలగించి వాటి స్థానంలో మరో రెండు క్రీడలను అనుమతించే అవకాశం ఉందని పలువురు క్రీడా సంఘాల సభ్యులు అనుమానవ్యక్తం చేస్తున్నారు.

కొందరి కుట్ర

కొందరు వ్యక్తులు తమకు అనుకూలంగా ఉన్న క్రీడలను హాస్టల్‌లో వసతి కల్పించాలనే దురాలోచనతోనే అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ హాస్టల్ ఎత్తివేసే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా స్పోర్ట్స్ హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు అనుమతి ఇవ్వకపోవడంతో ఇంతకాలం శిక్షణ పొందిన క్రీడాకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. దీనిపై స్పోర్ట్స్ అధికారులు పునరాలోచన చేయావలసిన అవసరం ఉందని, లేదంటే నిరసనలకు శ్రీకారం చుడతామని క్రీడాకారులు, క్రీడాసంఘాల బాధ్యులు హెచ్చరిస్తున్నారు.

30 ఏళ్ల కిందట

30 ఏళ్ల కిందట టీడీపీ హయాంలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రి దాస్యం ప్రణయ్‌భాస్కర్ ప్రత్యేక చొరవతో జేఎన్ క్రీడా మైదానం అభివృద్ధితో పాటు క్రీడాకారులకు భోజన, బస వసతి కల్పించడానికి రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌ను నిర్మించారు. జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడాకా రులకు వసతితోపాటు పౌష్టికాహారం, అను భవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందిచండం కోసం ఉమ్మడి జిల్లా కేంద్రంగా స్పోర్ట్స్ హాస్టల్ నిర్మించారు. 9 ఏళ్ల వయస్సులోనే క్రీడాకారుల కోసం యేటా డీఎస్ఏ ఆధ్వర్యంలో రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు కల్పిస్తోంది. డీఎస్ఏ ఆధ్వర్యంలో బ్యాటరీటెస్ట్‌లు నిర్వహిస్తూ ప్రతిభ ఆధారంగా స్పోర్ట్స్ హాస్టల్‌కు క్రీడాకారు లను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన క్రీడాకారులుకు మౌలిక వసతులతోపాటు శిక్షణ అందిస్తోంది. నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ క్రీడాకారులకు బాసటగా నిలుస్తూ.. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తాత్కాలిక డీఎస్ఏ కోచ్‌ల పర్యవేక్షణలో జేఎస్ఎస్‌లోని వివిధ మైదానాల్లో పలు క్రీడాంశాలలో శిక్షణను అందిస్తోంది. అలాగే రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో పౌష్టికాహారంతో పాటు క్రీడా దుస్తులు, వసతి సౌకర్యాలను అందిస్తోంది. ప్రధానంగా అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్ క్రీడలతోపాటు పలు క్రీడాంశాలలో ఓనమాలు నేర్చుకొని జాతీయ, అంతర్జాతీ య క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. స్పోర్ట్స్ కోటా లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో వందలాదిగా ఉద్యోగాలు పొందారు.

మాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు..

జి.అశోక్‌కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి



రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే చోటికి తరలించాలని మాకు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదు. ఇటీవల హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది వాస్తవమే. అందులో ఇక్కడి క్రీడాకారుల ప్రతిభ, స్పోర్ట్స్ హాస్టల్ నిర్వహణ వంటి అంశాలపై చర్చ జరిగింది.

క్రీడాకారులకు నష్టం జరుగుతుంది..

బైరబోయిన కైలాస్ యాదవ్, వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి



రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే చోటికి తరలిస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. క్రీడాకారులను ఉన్న ఫలంగా హాస్టల్ నుంచి పంపించే ప్రయత్నం సరైందికాదు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల మనోవేదనను అర్థం చేసుకొని జిల్లా క్రీడాశాఖ అధికారులు సాట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి హాస్టల్‌ను క్రీడాకారులను వేరే చోటుకు తరలించకుండా పునరాలోచన చేయాల్సి ఉంది.

తరలించే ప్రయత్నం సరైందికాదు

ఇండ్ల నాగేశ్వర్‌రావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు



రీజినల్ స్పోర్ట్స్‌హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నం సరైందికాదు. దీనిని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. అందుబాటులో ఉన్న అకాడమీ, స్పోర్ట్స్ హాస్టల్‌లో మౌలిక వసతులను కల్పించకుండా కొందరు స్వార్థపరులు క్రీడాకారులను అంధకారంలోకి తీసుకపోయే ప్రమాదం ఉంది. నగరంలో నూతన అకాడమీల ఏర్పాటుకు స్పోర్ట్స్ అధికారులు, మంత్రులు కొండా సురేఖ, సీతక్క కృషి చేయాలి.

కళాకారులకు పుట్టినిల్లు ఓరుగల్లు

- ఏఐఆర్ మాజీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి

హనుమకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరం కళాకారులకు పుట్టినిల్లని ఆల్ ఇండియా రేడియో మాజీ ఉపసంచాలకుడు చల్లా జైపాల్ రెడ్డి అన్నారు. వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మోటే చిరంజీవి ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ రేడియో కేంద్రం ఎంతోమంది కళాకారుకులకు అవకాశం కల్పించిందని అన్నారు. ఎంతో మంది వ్యాఖ్యాతలు ఇక్కడ పని చేసి పేరు ప్రతిప్రతిష్టలు సంపాదించారని అన్నారు. వ్యాఖ్యాతలకు గతంలో ఉన్న కార్యక్రమాలు ఇప్పుడు లేవని, అలాగే వ్యాఖ్యాతల కార్యక్రమాలు అప్పటి కంటే ఇప్పుడు తగ్గాయని అన్నారు. చక్కటి స్వరంతో కార్యక్రమాలను వ్యాఖ్యాతలు విజయవంతం చేస్తున్నారని అన్నారు. వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం రిటైర్డ్ సీనియర్ వ్యాఖ్యాతలు నెల్లుట్ల సంధ్య, మొగిలిచెర్ల జనార్దన్‌లను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి సన్మానం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. అలాగే రేడియోతో ఉన్న 30 యేళ్ల అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అర్షం సదానందం, గౌరవ సలహాదారు డాక్టర్ ఎల్లయ్య, అసోసియేషన్ నాయకులు ఓదెల కృష్ణ, డాక్టర్ చంద్రశేఖర్, రామక్రిష్ణ, డాక్టర్ శ్రీనివాస్, పంకజ్ మోహన్, స్వప్న, స్వాతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.


ఆల్ ఇండియా రేడియో జర్నలిస్టులతో జైపాల్ రెడ్డి

సౌండ్ పొల్యూషన్ బైక్ స్వాధీనం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్ బైక్ వాడి అతివేగంతో వెళుతున్న వినయ్‌తేజరెడ్డి అనే విద్యార్థిపై కేయూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం సౌండ్‌తో కూడిన సైలెన్సర్ కలిగిన బుల్లెట్‌పై అతివేగంగా వెళుతున్న విద్యార్థిని భీమారం జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. బుల్లెట్ స్వాధీనం చేసుకుని విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెడ్డిపురం కుంటలో మునిగి యువకుడి మృతి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపురం కుంటలో మునిగి యువకుడు మరణించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. హనుమకొండ అగ్నిమాపక శాఖధికారి నాగరాజు కథనం ప్రకారం.. రెడ్డిపురం కుంటలో ఈత కోసం దిగిన యువకుడు మునిగిపోయాడని వచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. బోటు సహాయంతో కుంటలో గాలించగా గంట తర్వాత మృతదేహం లభించింది. యువకుడి ఆచూకీకోసం ఆరాతీయగా రాయపురకు చెందిన వాజీద్ (25)గా గుర్తించారు. కాగా, విచారణ కోసం స్థానిక పోలీసులకు మృతదేహన్ని అప్పగించినట్లు ఫైర్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. మృతదేహన్ని వెలికితీయడంలో హనుమకొండ అగ్నిమాపకశాఖధికారి నాగరాజుతోపాటు వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రవీందర్, హనుమకొండ, వరంగల్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


వాజీద్ మృతదేహం

కేసీఆర్‌ను కలిసిన సుధీర్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు రోజుల కిందట సుధీర్‌కుమార్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అవకాశం దక్కించుకున్న సుధీర్‌కుమార్.. ఆదివారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుధీర్‌కుమార్ వెంట మాజీ ఎమ్మెల్యే రాజయ్య కూడా ఉన్నారు. రాజయ్య ఎంపీ టికెట్ ఆశించినప్పటికీ సుధీర్ కుమార్‌కు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. టికెట్ ఆశించి భంగపడ్డ రాజయ్యను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. అభ్యర్థి సుధీర్ కుమార్‌తో పాటు రాజయ్య మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు.


కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధీర్‌కుమార్

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

- రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు
- రత్నగిరిలో విషాదం

భీమదేవరపల్లి, ఏప్రిల్ 14 : భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన బానోతు రాహుల్ (15) అనే విద్యార్థి రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వంగర ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం తన అమ్మమ్మ గారి ఊరు సిద్దిపేట జిల్లా జిల్లెలగడ్డకు వెళ్లి రాహుల్ తిరిగి వస్తున్నాడు. భీమదేవరపల్లి మండలం మంగళపల్లి శివారులో ట్రాక్టర్ డ్రైవర్ ఆకస్మాత్తుగా మూల మలుపు వద్ద తిప్పడంతో రాహుల్ ద్విచక్రం వాహనానికి ట్రాక్టర్ తగిలి రాహుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాహుల్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ రాహుల్ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. రాహుల్ 2024 మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తు న్నాడు. మండలంలోని వంగర హైస్కూల్లో పదో తరగతి చదివి పరీక్షలు రాశాడు. 15ఏళ్ల బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు.


రాహుల్ (ఫైల్)

నీరుకుళ్లలో సంచరిస్తున్న పునుగు పిల్లలు

- జూపార్క్‌కు తరలించిన ఫారెస్ట్ అధికారులు

ఆత్మకూరు, ఏప్రిల్ 14 : అరుదైన పునుగు పిల్లులు నీరుకుళ్ల గ్రామానికి చెందిన పంచి నేని రాజేశ్వరరావు ఇంట్లో ఆదివారం దర్శనమిచ్చాయి. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో తన ఇంటికి ఉదయం పునుగు పిల్లి కుక్కలను చూసి ఇంట్లోకి వచ్చిందన్నారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి పునుగు పిల్లి అని నిర్ధారించుకుని, బంధించి వరంగ ల్ జూపార్క్‌కు తరలించారు. మరొకటి చెట్ల పొదల్లోకి పారిపోగా కుక్కలు వెంబడించడంతో పారిపోయిందన్నారు. గత వారం క్రితం కుక్కలు వెంబడించి పునుగు పిల్లిని చంపి తిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అరుదైన పునుగు పిల్లి గ్రామంలో సంచరించడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. వెంకటేశ్వరస్వామికి ఎంతో ఇష్టమైన పునుగు పిల్లి తన ఇంట్లోకి రావడంతో ఎంతో అదృష్టంగా వెంకటేశ్వరరావు భావిస్తున్నారు.


బకెట్‌లో దూరిన పునుగు పిల్లి

బియ్యం దొంగలపై నజర్

- ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణా కట్టడికి చర్యలు
- ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- దందా చేసే వారి వివరాల సేకరణలో విజిలెన్స్
- పోలీసులు, ప్రజా ప్రతినిధుల ప్రమేయంపై ఆరా
- కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం



వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దందా చేసేవారిపై కేసులు పెట్టేందుకు సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా చర్యలకు పూనుకున్న ప్రభుత్వం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీడీఎస్ రైస్ కట్టడిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని వరంగల్‌కు పంపింది. పదిరోజులుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రహస్యంగా పర్యటిస్తూ అక్రమార్కుల వివరాలు సేకరిస్తున్నారు. కోట్లలో నడుస్తున్న దందాలో పెద్ద తలకాయలు ఉన్నట్లు సమాచారం ఉండటంతో ఆ కోణంలో కూడా అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల కాళేశ్వరం, ఎల్కతుర్తి, చిల్పూరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. యథేచ్ఛగా సాగుతున్న దందా వెనుక పలువురు పోలీసులు, ప్రజాప్రతిధుల సహకారం అందుతుందనే ఆరోపణలున్నాయి. దందాకు సహకరించే వారికి నెలవారీగా మామూళ్లు అందుతాయని అధికారిక సమాచారం.

ప్రజాప్రతినిధులు, పోలీసుల ప్రమేయంపై ఆరా..

ఈ దందాలో ప్రజాప్రతినిధులు, పోలీసుల ప్రమేయంపై రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. హనుమకొండ నుంచి హుజూరాబాద్ వరకు దందా చేస్తున్న ఇద్దరు దళారులకు పలువురు పోలీసులు సహకరించారనే ఆరోపణలున్నాయి. సహకరించిన పోలీసుల వివరాలు విజిలెన్స్ అధికారులు సేకరించినట్లు తెలిసింది. వీరితోపాటు ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా దందా చేసే వారికి అండగా నిలుస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల చిట్టా తయారు చేస్తున్నట్లు సమాచారం. మొత్తంగా ఈ దందాలో ప్రమేయం ఉన్న వారి జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి అప్పగించే పనిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నట్లు తెలిసింది.

జిల్లా విజిలెన్స్ అధికారుల పనితీరుపై ఆరోపణలు

జిల్లాకు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తీరుపై పలు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకు చెందిని కొంతమంది అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతుందనే విమర్శలున్నాయి. జిల్లాలో పనిచేసే ఒక హెడ్‌కానిస్టేబుల్ అధికారి ఒకే స్థానంలో దశాబ్దకాలంగా పనిచేస్తూ దందా చేసే వారికి అండగా ఉంటున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ హెడ్‌కానిస్టేబుల్ పై అధికారులను మేనేజ్ చేస్తాడనే విమర్శలున్నాయి. దందా చేసే వారి నుంచి వసూళ్లు చేసి అధికారులకు స్థాయిల వారిగా ముట్టచెబుతాడనే ప్రచారం ఉంది. జిల్లా అధికారుల తీరు సరిగాలేకనే రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం జిల్లాలో పర్యటిస్తున్నట్లు అధికారిక సమాచారం.

ప్రాంతాల వారిగా దళారులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలువురు ఈ దందా చేస్తూ కోట్లు మూట గట్టుకున్నట్లు తెలిసింది. ప్రాంతాల వారిగా పెత్తనం చెలాయిస్తూ యథేచ్ఛగా పీడీఎస్ రైస్ దందా చేస్తున్నారు.

- భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌కు చెందిన ఒక వ్యక్తి వరంగల్, హనుమకొండ జిల్లాలో ఈ దందా చేస్తున్నట్లు తెలిసింది. ఈయనపై గతంలో పీడీ యాక్ట్ కేసు నమోదు అయినట్లు సమాచారం. గతంలో ఒక పోలీస్ కమిషనర్ ఈయనను నగరంలో ఉండకూడదనే ఆంక్షలు సైతం పెట్టినట్లు తెలిసింది. ఆ అధికారి బదిలీ అయ్యాక దందాను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు సమాచారం.
- మంథినికి చెందిన ఒక వ్యక్తి ఈ దందాలో నిష్ణాతుడనే పేరుంది. ఇతడు జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులను సైతం మేనేజ్ చేస్తాడనే ప్రచారం ఉంది. భూపాలపల్లి, ములుగు ఏరియాల్లో ఇతడి మనుషులతో దందా సాగిస్తున్నట్లు సమాచారం.
- బుద్ధారానికి చెందిన మరో వ్యక్తి సైతం ఈ దందా చేస్తాడని తెలిసింది.
- ములుగు జిల్లాకు చెందిన ఒక రైస్ మిల్లు యజమాని పీడీఎస్ రైస్ దందా చేస్తాడని తెలిసింది. తన మనుషులతో గ్రామాల్లోని పీడీఎస్ బియ్యం సేకరించి రైస్‌మిల్లు అడ్డుపెట్టుకుని పెద్దఎత్తున దందా చేస్తాడని సమాచారం.
- మంథనికి చెందిన ఒక వ్యక్తి మహారాష్ట్ర సిరివంచలో రైస్‌మిల్లు నడుపుతూ ఈ దందా చేస్తాడని తెలిసింది. ఇతడి దందాకు ఆ ఏరియా పోలీసులు సహకరిస్తారనే ప్రచారం ఉంది.
- ఇక హనుమకొండ నుంచి హుజూరాబాద్ వరకు ఇద్దరు వ్యక్తులు పీడీఎస్ రైస్ దందా చేస్తూ కోట్లు సంపాదించారనే ఆరోపణలున్నాయి. గ్రామాల నుంచి సేకరించే బియ్యాన్ని కిట్స్ కళాశాల ఏరియాలో, ఓఆర్ఆర్ ఏరియాలో నిల్వచేసి రాత్రి వేళల్లో కొంతమంది పోలీసుల సహకారంతో పొరుగు రాష్ట్రాలకు తరలిస్తారనే ప్రచారం ఉంది. ఈ ఇద్దరిలో ఒక వ్యక్తితో పలువురు పోలీసు అధికారులు సన్నిహితంగా ఉంటూ అతడు ఇచ్చే తాయిళాలు నెలనెల అందుకుంటారనే విమర్శలున్నాయి. ఇలా విచ్చలవిడిగా వరంగల్‌లో అన్ని ప్రాంతాల్లో దందా సాగుతున్నట్లు తెలిసింది. వీరందరి సమాచారం సేకరిస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారులు నివేదిక తయారు చేస్తున్నట్లు సమాచారం.

మడేలయ్య క్యాలెండర్ ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 14: రజకుల కుల దైవం మడేలయ్య క్యాలెండర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. చాకలి ఐలమ్మ సంక్షేమ సంఘం ధోబీఘాట్ ఆధ్వర్యంలో 10వ డివిజన్ కాపువాడలోని మడేలయ్య ఆలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రజకుల సంక్షేమ కోసం తనవంతు కృషి చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు. అంతకు ముందు సమీపంలో ఉన్న శివమడేలయ్య దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, చికటి శారదఆనంద్, వేముల శ్రీనివాస్ చాకలి ఐలమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రావుల సుదర్శన్, కార్యదర్శి నాగపురి సదానందం, సభ్యులు సంతు, శ్రీనివాస్, శ్రీహరి, రాజేందర్, రాజు, మహేందర్, విజయ్, సారంగం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి


అంబేద్కర్ జయంతి వేడుకలలో నివాళులు అర్పిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదివారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ జేఏసీ ప్రధాన కార్యదర్శి గొల్కొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జేఏసీ ఆధ్వర్యంలో సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, బయాలజిస్ట్ మాదవరెడ్డి, హార్టికల్చర్ అధికారి రమేష్, జేఏసీ అధ్యక్షుడు గౌరిశంకర్, నాయకుడు రాజారపు భాస్కర్, బోట్ల రమేష్, ధర్మరాజు, రమేష్, దేవేందర్‌ప్రసాద్, నాగుల శ్రీకాంత్‌తో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తెలంగాణ బహుజన మునిసిపల్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్యాలయంలోని అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వక్కల వెంకటస్వామి, రాణాసాగర్, ఎర్ర అరుణ్, ప్రియాంక యుజిన్‌లతో పాటు సంఘం నాయకులు పాల్గొన్నారు.

హనుమకొండ కుమార్‌పల్లిలోని బుద్ధభవన్ వద్ద అంబేద్కర్ 133వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేందర్‌రెడ్డి ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కీడా, సాంస్కృతిక పోటీలలో విజేతలకు రాజేందర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ బీఆర్ లెనిన్, స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, మాజీ కార్పొరేటర్లు మంచాల స్వామిచరణ్, తాడిశెట్టి విద్యాసాగర్, బుద్ధభవన్ కమిటీ నాయకులు సుదర్శన్, సారయ్య, గోకారపు శ్యాం, సుధీర్, ఎడ్ల హరీష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ క్రైం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్‌కు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నివాళులర్పించారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి అంబర్ కిషోర్ ఝా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రాంనగర్: బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నేత పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ 113 జయంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేతలు సుందర్‌రాజ్ యాదవ్, దాస్యం విజయభాస్కర్, మేకల బాబురావు, కుసుమ లక్ష్మీనారాయణ, ఖలీల్, కనకరాజు, కోటేశ్వర్, సుగుణాకర్, శ్వేతారెడ్డి, పావణి తదితరులు పాల్గొన్నారు.

● రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై రూపొందించిన పాటల సీడీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యాక్రమంలో కేయూ ఉద్యమ నేత బొల్లికొండ వీరేందర్ ఆధ్వర్యంలో రూపొందించిన అంబేద్కర్ పాటల సీడీని కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరేందర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు. నిట్ క్యాంపస్‌లో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ్, నిట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. టీపీయూఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని సంఘ కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్ట్స్ కళాశాలలో సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీఆర్టీయూ-తెలంగాణ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్పందన మానసిక వికలాంగుల కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొలిపాక సంగీత, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, సర్వేశ్వర్ పాల్గొన్నారు.

● బాలసముద్రం: బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో నిర్వాహకురాలు బండా రామలీల, తెలంగాణ విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా నిర్వహించిన దివ్యాంగుల స్వాగత నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు రూ. 25 వేల ఆర్థిక సాయం, రూ.80 వేల విలువగల ఆట వస్తువులు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, అన్నపూర్ణ, ఆనందం, కుమారస్వామి, నిర్వాహకులు బండా రామలీల సదానందం కోడం కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ సిటీ: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి నిర్వహించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, బంక సరళ, డాక్టర్ రామక్రిష్ణ, రహీమున్నీసా బేగం, గుంటి స్వప్న, బంక సంపత్ యాదవ్, జాఫర్, మనోహర్, సతీశ్ యాదవ్, శ్రీధర్, కార్పొరేటర్లు తోట వెంకన్న, పోతుల శ్రీమాన్, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ కలెక్టరేట్ : హనుమకొండ కలెక్టరేట్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, రాష్ట్ర నాయకులు భూక్య రాము నాయక్, జిల్లా నాయకులు సలీం, చీకటి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని హంటర్‌రోడ్డులోని వరంగల్ పార్లమెంటరీ కార్యాలయంలో వరంగల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పార్లమెంట్ ప్రభారి మురళీధర్, జిల్లా నాయకులు సంతోష్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇంచార్జి డైరెక్టర్స్ అశోక్‌కుమార్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, విజిలెన్స్ అఫీసర్ జనార్ధన్, సీజీఎంలు ప్రభాకర్, కిషన్, రాజు చౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, కంపెనీ సెక్రటరీ వెంకటేశం పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్: దూరవిద్య కేంద్రం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేయూ ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి అధ్యక్షతన కేయూ సెనెట్ హాల్‌లో జరిగిన సమావేశంలో వీసీ రమేశ్ మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ద్వారా మనల్ని మనం కాపాడుకుంటామని తెలిపారు. ఎస్డీఎల్‌సీఈ రిటైర్డు ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టుస్వామి అంబేద్కర్ థియరీ అండ్ ప్రాక్టీసెస్ అనే అంశంపై విస్తృత ప్రసంగం చేశారు. కేయూ క్యాంపస్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్‌లో డైరెక్టర్ డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ నేతృత్వంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేయూలోని దూరవిద్య కేంద్రంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ వడ్డెపల్లి మధు నేతృత్వంలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ధర్మ స్టూడెంట్ యూనియన్ (డీఎస్‌యూ) ఆధ్వర్యంలో కేయూలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్ నేతృత్వంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఘనంగా నివాళులర్పించారు.

● భీమారం: 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు యాదవ్ సంఘాల రాజమౌళి ఆధ్వర్యంలో భీమారం జంక్షన్ వద్ద, హసన్‌పర్తి, ఎల్లాపూర్, యాదవనగర్, చింతగట్టు, ముచ్చర్ల ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ కార్పొరేటర్ శివకుమార్, పావుశెట్టి శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, సంగాల విక్టర్ బాబు, గడ్డం శివరాం, దాట్ల సునీల్, జన్ను కిషన్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కాజీపేట: కాజీపేటలోని ఎఫ్‌సీఐ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ యూనియన్ జోనల్ అడిషనల్ సెక్రటరీ ఐత రాజు, రీజినల్ ప్రెసిడెంట్ సి.జగదీశ్వర్, మేనేజర్లు రాజేంద్ర ప్రసాద్, శ్రవణ్, దీరజ్ కుమార్, కిషన్, హరికిషన్ పాల్గొన్నారు. కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో నార్లగిరి రమేశ్, సుంచు కృష్ణ, అఫ్జల్, దశరథం, సోని, రామస్వామి, రాజు, రవీందర్, శివకుమార్, కనకరాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. 47వ డివిజన్‌లో దొంగల కుమార్ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గుంటి కుమార్, ఇప్ప శ్రీకాంత్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షేక్ అన్వర్, సిరిల్ లారెన్స్ మానస మధు, రాంబాబు, విజయ్‌భాస్కర్, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు.

● కాజీపేట టౌన్: 48వ డివిజన్‌లోని దర్గాలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, హర్షం రాంకి, బందెల యశోద, సతీష్, కట్ట స్వామి, రమేష్, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● మడికొండ: మడికొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, స్థానిక ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్, ఎస్సై రాజబాబు, కుల సంఘాల నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మడికొండ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి నర్మెట భిక్షపతి గాండ్ల, నాయకులు తూర్పాటి అబ్బ సాయిలు, గంగారపు వీరేష్, గోపనబోయిన రాజు పాల్గొన్నారు. 45వ డివిజన్ తరాలపల్లిలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని జరుపుకున్నారు. అనంతరం కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, పసరగొండ రమేష్, దేవేందర్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ పాలొన్నారు.

● న్యూశాయంపేట : 31వ డివిజన్ న్యూశాయంపేటలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిండ్ల బాబురావు హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 31వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో న్యూశాయంపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హనుమకొండలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ఎం శ్రీలత హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హనుమకొండ ఆర్టీసీ డిపోలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం ధరంసింగ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కరుణమ్మె సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు నరేష్ ఆదివారం హనుమకొండ బస్‌స్టేషన్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, అదాలత్ జంక్షన్, కాజీపేట ప్రాంతాలలో రోడ్లపై విగత జీవులుగా ఉంటున్న అనాథలు, వృద్ధులకు 25 మందికి చీరలు, షర్ట్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏదైనా ఒక సహాయం చేయాలని అభాగ్యులకు చీరలు, షర్ట్స్ పంపిణీ చేశానని తెలిపారు.

● ఐనవోలు: మండలవ్యాప్తంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, బీఎస్పీ, అంబేడ్కర్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని వేర్వేరు సమయాల్లో ఘనంగా నిర్వహించారు. ఐనవోలులో ఎంపీపీ మార్నేని మధుమతిరవీందర్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, జడ్పీ కోఆప్షన్ ఉస్మాన్‌అలీ, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, దేవస్థానం మాజీ చైర్మన్ సంపత్‌కుమార్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చింత శామ్యూల్, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఆయా పార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. పున్నేలు, కొండపర్తి గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అంబేద్కర్ జయంతిని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య, సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఐనవోలులో ఆదివారం అంబేద్కర్ జయంతిని నిర్వహించారు.

పీడీఎస్‌యూ నేత జార్జిరెడ్డికి ఘన నివాళి


కేయూలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, దినేశ్‌కుమార్, పీడీఎస్‌యూ నేతలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 14: పీడీఎస్‌యూ రాష్ట్ర నేత జార్జిరెడ్డి 52వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కేయూలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. కేయూ రిటైర్డు ప్రొఫెసర్ సీహెచ్.దినేశ్‌కుమార్, కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జార్జిరెడ్డి ఆశయాలను సాధించాలని, శాస్త్రీయ విద్య కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ పూర్వ నాయకులు తీగల జీవన్‌కుమార్, కడారి భోగేశ్వర్, అజయ్, బండి కోటేశ్వర్‌రావు, నున్నా అప్పారావు, సాదు రాజేశ్, వెంకటరమణ, నరసింహరావు, మొగిలి వెంకట్‌రెడ్డి, బాషబోయిన వేణు, రంజిత్, శివ, ప్రవీణ్, రవి, అభిరామ్, రమేశ్, కాశీనాథ్, మహేశ్, గణేశ్, అనూష, నవీన్, రాము, వంశీ, టింపు, ముషారఫ్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా ప్రారంభం

ధర్మసాగర్, ఏప్రిల్ 14: ధర్మసాగర్ మండలం శాయిపేట్ గ్రామంలో నీటి సరఫరాను అధికారులు తిరిగి శనివారం పునరుద్ధరించారు. 20 రోజుల నుంచి గ్రామానికి తాగునీటి సరఫరా లేక పోవడంతో 'తాగునీటి ఎద్దడి' అనే కథనం శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో అధికారులు శనివారం గ్రామాన్ని సందర్శించారు. శాయిపేట్ గ్రామంలోని వాటర్ ప్లాంట్ వద్ద ఉన్న పాత బోరుకు కొత్త మోటారు, పైపులను బిగిస్తున్న క్రమంలో మోటారు బోరులో పడిపోయింది. దీంతో కొత్త మోటారు బిగించేందుకు సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో డీఈ చంద్రు నాయక్, పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు పైఅధికారుల ఆదేశాల మేరకు అర్ధరాత్రి పాత బోరు పక్కన కొత బోరు వేసి మోటారు బిగించి గ్రామానికి తాగునీటి సరఫరా అందించారు. గ్రామానికి నీటి సరఫరాను అందించేందుకు శనివారం రాత్రి అధికారులు గ్రామంలోనే ఉండి పనులను పర్యవేక్షించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు దుస్తుల వితరణ

హనుమకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని ఒయాసిస్ అనాథశ్రమంలో ఆదివారం 40 మంది అనాథ విద్యార్థులకు విద్య ఫౌండేషన్ రూ.30వేల విలువైన నూతన దుస్తులను పంపిణీ చేసింది. విద్య ఫౌండేషన్ సభ్యుడు, విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు వెలుదండి లీల 60వ జన్మదినం పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, సలహాదారుడు గురిజాల తిరుపతిరెడ్డి లీలను ఈ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఒద్దిరాజు చంద్రప్రకాశ్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వంశీ, న్యూరో సర్జన్ డాక్టర్ రాజేశ్వరి, టి.నర్సింగరావు, ఫౌండేషన్ సభ్యుడు కొక్కుల కృష్ణ, ఉదయశ్రీ ప్రభాకర్, గజ్జల స్వరూపారాణి, పల్లె రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన తాగునీటిని అందించాలి

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 14: వినియోగదారులకు ప్రభుత్వం నాణ్యమైన తాగునీటిని అందించాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సహజ వనరులైన తాగునీటిని తెలంగాణ రాష్ట్రంలోని మునిసిపల్ కార్పొరేషన్లు, నగర పాలక సంస్థలు ప్రజలకు ఉచితంగా అందించకపోగా వాటికి చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. సమావేశంలో వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాలో నీటి నాణ్యత పరీక్షల ల్యాబరేటరీలను వరంగల్ నగరంలో ఏర్పాటు చేస్తే తాగునీటి నాణ్యత పరీక్షలను నిర్వహించడానికి వీలవుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు వి.ఇందిర, కవిరాజ్, జాఫర్, సతీష్, జోష్న, రవీందర్, అక్తర్, శ్రీలత పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్స్ డైరీ ఆవిష్కరణ

కాజీపేట, ఏప్రిల్ 14: రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం 62వ డివిజన్ కాజీపేట పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరీ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, వేముల శ్రీనివాస్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంఘమయ్య, సెక్రటరీ కెవి.రావు, ట్రెజరర్ కె.ఐలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.యాదయ్య, వైస్ ప్రెసిడెంట్ ఎస్.రాములు, ఎం.ఐలయ్య, బి.వెంకటేశ్వర్లు, జహంగీర్, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

లండన్ సిటీ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

న్యూశాయంపేట, ఏప్రిల్ 14: హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫన్ అండ్ జాయ్ లండన్ సిటీ ఎగ్జిబిషన్‌ను ఆదివారం రాత్రి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌ను హనుమకొండ, వరంగల్, కాజీపేట జంట నగరాల ప్రజల కోసం ఈ సారి ఒక కొత్త వెరైటీ ఉండాలనే ఉద్దేశంతో లండన్ నగరం, యూనివర్సల్ స్టూడియోను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 100కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీరోజు సాయంత్రం 5 గంటల నుండి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుదని, జంట నగరాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఎగ్జిబిషన్ మేనేజర్ ఫిరోజ్, స్థానిక కార్పొరేటర్ రావుల కోమల కిషన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల రథసేవ


రథసేవ నిర్వహిస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 14: హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర వేయిస్తంభాల ఆలయంలో వైభవంగా జరుగుతున్న కల్యాణ వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. పాంచరాత్ర ఆగమానుసారం ఉత్సవ స్వామిని భద్రాద్రి రాముడిగా అలంకరింపజేసి నీరాజన మంత్రపుష్పం, చిత్రాన్న నైవేద్యం అనంతరం స్వామి వారికి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వాహనంపై వైభవంగా రథసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, వైష్ణవ పండితులు, యాజ్ఞికులు గుడిమెల్ల విజయకుమారాచార్యల ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలతో పాటు నిత్య హోమం నిర్వహించారు. రాముడి సేవలో తరించిన భక్తులకు సుఖశాంతులు కలుగుతాయని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 14: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని సాయినగర్, హనుమాన్‌నగర్ టెంపుల్ ఏరియా, లావణ్య ఆస్పత్రి ఏరియా, స్విమ్మింగ్ పూల్, పబ్లిక్ గార్డెన్, లైబ్రరీ ఏరియాలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి పకనటలో తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 14: అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆదివారం హనుమకొండలోని ఫైర్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బందికి నివాళులర్పించారు. వారి సేవలను గుర్తు చేసుకున్నారు. స్టేషన్ ఆవరణలో అగ్నిమాపక స్టాల్ ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సిబ్బంది ఉపయోగించే పరికరాలు స్టాల్‌లో పెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి ఎ.నాగరాజుతో పాటు స్టేషన్ సిబ్బంది, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయం

ఐనవోలు, ఏప్రిల్ 14 : రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి విజయకేతనం ఎగరవేసి అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ ఓబీసీ సెల్ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి ఉల్లేంగుల యాదగిరి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంలోని త్రిషూర్ ఎంపీ అభ్యర్థి కె. మురళీధరన్‌తో ప్రచారంలో పాల్గొన్నట్లు తెలిపారు. కేరళ రాష్ట్రంలో 20 కి 20 స్థానాలు ఇండియా కూటమిమీ గెలిచితీరుతుందన్నారు.

యువతి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్14: తల్లితో పాటు స్వగ్రామానికి బయలుదేరిన ఓ యువతి హనుమకొండ బస్టాండ్‌లో శనివారం అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం... మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన ఓ యువతి (27) తన తల్లితో కలిసి హసన్‌పర్తి నుంచి స్వగ్రామానికి ప్రయాణమైంది. ఉదయం బస్టాండ్‌లో తల్లితోపాటు బస్సు ఎక్కాల్సిన యువతి.. క్షణాల్లో అదృశ్యమైంది. బస్టాండ్ పరిసరాల్లో ఎక్కడ వెతికినా సమాచారం దొరకలేదు. తొర్రూరుకు చెందిన ఒక యువకుడిపై అనుమానం ఉందని యువతి తండ్రి విజయ్‌కుమార్ ఆదివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా బిడ్డ కనిపించడం లేదు..

హనుమకొండ టౌన్, ఏప్రిల్14: తన బిడ్డ కనిపించడం లేదని ఓ తల్లి ఆదివారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. నయీంనగర్‌లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీకామ్ కంప్యూటర్ చదువుతున్న యువతి కిషన్‌పురలోని ప్రభుత్వ వసతి గృహంలో ఉంటోంది. ఆదివారం హాస్టల్‌కు తల్లి రాగా, కూతురు కనిపించలేదు. ఫోన్ చేస్తే కట్ చేస్తోంది. పర్లపల్లికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉందని తల్లి రమ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
9
సోమవారం ● 15 ఏప్రిల్ 2024



కొందరికి అవకాశాలు పుష్కలంగా ఉన్నా చదువును పెద్దగా లక్ష్యపెట్టరు. మరి కొందరికి చదువంటే ప్రాణమైనా, వారికి సరైన అవకాశాలుండవు. సరిగ్గా ఇలాంటి పరిస్థితే కర్నూలు జిల్లాకు చెందిన సజ్జలగుడ్డం నిర్మలది కూడా. పదోతరగతిలో పాఠశాల ఫస్ట్ వచ్చిన అమ్మాయిని వ్యవసాయకూలీ పనులకు పంపారు తల్లితండ్రులు. అయినా, చదువుకోవాలన్న అమ్మాయి సంకల్పం ముందు ఆడపిల్లకు పెద్దచదువులు అక్కర్లేదన్న వాళ్ళ అమ్మానాన్న మొండితనం ఓడిపోయింది. బాగా చదివి ఐపీఎస్ అవ్వాలన్న నిర్మల పత్తిచేలో పనిచేస్తుండటాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెస్తే, అదిచూసిన కర్నూలు జిల్లా కలెక్టరు సృజన అమ్మాయిని తిరిగి తరగతి గదికి చేర్చారు. ఆస్పరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలో ఇంటర్ మొదటి సంవత్సరం 440కుగాను 421మార్కులతో సత్తాచాటిన నిర్మలను 'నవ్య' పలకరించింది.

ఒకప్పటి కూలి ఫస్ట్ వచ్చింది

"మాది కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని పెద్ద హరివనం. ఆంధ్రా-కర్ణాటక సరిహద్దు గ్రామం కావడంతో అభివృద్ధి అస్సల్లేదనే చెప్పాలి. బాల్యవివాహాలు బాగా ఎక్కువ. మూఢనమ్మకాల సంగతి చెప్పనక్కర్లేదు. ఆడపిల్లల విషయంలో అయితే అవి మరీనూ! అమ్మాయిలకు చదువుకన్నా పెళ్లి ముఖ్యమని మా ఊరివాళ్ల అభిప్రాయం. మా అమ్మానాన్న హనుమంతమ్మ, శీలప్పలది పొలంపని. మేము నలుగురు అక్కచెల్లెళ్లం. నేను అందరికన్నా చిన్నదాన్ని. మా ముగ్గురు అక్కలకూ పెళ్లిళ్లు అయ్యాయి. వారెవరూ హైస్కూలు దాటి చదవలేదు. కానీ నేను మాత్రం బాగా చదువుకొని ఐపీఎస్ అవ్వాలి అని కోరిక. ఎనిమిదో తరగతి నుంచి అదే నా జీవిత లక్ష్యంగా పెట్టుకొన్నాను. పదోతరగతిలో నాకు 537మార్కులు వచ్చాయి. పాఠశాల టాపర్ని కావడంతో మా ఉపాధ్యాయులతో పాటు ఊరివారంతా "మంచి మార్కులు వచ్చాయని" నన్ను అభినందించారు. కానీ ఆ సంతోషం ఎక్కువ రోజులు నిలవలేదు. ఇంటర్‌లో చేర్పించమని ఇంట్లో అడిగితే, "చదువులేదు గిదువులేదు పొలం పనుల్లో మాకు సాయంగా ఉంటే చాలు" అన్నారు. 'రెక్కలకష్టంతో బతికే మనం వేలకువేలు కాలేజీ ఫీజులు ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి' అన్నారు. పేదరికానికి తోడు ఆడపిల్లను పొరుగూరుకు పంపించడం కూడా మా వాళ్లకు ఇష్టంలేదు. ఏదైతేనేం, నా చేత బలవంతంగా చదువు మాన్పించారు. నేను ఎంత బతిమాలినా వినలేదు. రోజులతరబడి ఏడ్చినా లాభంలేకపోయింది. చివరికి ఇంట్లో వాళ్లు చెప్పినట్లే రోజూ కలుపు తీయడం, పత్తి ఏరడం, సజ్జ కంకులు కోయడం లాంటి పొలంపనులకు వెళుతున్నా, చదువుకోలేకపోతున్నానన్న బాధ మాత్రం నన్ను కుదురుగా ఉండనివ్వలేదు.

> స్మార్ట్‌యుగంలోనూ అమ్మాయిలకు చదువుకన్నా పెళ్లి ముఖ్యమని చాలా గ్రామాలలో బలంగా నమ్ముతున్నారంటే... మనం చాలా వెనుకబడి ఉన్నామనే కదా అర్థం.! నన్ను మా కలెక్టరు గారు మొదట కర్నూలులోని ఒక మంచి కాలేజీలో చేర్పించడానికి ప్రయత్నించారు. అయితే, మా అమ్మానాన్న అందుకు అస్సలు ఒప్పుకోలేదు. పట్టణాలలో అమ్మాయిలకు భద్రతలేదన్నది వారి నమ్మకం. నాకేమైనా అవుతుందేమో అన్నది వాళ్ల భయం. అమ్మాయిల తల్లిదండ్రుల్లోని ఇలాంటి భయాలను పోగొట్టాలి. ఆడపిల్లలు చదువుకోవడం వల్ల కుటుంబానికి ఎంత ప్రయోజనమో మారుమూల పల్లెల్లోని వారికి తెలియజేయాలి.

'ఆంధ్రజ్యోతి'లో రాబట్టే...

ఇంకొద్ది రోజులు అయితే పెళ్లిసంబంధాలు చూడటం మొదలుపెడతారు. ఇక చదువుకోలేనన్న భయం నన్ను వెంటాడింది. ఐపీఎస్ అవ్వాలన్న నా కల ఇక తీరదన్న బెంగతో ఒక్కోరోజు తిండి కూడా సహించేది కాదు, నిద్ర పట్టేది కాదు. ఆ సమయంలో నేను పడిన బాధ అంతా ఇంతాకాదు. అలాంటి పరిస్థితుల్లో 'గడప గడపకు' కార్యక్రమంలో భాగంగా ఒకరోజు మా ఇంటికి ఎంపీడీవో, ఎంఆర్వో లతో పాటు పోలీసు సబ్ ఇన్ స్పెక్టర్ మేడం వాళ్లు వచ్చారు. "నాకు చదువుకోవాలనుంది. ప్లీజ్ మేడం! నన్ను ఇంటర్‌లో చేర్పించమని మీరైనా మా అమ్మానాన్నకు చెప్పండి" అని అధికారులను బతిమాలాను. వారంతా మా అమ్మకు నచ్చచెప్పాలని చూశారు. కానీ "నా కూతురిని కాలేజీలో చేర్పించాలంటే టౌన్‌కు పంపాలి. అక్కడ అమ్మాయికి జరగరానిదేమైనా జరిగితే ఎవరు పూచీ. అయినా కూలీనాలీచేసుకొని బతికేవాళ్లం. వేలకువేలు ఫీజు కట్టాలంటే కూడా మాతో అయ్యేపని కాదు" అని మా అమ్మ తెగేసి చెప్పింది. దాంతో వాళ్లు ఏమీ చేయలేకపోయారు. తర్వాత రోజు ఆంధ్రజ్యోతిలో 'ప్లీజ్.! మా అమ్మకు మీరైనా చెప్పండి' శీర్షికతో అదంతా వార్తగా వచ్చింది. ఆంధ్రజ్యోతిలో వార్త చదివిన కలెక్టరు సృజనా మేడం నన్ను మా అమ్మానాన్నను కలెక్టరు కార్యాలయానికి పిలిపించారు. మా వాళ్లకు నచ్చచెప్పి, నన్ను ఆస్పరిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో(కేజీబీవీ) ఇంటర్‌లో చేర్పించారు. అలా ఆగిందనుకొన్న నా చదువు ఆంధ్రజ్యోతిలో వార్తగా రావడం వల్ల తిరిగి కొనసాగిస్తున్నాను. అప్పుడు నా ఆనందానికి అంతులేదు. ఐపీఎస్ సాధిస్తానన్న నమ్మకం నాలో పెరిగింది.

అధ్యాపకుల ప్రోత్సాహం

నాకు మొదటి నుంచి సైన్స్ అంటే ఇష్టం. కనుక బైపీసీ తీసుకొన్నాను. నా చదువుకు ఒక ఏడాది బ్రేక్ పడినా అంతవరకు చదివినదేదీ మర్చిపోలేదు. కలెక్టరు సృజనా మేడం నన్ను కేజీబీవీలో చేర్పించిన తర్వాత కూడా నా పర్యవేక్షణ బాధ్యతను సర్వశిక్షా అభియాన్ అధికారి వేణుగోపాల్ సార్‌కు అప్పగించారు. చదువు అంటే నాకు చాలా ఇష్టం కనుక మా అధ్యాపకులు, వార్డెన్ లు కూడా నన్ను బాగా ప్రోత్సహించారు. రోజూ వేకువజామున, సాయంత్రం మమ్మల్ని దగ్గరుండి చదివిస్తారు. కనుక మా విజయం వెనుక వారి శ్రమ ఎంతో ఉంది. వారందరి ప్రోద్బలం వల్లే ఇంటర్ మొదటి సంవత్సరంలో నాకు 440కుగాను 421 మార్కులు వచ్చాయి. కర్నూలు జిల్లా కేజీబీవీల్లో టాపర్ని కూడా. ఇప్పుడు కూడా సృజన మేడం కలెక్టరు కార్యాలయానికి ప్రత్యేకంగా పిలిపించి మరీ నన్ను సన్మానించారు. తాను మరొక చోటుకు బదిలీ అయినా, నా చదువుకు ఆటంకం రాకూడదని నాపేరుతో బ్యాంకులో కొంత డబ్బు డిపాజిట్ చేస్తున్నట్టు చెప్పారు. అదిపూర్తిగా నా చదువుకు వినియోగించేలా ఏర్పాటు చేస్తున్నారు. నాలాంటి నిరుపేద అమ్మాయిలను ఆదుకొనే సృజనా మేడం లాంటి కలెక్టర్లు ఎంతమంది ఉంటారు. మా కలెక్టర్ మేడంను చూసిన తర్వాత సివిల్స్ సర్వీసుమీద అభిమానం మరింత పెరిగింది. నాకు మంచిమార్కులు రావడంతో మా అమ్మానాన్న కూడా సంతోషిస్తున్నారు.

● గోరంట్ల కొండప్ప, కర్నూలు

నా బిడ్డను చూసి గర్వపడుతున్నా

- హనుమంతమ్మ, విద్యార్థిని తల్లి



మేము పేదోళ్లం. మాబోటోళ్లకు చదువెందుకని పొలం పనులకు పొమ్మని చెప్పినాను. కలెక్టరమ్మ వల్లే నా కూతురు నిర్మల కాలేజీలో చేరింది. మంచి మార్కులు తెచ్చుకుందని గొప్పగొప్పోళ్లంతా అంటుంటే ఆనందంగా ఉంది. అమ్మాయికి పోలీసు అవ్వాలి అని మొదటి నుంచి కోరిక. ఏపూటకు ఆపూట తిండికి వెతుక్కొనే మనలాంటోళ్లకు అలాంటి పెద్ద ఆశలుండద్దు అని మేము అమ్మాయిని నిరుత్సాహపరిచాం. అమ్మాయి అనుకున్నది సాధిస్తుందని మాకు ఇప్పుడు నమ్మకం వచ్చింది. నా బిడ్డను చూసి గర్వపడుతున్నా. అమ్మాయి ఎంతచదువుకొంటే అంతవరకు చదువుకొమ్మని చెప్పాం.



బాలలకు రక్షణ కవచం

చైల్డ్ ట్రాఫికింగ్‌ను అరికట్టాలి... పల్లవి ఘోష్ చిన్ననాటి ఆశయం ఇది. దాని కోసం 75 వేల మందితో ఒక సైన్యాన్ని సృష్టించారు. పది వేలమందికి పైగా పిల్లలను కాపాడారు. వారి ఉపాధి కల్పనకు దోహదం చేస్తున్నారు. పొరుగు దేశాల్లోనూ సేవలందిస్తున్న ముప్ఫై మూడేళ్ళ పల్లవి ఘోష్ ప్రయాణం ఇది...

"నేను పుట్టింది, పెరిగింది అసోంలోని లుమ్డింగ్ పట్టణంలో. ఎప్పుడు సెలవులు వచ్చినా కోల్‌కతాలోని మా మామయ్య ఇంటికి వెళ్ళేదాన్ని. ఏడో తరగతి పరీక్షలు రాసిన తరువాత... వేసవి సెలవుల్లో మళ్ళీ కోల్‌కతా వెళ్ళాను. ఒక రోజు మార్కెట్లో ఒక వ్యక్తి అరుస్తూ పరుగులు పెట్టడం కనిపించింది. ఆయన

> "ఆ 75 వేల మందీ నా సైన్యం. మేము ఇప్పటివరకూ పదివేలమందికి పైగా పిల్లలను రక్షించగలిగాం. అంతేకాదు... పలుచోట్ల బాల్య వివాహాలను కూడా ఆపగలిగాం.



కుమార్తె మాయమైందనీ, ఆమెను వెతుక్కుంటూ ఆయన పిచ్చివాడై తిరుగుతున్నాడనీ తెలిసింది. అప్పుడు నా వయసు పన్నెండేళ్ళు ఆ అమ్మాయిదీ అదే వయసు. నా ఈడు అమ్మాయి హఠాత్తుగా ఎలా అదృశ్యమైంది? ఆమెను ఎవరు ఎత్తుకుపోయారు? ఏం చేస్తారు?... నాలో కొన్నాళ్ళపాటు ఇవే ఆలోచనలు. ఆ సంఘటన నా జీవితాన్ని పెద్ద మలుపు తిప్పింది" అని గుర్తు చేసుకున్నారు పల్లవి ఘోష్. తనకు ఎదురైన సంఘటనల్లాంటివి అరుదేమీ కాదనీ, దేశవ్యాప్తంగా కొన్ని వేలమంది పిల్లలు ట్రాఫికింగ్‌కు గురవుతున్నారనీ, వారి అదృశ్యం ఎన్నో కుటుంబాలకు శాశ్వతమైన వేదనను మిగులుస్తోందనీ ఆమె తెలుసుకున్నారు. చైల్డ్ ట్రాఫికింగ్‌ను నిరోధించడానికి అంకితం కావాలనే ఆశయం ఆమెలో నానాటికీ బలపడింది. "నేను ఇంటర్ చదువుతున్నప్పుడు రైల్వే స్టేషన్‌లో చాలామంది పిల్లలను గమనించాను. స్థానికంగా మేము మాట్లాడుకొనే భాష బెంగాలీ. కానీ ఆ పిల్లలు హిందీ బాగా మాట్లాడుతున్నారు. వాళ్ళు రాజస్థాన్‌కు చెందినవారని తెలిసింది. ఎక్కడినుంచో వాళ్ళను కొన్ని ముఠాలు తీసుకొస్తున్నాయి. "మాకు మంచి జీవితాన్ని ఆశ చూపిస్తున్నారు. భాష తెలియని చోట చాకిరీ చేయిస్తున్నారు. తిండి, వసతి కల్పిస్తారు. మేం సంపాదించినదంతా తీసుకుంటారు. ఎత్తుకొచ్చిన వారిలో ఆడపిల్లలను వేశ్యాగృహాలకు అమ్మేస్తుంటారు" అని ఆ పిల్లలు చెప్పారు. ఇది నేను ఊహించిన దానికన్నా పెద్ద సమస్య అని అర్థమయింది" అని అంటారు పల్లవి.

విదేశాల్లో సైతం...

ఇంగ్లీష్ లిటరేచర్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తరువాత... ఇటువంటి కేసులపై శోధించే ఢిల్లీకి చెందిన ఒక సంస్థలో రీసెర్చ్ ఆఫీసర్‌గా ఆమె చేరారు. చైల్డ్ ట్రాఫికింగ్ మూల కారణాలను మరింత స్పష్టంగా అర్థం చేసుకున్నారు. అనేక చైల్డ్ రెస్క్యూ మిషన్లలో స్వయంగా పాల్గొన్నారు. "పిల్లలను కాపాడి... వారి సొంతవారికి అప్పగించినప్పుడు... వారిలో కలిగే సంతోషాన్ని చూస్తే ఎంతో తృప్తి కలిగేది. ఆరేళ్ళపాటు ఆ సంస్థలో పని చేశాను. వేలమందిని కాపాడి, వారికి కొత్త జీవితం దొరికేలా చేశాను" అని చెప్పారు పల్లవి. తమ ప్రాంతంలో కార్యకలాపాలను విస్తరించడానికి 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్ ఫౌండేషన్' అనే సంస్థను 2020 డిసెంబర్‌లో ఆమె ఏర్పాటు చేశారు. "ఒక సంస్థలో భాగంగా పని చేయడం వేరు. అన్నీ నేనై ఒక సంస్థను నడిపించడం వేరు. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. అయిదుసార్లు కొవిడ్ ఇన్ఫెక్షన్‌కు గురయ్యాను. అయినా ఆత్మస్థైర్యం కోల్పోలేదు. అసోం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలతో పాటు భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ తదితర దేశాల్లో కూడా చైల్డ్ ట్రాఫికింగ్ నిరోధానికి మా సంస్థ కృషి చేస్తోంది. ఆ ప్రాంతాలకు వెళ్ళి... పిల్లల అదృశ్యం గురించి స్థానికులను ప్రశ్నించినప్పుడు... మొదట్లో వాళ్ళు సహకరించలేదు. ఆ తరువాత వాళ్ళ ధోరణిలో మార్పు వచ్చింది" అని ఆమె వివరించారు.

వాళ్ళందరూ నా సైన్యం...

కేవలం ఏడాదిన్నర కాలంలో... ఈశాన్య రాష్ట్రాల్లో 75 వేలమందికి పైగా మహిళలను ఆమె కలిశారు. వర్క్ షాప్‌లు, సదస్సులు నిర్వహించి... చైల్డ్ ట్రాఫికింగ్‌కు కారణమవుతున్న కుటుంబ, సామాజిక కారణాలపై అవగాహన కల్పించారు. వారి సహకారంతో చైల్డ్ ట్రాఫికింగ్ నిరోధానికి చర్యలు చేపట్టారు. పిల్లల అక్రమ రవాణాకు పాల్పడుతున్న కొన్ని వందల మందిని చట్టానికి పట్టించారు. చైల్డ్ ట్రాఫికింగ్ మాఫియా నుంచి బెదిరింపులు వచ్చినా, తనపై దాడులకు ప్రయత్నాలు జరిగినా భయపడలేదు. "ఆ 75 వేల మందీ నా సైన్యం. మేము ఇప్పటివరకూ పదివేలమందికి పైగా పిల్లలను రక్షించగలిగాం. అంతేకాదు... పలుచోట్ల బాల్య వివాహాలను కూడా ఆపగలిగాం. అసోంలో దాదాపు ప్రతి గ్రామంలోనూ మా సభ్యుల నిఘా ఉంటుంది. అయితే పిల్లలను కాపాడినంతమాత్రాన సరిపోదు. వారి పునరావాసానికి, ఉపాధికి సాయపడడం కూడా కీలకం. లేదంటే మళ్ళీ ప్రలోభాలకు గురై, ట్రాఫికింగ్ బారిన పడే ప్రమాదం ఉంది. మేము రక్షించిన బాలికల్లో పలువురు కుట్టుపని నేర్చుకొని.. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించారు. 2019లో నేను కాపాడిన ఒక అమ్మాయి... ఇప్పుడు ఎంబిబిఎస్ చదువుతోంది. పలువురు బాలలకు కౌన్సెలింగ్, వివిధ వృత్తుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం. ఇంట్లోని ఆర్థిక పరిస్థితుల వల్లో, ఇతర కారణాలవల్లో పారిపోయే పిల్లలు కొందరైతే... స్వార్థపరుల ప్రలోభాలకు లేదా అపహరణలకు బలై.. అక్రమ రవాణా అవుతున్నవారు మరికొందరు. పిల్లలు మన దేశ భవిష్యత్తు. వారందరికీ సమాన అవకాశాలు అందాలి. ఎదిగే వయసులో వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. సమాజంలో మార్పు, చైతన్యం ద్వారానే ఇది సాధ్యమవుతుంది" అంటారు పల్లవి.

నవ్య | చిత్రజ్యోతి



'రోమా, గ్రావిటీ' వంటి విభిన్న తరహా చిత్రాలను తెరకెక్కించిన మెక్సికన్ ఫిల్మ్ మేకర్ అల్ఫాన్సో కోరన్ ఇండియా పర్యటనకు వచ్చారు. ఆదివారం ఆయన చెన్నైకు వెళ్లగా ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఈ దర్శకుడికి ఆతిథ్యం ఇచ్చి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. మణిరత్నం, ఏ ఆర్ రెహమాన్, సిద్ధార్థ్, అదితిరావు హైదరీ పాల్గొన్నారు.

2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా

హీరో విశాల్



తమిళనాట 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని హీరో విశాల్ ప్రకటించారు. ఆ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తానని, పొత్తు పెట్టుకోనని ఆయన స్పష్టం చేశారు. చెన్నైలో ఆదివారం తమిళ్ ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎంజేఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన తమిళ ఉగాది వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు విశాల్ సమాధానమిస్తూ, 2026 ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తానని చెప్పారు. ఒంటరిగానే బరిలోకి దిగుతానని తెలిపారు. ప్రజల్లో తానేంటో నిరూపించుకోకుండా పొత్తు ఎలా పెట్టుకుంటానని ప్రశ్నించారు. ఆ ఎన్నికల్లో తాను మాత్రమే కాకుండా, చెన్నై లయోలా కాలేజీలో తనతో పాటు చదువుకుని సినీ స్టార్స్‌గా ఉన్న మరికొంతమంది కూడా ఎన్నికల బరిలోకి దిగుతారన్నారు. అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరుగుతాయా? ముందుగానే జరుగుతాయా? అన్నది తనకు తెలియదన్నారు. కానీ, ఎన్నికల్లో పోటీ చేయడం తథ్యమన్నారు. తన అభిమాన నటుడు విజయ్ అని, ఆయన్ను డైరెక్ట్ చేయాలని ఉందన్నారు. - ఆంధ్రజ్యోతి, చెన్నై


గతం వర్తమానం ఢీకొంటే...



తమిళ నటుడు సూర్య నటిస్తున్న చిత్రం 'కంగువ'. శివ దర్శకుడు. దిశాపటానీ, బాబీడియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఆదివారం సూర్య ఈ చిత్రం నూతన పోస్టర్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేశారు. కంగువ పాత్రలోని సూర్య, మోడరన్ పాత్రలోని సూర్య ఇందులో ముఖాముఖి తలపడనున్నట్లు ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచింది.

సల్మాన్ ఖాన్ ఇంటి బయట కాల్పులు

బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి బయట ఆదివారం ఉదయం కొందరు దుండగులు తుపాకీతో కాల్పులు జరిపారు. ఆరు రౌండ్ల కాల్పులకు పాల్పడగా అందులో ఓ బుల్లెట్ మొదటి అంతస్తులోకి దూసుకువచ్చింది. ఈ దాడి జరిగిన సమయంలో సల్మాన్ ఇంట్లోనే ఉన్నారు. ఈ సంఘటనపై ముంబై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ కాల్పులు తామే చేశామని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ ఫేస్‌బుక్‌లో ప్రకటించారు. "సల్మాన్... ఇప్పుడు మేం చేసిన పని జస్ట్ ట్రైలర్. మేం ఎంతకు తెగిస్తామో నీకు అర్థమై ఉంటుంది. మా సహనాన్ని పరీక్షించొద్దు. ఈ సారి తుపాకీ పేలుడు ఇంటి బయట దాడితోనే ఆగిపోదు" అని హెచ్చరించారు.



బరిలో దిగాడు గెలిచే కుర్రాడు

రాకేశ్ వర్రె టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'జితేందర్‌రెడ్డి'. 1980ల్లో జరిగిన సంఘటన ఆధారంగా దర్శకుడు విరించి వర్మ తెరకెక్కిస్తున్నారు. ముదుగంటి రవీందర్‌రెడ్డి నిర్మాత. చిత్రబృందం ఈ సినిమా నుంచి 'బరిలో దిగాడు గెలిచే కుర్రాడు' అంటూ సాగే యూత్‌ఫుల్ లిరికల్ సాంగ్‌ను విడుదల చేసింది. 'కాలేజ్ స్టూడెంట్ లీడర్ జితేందర్ రెడ్డి కథ ఇది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఆయన ఎదుర్కొన్న తీరును ఇందులో ఆవిష్కరిస్తున్నాం' అని యూనిట్ తెలిపింది.



భయపెట్టే భామలు



హారర్ కామెడీ సిరీస్‌లో వస్తున్న తమిళ చిత్రం 'అరణ్మనై 4'. తమన్నా, రాశీఖన్నా, ప్రధాన పాత్రలు పోషించారు. సుందర్ సీ దర్శకత్వం వహించడంతో పాటు లీడ్‌రోల్‌లో నటించారు. తెలుగులో 'బాక్' పేరుతో ఈ నెల 26న విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. ఆదివారం 'అయ్యో అయ్యో అయ్యయ్యో... భయమవుతోంది అయ్యయ్యో...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. తమన్నా, రాశీఖన్నా గ్లామర్‌తో పాటు తమదైన స్టెప్పులతో అలరించారు. ఖుష్బూ సుందర్, ఏసీఎస్ అరుణ్‌కుమార్ నిర్మిస్తున్నారు.

సోలోగా అలరించేందుకు సిద్ధం

వినూత్న ప్రేమకథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'సోలో బాయ్'. గౌతమ్ కృష్ణ హీరోగా పి. నవీన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సెవెన్‌హిల్స్ సతీశ్‌కుమార్ నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గౌతమ్ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ 'మా నిర్మాత సింగిల్ సిట్టింగ్‌లో కథను ఓకే చేశారు. త్వరలో ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'సోలో బాయ్' చిన్న సినిమాయే అయినా, మంచి కథతో తెరకెక్కించాం. ప్రేక్షకులను మెప్పించేలా దర్శకుడు సినిమాను తీర్చిదిద్దాడు' అని అన్నారు. పాటలు, ఫైట్స్ మా సినిమాకు ప్రత్యేకాకర్షణ అని దర్శకుడు తెలిపారు.



కమర్షియల్ హంగులతో కాప్

రవిశంకర్ ప్రధాన పాత్రధారిగా రూపొందిన కమర్షియల్ ఎంటర్టైనర్ 'కాప్'. నిఖిల్, రాజశేఖర్, తేజ హీరోలుగా నటిస్తున్నారు. బి. సోమసుందరం దర్శకత్వంలో మాధవన్ సురేశ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే తిరుపతిలో చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'పొలిటికల్ సెటైర్‌తో పాటు కమర్షియల్ హంగులు ఉన్న చిత్రమిది. మంచి సందేశంతో ప్రజల్ని ఆలోచింపజేసే విధంగా తెరకెక్కించాం' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'వేసవిలో 'కాప్'ను విడుదల చేస్తాం. అందరికీ నచ్చుతుంది' అన్నారు.



కచ్చతీవు దీవి

భారత్- శ్రీలంక మధ్య వివాదం

ఇంచుమించు నాలుగు దశాబ్దాల క్రితం భారతదేశం ఉదారంగా వదులుకున్న కచ్చతీవుని ఇప్పుడు భద్రత కారణాలరీత్యా తిరిగి సంపాదించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అయితే ఒప్పందం ద్వారా వదులుకున్న ఆ భౌగోళిక ప్రాంతాన్ని తిరిగి ఎలా హుందాగా దక్కించుకోగలమన్న అంశం మాత్రం భారతదేశ వ్యూహాత్మక చాతుర్యంపై ఆధారపడి ఉంది.



పాక్ జలసంధి ప్రాంతంలో కేవలం 1.9 చదరపు కిలోమీటర్లు/ 155 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న అతి చిన్న దీవి కచ్చతీవు. తమిళనాడులోని రామేశ్వరానికి ఈశాన్య దిక్కులో 33 కిలోమీటర్ల దూరంలో, శ్రీలంకలోని జాఫ్నాకు నైరుతి దిక్కున 63 కి.మీ.దూరంలో ఉంది. 14వ శతాబ్దంలో అగ్నిపర్వతం పేలుడు కారణంగా ఏర్పడిన ఈ దీవిలో ఎక్కడా మంచినీరు దొరకనందున నివాసయోగ్యంగా లేదు. ఇసుక మేటలు వేసి ఉండటంతో చేపల వేటకు కూడా పెద్దగా పనికిరాదు. కేవలం జాలర్లు వలలు ఆరబెట్టుకోడానికి, విశ్రాంతి తీసుకోవడానికి ఈ దీవిని వినియోగిస్తుంటారు. ఈ ప్రాంతంలో కేవలం సెయింట్ ఆంథోని చర్చి మాత్రమే ఉంది. ఏటా ఈ చర్చిలో జరిగే వార్షిక ఉత్సవాలకు భారత్, శ్రీలంక నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరవుతారు. అంతకుమించి ఈ దీవిలో జరిగే కార్యకలాపాలు ఏమీ ఉండవు.

మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగం

ఈ ప్రాంతం మధ్యయుగ కాలంలో జాఫ్నా ప్రాంత రాజుల చేతిలో, అనంతరం 17వ శతాబ్దంలో తమిళనాడుకు చెందిన రామనాథపురం జమిందారీ ఆధీనంలో ఉండేది. బ్రిటిష్ పాలనలో 'పాక్ జలసంధి', 'గల్ఫ్ ఆఫ్ మన్నార్'ల డీలిమిటేషన్ తరవాత ఈ దీవి మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా మారింది. అయితే చేపల వేటకై ఈ ప్రాంతంపై హక్కుల కోసం శ్రీలంక, భారత్ మధ్య వివాదం మాత్రం కొనసాగుతూనే వచ్చింది.

1974, 1976ల్లో భారత్-శ్రీలంక మధ్య సరిహద్దు సయోధ్యకు నాలుగు ఒప్పందాలు జరిగాయి. అప్పటి ఇరుదేశ ప్రధానులు ఇందిరాగాంధీ, సిరిమావో బండారు నాయకే మధ్య జరిగిన ఈ సముద్ర సరిహద్దు ఒప్పందాల ఫలితంగా 'ఇంటర్నేషనల్ మారిటైమ్ బౌండ్రిలైన్'ను నిర్ధారించారు. సాధారణంగా రెండు దేశాల మధ్య సమాన దూరం ప్రాతిపదికన ఈ రేఖ నిర్ణయిస్తారు. కానీ శ్రీలంక, ఇండియా ఇరు దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రాతిపదికన ఈ అంతర్జాతీయ జల సరిహద్దు రేఖను నిర్ణయించారు. ఒప్పందంలో భాగంగా భారత దేశం కచ్చతీవు దీవి శ్రీలంకకు చెందినదిగా అంగీకారం తెలిపింది. అయితే భారత జాలర్లు ఈ దీవిలో వలలు ఆరబెట్టుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, సెయింట్ ఆంథోని చర్చి ఉత్సవాలప్పుడు వీసా అవసరం లేకుండా భారతీయులు ఆ దీవిలోకి ప్రవేశించడానికి సంబంధించి మాత్రం భారత్ హక్కులను కలిగి ఉంటుంది. అంతేగాని భారత జాలర్లకు ఈ దీవి ప్రాంతంలో చేపలు పట్టే హక్కులు లేవు. అవి కేవలం శ్రీలంక జాలర్ల సొంతం. అయినప్పటికీ 1983 వరకూ నిరాటంకంగా ఇరు దేశాలకు చెందిన జాలర్లు ఎప్పటి మాదిరిగానే ఈ ప్రాంతంలో సంచరించడం, చేపలు పట్టడం చేశారు.

కానీ 1983లో శ్రీలంక సైన్యం - తమిళ టైగర్లు(ఎల్‌టీటీఈ) మధ్య అంతర్యుద్ధం(సివిల్ వార్) ప్రారంభమవడంతో జాఫ్నాకు - తమిళనాడుకు మధ్య గల ఈ దీవి ప్రాంతం కీలకంగా మారింది. ఎల్‌టీటీఈకి ఆహారం, ఆయుధాలు తదితర సరఫరాలను కట్టడి చేసేందుకు ఈ ప్రాంతంలో శ్రీలంక సైన్యం గస్తీని ముమ్మరం చేసింది. భారత జాలర్ల రాకపోకలపై ఆంక్షలు పెరిగాయి. 2009 నాటికి అంతర్యుద్ధం ముగిసినా భారత జాలర్లపై ఆంక్షలు మాత్రం తగ్గలేదు. ఈ ప్రాంతంలోకి ప్రవేశించిన భారత జాలర్లపై శ్రీలంక గస్తీ దళాలు కాల్పులు జరపడం, జాలర్లను అరెస్ట్ చేయడం, బోట్లను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు చేపడుతూ 1976 నాటి ఒప్పందాన్ని తరచూ ఉల్లంఘిస్తున్నారు.

అయితే సముద్రగర్భాన్ని దేవేస్తున్న భారత జాలర్ల అధునాతన ట్రాలీ వలలు తమ మత్స్యకారుల జీవనోపాధిని, తీరపు అంచు ప్రాంతాన్ని, పగడపు దిబ్బలను సైతం నాశనం చేస్తున్నాయని శ్రీలంక చెబుతోంది. దీనివల్ల తమ ప్రాంత సముద్ర పర్యావరణానికి కూడా భారత జాలర్ల వల్ల నష్టం జరుగుతోందని, అందువల్లనే వారిని అనుమతించడం లేదని చెబుతోంది. పైగా 1976 నాటి ఒప్పందం ప్రకారం ఈ ప్రాంతంలో చేపలవేట హక్కులు కేవలం శ్రీలంకకు మాత్రమే అన్నది వారి వాదన.

భారత్ ఆరోపణ

అయితే శ్రీలంక గస్తీ దళాలు భారత జాలర్లను కచ్చతీవులోకి వలలు ఆరబెట్టుకోవడానికి, విశ్రాంతి నిమిత్తం కూడా ప్రవేశించకుండా అడ్డుకోవడం 1976 నాటి ఒప్పందాలను ఉల్లంఘించడమేనని భారత్ అంటోంది. అంతేకాక సాంప్రదాయకంగా భారత జాలర్లు ఏనాటినుంచో కచ్చతీవు ప్రాంతంలో చేపలవేట సాగిస్తున్నారు. వారసత్వంగా ఇది జరుగుతోంది. 1976 ఒప్పందం తరవాత కూడా ఇది కొనసాగింది. భారతఖండ తీరపు అంచు ప్రాంతం మునిగి, మత్స్య సంపద తగ్గిపోవడం, జాలర్లకు సరిహద్దు రేఖల గురించి కచ్చితమైన అవగాహన లేకపోవడం వల్ల ఒక్కోసారి వాటిని దాటి ఆ ప్రాంతం వైపు వెళ్తున్నారు. అలాంటప్పుడు వారిని హెచ్చరించడం వంటి చర్యలు చేపట్టాలి గాని కాల్పులు జరపడం, హింసించడం, బోట్లు స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు ఇరుదేశ సంబంధాలనూ దెబ్బతీస్తాయంటోంది భారత్.

కచ్చతీవు దీవులను తిరిగి తీసుకోవాలనే డిమాండ్లు కూడా రెండు దశాబ్దాలుగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా తమిళనాడు రాష్ట్రం నుంచి, తమిళ జాలర్ల నుంచి ఈ డిమాండ్లు ఏనాటి నుంచో ఉన్నాయి. 1974లో భారతప్రభుత్వం ఈ దీవులపై హక్కులు వదులుకున్న సందర్భంలోనే అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి, ఆ ప్రాంతం తమిళనాడుకు చెందిన రామ్‌నాడ్ రాజ్య భాగంగా వారసత్వంగా తమకు దక్కిందని అన్నారు. తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీని సంప్రతించకుండానే, ఆ ప్రాంతాన్ని ధారాదత్తం చేయడంపై అభ్యంతరం తెలుపుతూ ప్రధాని ఇందిరాగాంధీకి కరుణానిధి లేఖ రాశారు. తదనంతర కాలంలో డిఎంకే, ఏఐడీఎంకే, రెండు ప్రధాన తమిళ రాజకీయ పార్టీలు కచ్చతీవుల కోసం కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాయి. 1991లో తమిళనాడు రాష్ట్రప్రభుత్వం కచ్చతీవును తిరిగి తీసుకోవాలని అసెంబ్లీలో ఒక తీర్మానం చేసింది. 2008లో అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 1974, 1976ల్లో భారతప్రభుత్వం కచ్చతీవులను శ్రీలంకకు ధారాదత్తం చేస్తూ చేసుకున్న ఒప్పందాలను రద్దుచేయాలని పిటిషన్ వేశారు. తరచూ తమిళ జాలర్లను శ్రీలంక అరెస్టులు చేయడం, వేధింపులకు గురిచేస్తుండటంతో పార్టీలకు, ప్రభుత్వాలకు అతీతంగా తమిళనాట ఈ అంశం ప్రాధాన్యం పొందుతూనే ఉంది. గత ఏడాది శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కచ్చతీవు దీవిని తిరిగి అప్పగించేలా చూడాలని, తమిళ జాలర్ల జీవనభృతిని కాపాడాలని ప్రధాని మోదీకి లేఖ రాశారు. అయితే ఇప్పుడు, హిందు మహాసముద్ర ప్రాంతంలో చైనా స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్ వ్యూహాన్ని అమలుపరుస్తూ భారత సరిహద్దు దేశ నౌకాశ్రయాల్లో పాగా వేసింది. ఇప్పటికే శ్రీలంక నుంచి హంబన్‌తోట నౌకాశ్రయాన్ని వంద సంవత్సరాలకు లీజు రూపంలో వశం చేసుకుంది. అంతేకాక పాకిస్థాన్‌లోని గ్వదార్ పోర్ట్, బంగ్లాదేశ్ చిట్టగాంగ్ పోర్ట్ వంటి నౌకాశ్రయాలతోపాటు మాల్దీవుల జలాల్లో కూడా చైనా తన ఉనికిని చాటుతోంది. ఇప్పుడు శ్రీలంక నుంచి కచ్చతీవు దీవిని కూడా ఈవిధంగా చైనా సాధించుకుంటే భారత్‌కు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే చైనా పాగావేసే అవకాశం ఉంది. చైనా నుంచి తీసుకున్న అప్పుల ఊబిలో కూరుకుపోయిన శ్రీలంకది ఎదురుచెప్పలేని పరిస్థితి. దీంతో కచ్చతీవు దీవులను తిరిగి భారత్ వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్లు దేశవ్యాప్తంగా కూడా వెల్లువెత్తుతున్నాయి. పాలిత బీజేపీ ప్రభుత్వం కూడా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ కచ్చతీవు అంశాన్ని కాంగ్రెస్ పార్టీకి, తమిళనాడు డీఎంకే పార్టీకి వ్యతిరేకంగా వారు అప్పట్లో ఈ దీవిని శ్రీలంకకు అప్పగించారనే చారిత్రక తప్పిదాన్ని ప్రచారం చేస్తూ ముందుకు తీసుకువచ్చి దేశవ్యాప్తంగా పెద్ద చర్చకే తెరలేపింది.

ఎవరి వాదనలు ఎలా ఉన్నా మన భద్రత దృష్ట్యా, దేశ భూభాగాలపై సార్వభౌమాధికారం ఎట్టి పరిస్థితుల్లో సడలనివ్వమనే సందేశాన్ని ఇవ్వాల్సి ఉంది. అందుకుగాను కచ్చతీవు దీవిని తిరిగి భారత్ సంపాదించాలనే వాదనా గట్టిగానే వినిపిస్తోంది.

అయితే ఇదంత సులువైన విషయమేమీ కాదు. కచ్చతీవు దీవిపై హక్కును ఒక అధికారిక ఒప్పందం ద్వారా బదలాయించడం జరిగింది. ఇరుదేశాల మధ్య జరిగిన ఈ ఒప్పందం vienna convention on the law of treaties 1969కు లోబడి ఉంటుంది. భారత్, శ్రీలంక రెండూ భాగస్వాములుగా ఉన్న అంతర్జాతీయ ఒడంబడిక ఇది. దీని ప్రకారం ఏ దేశమైనా మరో దేశంతో చేసుకున్న ఒప్పందం నుంచి తనకు తాను స్వతంత్రంగా విరమించుకోవడం/ బయటకు రావడం, మార్పులు చేర్పులు చేయడం వీలు కాదు. భాగస్వామ్య దేశపు పూర్తి సమ్మతి కావాల్సి ఉంటుంది. కాబట్టి భారతదేశం సామరస్య పూర్వకంగా సంప్రతింపుల ద్వారా ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలి. లేనిపక్షంలో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం కోసం 'ఇంటర్నేషనల్ ట్రిబ్యునల్ ఫర్ ద లా ఆఫ్ ద సీస్(ఐటీఎల్‌ఓఎస్)'ను ఆశ్రయించాల్సి ఉంటుంది. ఈ సంస్థ సముద్ర సంబంధిత ఒప్పందాలకు సంబంధించిన వివాదాలపై అంతర్జాతీయ న్యాయస్థానం మాదిరి పనిచూస్తుంది.

భారతదేశం ఐటీఎల్‌ఓఎస్‌ను ఆశ్రయించినప్పుడు సముద్ర జలచరాల, వనరుల పరిరక్షణ, సముద్ర పర్యావరణ హననం వంటి అంశాలు చర్చకు వస్తాయి. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వ లక్ష్యంగా 'జలావరణ, జలచర వనరుల పరిరక్షణ' అనే అంశం కూడా ఉంది. ఈ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలుకు భారత్ కూడా కట్టుబడి ఉంది. ఈ అంశం శ్రీలంక వాదనలో కీలకాంశంగా మారుతుంది. ఇప్పటికే పాక్ జలసంధి ప్రాంతంలో భారత్‌కు చెందిన అధునాతన యంత్ర మర పడవలు వేల సంఖ్యలో ఉన్నాయి. వీటి నుంచి ఆధునికమైన 'ట్రాలీ వలల'తో భారత జాలర్లు చేపల వేట కొనసాగిస్తుంటారు. గతంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు పెంచుకునేందుకు భారత ప్రభుత్వమే వీటిని తీవ్రంగా ప్రోత్సహించింది. ఈ ట్రాలీ వలలు సముద్ర గర్భాన్ని చేపల కోసం రాయిరప్పా సహా అడుగంటా దేవేస్తుంటాయి. దీనినే బాటమ్ ట్రాలింగ్ అంటారు. ఇది సముద్ర పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఈ అంశాలన్నీ భారత్‌కు వ్యతిరేక తీర్పు రావడానికి దోహదపడే అంశాలే. అంతేకాక భారతదేశం 'నైబర్స్ ఫస్ట్' పాలసీ ఎప్పుడూ వివాదాలను సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకోవడాన్నే ఆశిస్తుంది.

ముదిరిన వివాదం

అదేవిధంగా భారతదేశంతో శ్రీలంకది చిరకాల సాంస్కృతిక సంబంధం. భారత్ నుంచి ఆర్థిక, ఆహార, సైనిక సహాయాలను శ్రీలంక విరివిగా పొందింది. భారతదేశం నుంచి భారీస్థాయిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను కూడా పొందుతోంది. 1983 నుంచి ఇప్పటివరకూ రమారమి 250 మంది భారత మత్స్యకారులు శ్రీలంక నేవీ చేతిలో హతమయ్యారు. మరెంతోమంది తీవ్రంగా గాయపడ్డారు. బోట్లు ధ్వంసం కాబడి, స్వాధీనం చేసుకోవడంతో జీవనోపాధిని కోల్పోయారు. ఆరువేలమంది జాలర్లు శ్రీలంక వద్ద బందీలుగా ఉన్నారు. 1976 నాటి ఒప్పందాల ప్రకారం కచ్చతీవు దీవిలోకి భారత జాలర్లు ప్రవేశించి విశ్రాంతి తీసుకునేందుకు లభించిన హక్కును కూడా శ్రీలంక నేవీ అడ్డుకుంటోంది. ఈ అంశాలన్నింటిని కూడా ఐటీఎల్‌ఓఎస్ ముందు శ్రీలంక జవాబు చెప్పాల్సి ఉంటుంది. కాబట్టి శ్రీలంక, భారత్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వాలకు వెళ్లాలన్నా ఎవరి లొసుగులు వారికి ఉన్నాయి. కాబట్టి సమస్యను శాంతియుతంగా చర్చలు సత్సంబంధాలను నెలకొల్పుకోవడం ద్వారా పరిష్కరించుకోవాల్సి ఉంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

సయోధ్యకు అవకాశం!

గతంలో సుప్రీంకోర్టుకు ఈ విషయంలో అప్పటి అటార్నీ జనరల్ ముకుల్ రోహిత్గీ సమాధానమిస్తూ కచ్చతీవు దీవిని 1974, 1976ల నాటి ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా భారత్ శ్రీలంకకు ఇచ్చివేసిందని, ఇప్పుడు తిరిగి పొందాలంటే యుద్ధం ఒక్కటే మార్గమని తెలిపారు. అయితే భారతదేశం ఎప్పుడూ శాంతికాముక దేశం. సయోధ్య ద్వారానే సమస్యల పరిష్కారాన్ని కోరుకుంటుంది. కచ్చతీవు దీవులను సుదీర్ఘకాలంపాటు శ్రీలంక నుంచి లీజుకు తీసుకోవడం ఒక మంచి ప్రత్యామ్నాయమని వ్యూహకర్తలు ప్రతిపాదిస్తున్నారు. అంతేకాక బాటమ్ ట్రాలింగ్ వంటి విధానాలకు స్వస్తి పలికి, సముద్ర ఆవరణ వ్యవస్థను రక్షిస్తామనే హామీ ఇవ్వడం ద్వారా శ్రీలంక జాలరుల ఉపాధి భయాన్నీ తొలగించవచ్చు. ఈ దీవిని ప్రధానంగా భారత దేశ భద్రత కోసం కోరుకుంటున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో చాలా పరిమితంగానే భారత జాలర్లను అనుమతిస్తామని హామీ ఇవ్వడం ద్వారా శ్రీలంక ప్రయోజనాలు కూడా పరిష్కరించబడి లీజు ప్రతిపాదనకు ఒప్పుకొనే అవకాశం ఉంది.



గుప్తుల కాలంలో

భారతదేశ చరిత్రలో గుప్తుల కాలాన్ని పరిశీలించే క్రమంలో ఆనాటి సామాజిక, ఆర్థిక తదితర పరిణామాలను తరచి చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు వీటిని మరింత లోతుగా తెలుసుకోవాలి.

సామాజిక, ఆర్థిక పరిస్థితులు

గుప్తుల కాలం నాటి సమాజంలో నాలుగు వర్ణాలతోపాటు 'చండాలులు' అనే పంచమ వర్ణం ఏర్పడింది. దీనిని ఫాహియాన్ 'అంటరాని వర్ణం'గా పేర్కొన్నాడు. వర్ణాశ్రమ ధర్మాలు ఉండేవి. అయినప్పటికీ 'వర్ణ సంకర' విధానం కొనసాగింది. వర్ణాశ్రమ ధర్మం కాపాడటానికి 'అభయదత్తుడు' అనే ఉద్యోగిని రాజు నియమించాడు. శాతవాహనుల మాదిరిగానే వీరు కూడా బ్రాహ్మణులకు అగ్రహారాలు(గ్రామాలు) దానంగా ఇచ్చేవారు.

గుప్తుల కాలంలో స్త్రీ స్వేచ్ఛ తగ్గిపోయింది. సతీసహగమనం, బాల్య వివాహాలు, బహుభార్యత్వం వంటి అనాచారాలు కొనసాగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహాలు ఉండేవి. పురుషులు అధిక వర్ణం స్త్రీలను వివాహాలు చేసుకోవడాన్ని ధర్మశాస్త్రాలు నిషేధించాయి. క్రీ.శ.510లో 'ఎరాన్' శాసనాన్ని భానుగుప్తుడు చెక్కించాడు. దీనిలో సతీసహగమనం, దేవదాసి ఆచారం ఉన్నట్లు రాసి ఉంది. సమాజంలో శెట్టిలు(వ్యాపారులు), జితిక అనే వృత్తిపనివారు ఉన్నారని 'భితారి' శాసనంలో రాశారు. సేద్య బానిసలు, జాజ్‌మని అనే వ్యవస్థకు గుప్తుల కాలంలోనే పునాది పడింది. ఈ వ్యవస్థకు గల కారణాలు 'ఇండోర్' శాసనంలో ఉన్నాయి.

ఆర్థిక విధానం

భూములను సామంతులకు, ఉద్యోగులకు, బ్రాహ్మణులకు దానాలుగా ఇవ్వడం వల్ల రాజుకు భూమిపై అధికారం తగ్గింది. రాజుకు, సాగుచేసే సామాన్య రైతుకు మధ్య అనేక మంది మధ్యవర్తులు ఉండటంతో ఫలితాన్ని అనుభవించే భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. ఈ భూస్వామ్య వ్యవస్థ గురించి 'భితారి' శాసనంలో రాశారు. 'సార్థవాహనులు' అనే సంచార వర్తకులు కూడా నగరాల్లో ఎక్కువగా ఉండేవారు. రైతులపై హిరణ్య(నగదు పన్ను); కొనుగోలు మీద వేసే క్లిప్త, ఉపక్లిప్త పన్నులు; అమ్మకపు పన్ను; వ్యవసాయానికి వాడుకునే నీటిపై వేసే వతభూత పన్ను గుప్తుల కాలంలో విధించేవారు.

భూ విభజన: భూములను ఖిల్ల(వ్యవసాయ), క్షేత్ర(నివాస), స్థల(అటవీ) అని మూడు రకాలుగా విభజించారు.

నాణేలు: కంస, సిక్క

విదేశీ వాణిజ్యం: గుప్తులు ఎక్కువగా ఆగ్నేయాసియా దేశాలతో వర్తక వాణిజ్యాలు నిర్వహించేవారు. అరికమేడు, ముజ్రిస్, కావేరి రేవు పట్టణాలు ప్రసిద్ధి. పర్షియా, అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి గుర్రాలను దిగుమతి చేసుకునే వారు.

మత విధానం

వైదిక మతం పునరుద్ధరించారు. క్రతువులు, యజ్ఞయాగాలు పెరిగాయి. వేదాలు వినడం, ఇతిహాసాలు చదవడానికి శూద్రులకు అవకాశం కల్పించారు. దశావతారాలు, త్రిమూర్తులను నాటి ప్రజలు పూజించేవారు. బౌద్ధ, జైన మత సూత్రాలను హిందూ మతం గ్రహించింది. శైవ మతానికి ఆదరణ పెరిగింది. మూఢ నమ్మకాలు కూడా పెరిగాయి. విగ్రహారాధన స్థిరపడింది.

వైష్ణవం: ఈ మతంలో నూతన శాఖలు ఏర్పడ్డాయి. పంచరాత్రి, వైఖానస మొదలైన శాఖలు ఏర్పడ్డాయి. రెండో చంద్రగుప్తుడు పరమ భాగవతుడని పేరు పొందాడు.

శైవం: శైవంలో తాంత్రిక శాఖలు, భక్తి శాఖలు ఏర్పడ్డాయి. వీటిని కాపాలిక, కాలాముఖ శాఖలు అనేవారు. మితవాద శాఖలు కూడా ఉండేవి. శివున్ని లింగ రూపంలో పూజించడం ప్రారంభించారు. ఇది మొదట కశ్మీర్‌లో ప్రారంభమైంది. అభినవ గుప్తుడు త్రిక అనే శాఖను ప్రారంభించాడు. వసుగుప్తుడు ప్రత్యాభిజ్ఞా అనే శైవ శాఖను ప్రారంభించాడు.

జైన మతం: అనేక జైన స్థావరాలు నిర్మించారు. గుజరాత్‌లో జైనమతం అభివృద్ధి చెందింది.

బౌద్ధ మతం: అనేక ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు నిర్మించారు. బుద్ధగయలో బౌద్ధ విహారం నిర్మించడానికి శ్రీలంక రాజు మేఘవర్ణుడికి సముద్రగుప్తుడు అనుమతించి పరమత సహనం చాటాడు. మథుర, సార్‌నాథ్, కౌశాంబి మొదలైనవి బౌద్ధ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. అసంగుడు, పరమార్థుడు, దిగ్నాగుడు ఈ కాలపు గొప్ప బౌద్ధ పండితులు.

గుప్తుల పరమత సహనం: గుప్తులు హిందూ మతాభిమానులైనా...పరమత సహనం చూపారు. బౌద్ధ, జైనులకు పదవులు ఇచ్చారు. దానాలు చేశారు. విరాళాలు ఇచ్చారు. రెండో చంద్రగుప్తుని సేనాని 'అమరక దేవుడు' బౌద్ధుడు.

సాహిత్యం

గుప్తుల కాలం సాహిత్యానికి స్వర్ణయుగం అని చెప్పవచ్చు. సముద్రగుప్తుడు స్వయంగా కవి. అతనికి 'కవిరాజు' అనే బిరుదు ఉండేది. రెండో చంద్రగుప్తుని కాలంలో 'నవరత్నాలు' అని పేరుపొందిన కవులు ఉండేవారు. వారిలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కాళిదాసు ఒకరు. ఈయన రాసిన 'అభిజ్ఞాన శాకుంతలం' గ్రంథాన్ని సర్ విలియం జోన్స్ ఆంగ్లంలోకి అనువదించాడు. 'మాళవికాగ్నిమిత్రం' నాటకంలో ఉజ్జయని రాకుమార్తె మాళవికను మగధ యువరాజు అగ్నిమిత్రుడు చేసుకున్న వివాహం(రాక్షస వివాహం) గురించి కాళిదాసు అద్భుతంగా రాశాడు.

గుప్తుల కాలంలో కొనసాగిన సాహిత్య సేవను చరిత్రకారులు గ్రీస్‌లోని పెరిప్లస్ యుగంతో, రోమ్‌లోని అగస్టస్ యుగంతో, ఇంగ్లాండ్‌లోని ఎలిజబెత్ యుగంతో పోల్చారు. గుప్త రాజులు సంస్కృత, సాహిత్య రంగాల్లో చేసిన సేవల వల్లనే వారి యుగానికి స్వర్ణయుగం అనే పేరు వచ్చింది. గుప్త చక్రవర్తులు స్వయంగా పండితులు. అలహాబాద్ ప్రశస్తి శాసనంలో కావ్యశైలిలో హరసేనుడు అద్భుతంగా రాశాడు.

నవరత్నాలలో ఒకడైన కాళిదాసు రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం అనే కావ్యాలు రాశాడు. అదేవిధంగా ఇతర కవుల గ్రంథాలు... శూద్రకుడు - మృచ్ఛకటికం; విశాఖదత్తుడు- ముద్రా రాక్షసం, దేవీచాంద్రగుప్తం; భానుడు- వాసవదత్త, విష్ణుశర్మ- పంచతంత్రం మొదలైనవి. అమరసింహుడు 'అమరకోశం' అనే వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. కామాంధకుడు 'నీతి శాస్త్రం' రచించాడు. ఇది గుప్తుల కాలంలో వచ్చిన రాజకీయ గ్రంథం. మౌర్యుల అర్థశాస్త్రంతో పోల్చదగినది.

వేదాంత శాస్త్రాలు: ఈ కాలంలో అద్భుతమైన గ్రంథాలు వచ్చాయి. అసంగుడు బౌద్ధ గ్రంథాలపై వ్యాఖ్యానాలు రాయగా, దిగ్నాగుడు ప్రమాణచముచ్చేయం రాసి తర్కశాస్త్ర పితగా ప్రసిద్ధి చెందాడు. అష్టాదశ పురాణాలను ఈ కాలంలోనే రాశారు. మనుధర్మశాస్త్రం, యజ్ఞవల్క్యస్మృతి మొదలైనవి ఈ కాలంనాటి ప్రముఖ గ్రంథాలు.

విజ్ఞానశాస్త్ర గ్రంథాలు: గుప్తుల కాలంలో సాహిత్యంతోపాటు విజ్ఞాన శాస్త్రం కూడా అభివృద్ధి చెందింది. గణిత, ఖగోళ, భౌతిక, వైద్యశాస్త్రాలు అభివృద్ధి చెందాయి. దశాంశ పద్ధతి, సున్నా విలువలు వాడుకలోకి వచ్చాయి. రెండో చంద్రగుప్తుడు ఉజ్జయినిలో నక్షత్రశాలను నెలకొల్పాడు. మెహరోలిలో నక్షత్రాల పరిశీలన కోసం వరహమిహిరుడికి రెండో చంద్రగుప్తుడు ఎత్తయిన ఇనుప స్తంభం నిర్మించి ఇచ్చాడు. రోమక, జాతక, లఘు అనే గణితశాస్త్ర గ్రంథాలను వరహమిహిరుడు రాశాడు. అదేవిధంగా బృహత్‌సంహిత గ్రంథంలో భూగోళ, ఖగోళ, జ్యోతిష, వృక్ష శాస్త్రాల గురించి రాశాడు. ఆర్యబట్టీయం, సూర సిద్ధాంతాలను ఆర్యబట్టు రచించాడు. వీటిలో సూర్య, చంద్ర గ్రహణాల గురించి వివరించాడు. వాగ్భటుడు వైద్యంలో అష్టాంగ సంగ్రహం అనే గ్రంథం రాశాడు. పాలకశ్యపుడు హస్తాయుర్వేదంలో పశువైద్యం గురించి రాశాడు. ధన్వంతరి, శుశ్రుతుడు గుప్తుల కాలంలో గొప్ప వైద్యులు.

నలంద విశ్వవిద్యాలయం



దీనిని కుమారగుప్తుడు నిర్మించాడు. తరవాత పుష్యభూపతి వంశంలో హర్షుడు ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేశాడు. ఆ తరవాత పాలరాజులకు చెందిన ధర్మపాలుడు కూడా ఈ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేశాడు. సంస్కృతంలో 'నలం' అంటే జ్ఞానం లేదా పద్మం అని, 'ద' అంటే ఇవ్వడం అని అర్థం. నలంద విశ్వవిద్యాలయంలో మూడు గొప్ప గ్రంథాలయాలు ఉన్నాయి. వీటికి తురుష్కరాజులు సహాయం చేశారు. 12వ శతాబ్దంలో భక్తియార్ ఖిల్జీ చేతిలో ఈ విశ్వవిద్యాలయం పతనం చెందింది.



డాక్టర్ ఐ. నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట్.

కోడింగ్ - డీకోడింగ్

పార్ట్-3

1. ఒక కోడ్ భాషలో MERITను 7, 18, 9, 22, 14గా రాశారు. అదే కోడ్ భాషలో PONDSను ఏ విధంగా రాస్తారు?
ఎ) 11, 12, 23, 13, 8 బి) 11, 13, 12, 8, 23
సి) 8, 23, 13, 12, 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: MERIT అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా M అనగా 14వ అక్షరం, E అనగా 22, R అనగా 9, I అనగా 18, T అనగా 7. ఈ సంఖ్యలను రివర్స్ చేయగా 7, 18, 9, 22, 14. ఇదే విధంగా PONDS అనే పదాల్లోని అక్షరాలకు అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా P అనగా 11, O అనగా 12, N అనగా 13, D అనగా 23, S అనగా 8. కావున 8, 23, 13, 12, 11 అనగా 'సి' సమాధానం అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో LUNCHను **58**గా రాశారు. అదే కోడ్ భాషలో FRUITను ఏ విధంగా రాస్తారు?
ఎ) 74 బి) 68 సి) 72 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: LUNCH అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా L అనగా 12, U అనగా 21, N అనగా 14, C అనగా 3, H అనగా 8, 12+21+14+3+8=58. ఇదే విధంగా PONDS అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా F అనగా 6, R అనగా 18, U అనగా 21, I అనగా 9, T అనగా 20. కావున 6 + 18 + 21 + 9 + 20 = 74 సమాధానం అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో BIGను 324గా రాశారు. అదే కోడ్ భాషలో ACTను ఏ విధంగా రాస్తారు?
ఎ) 576 బి) 529 సి) 676 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: BIG అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 9, 7 వీటిని కూడగా 2+9+7=18. ఈ 18 వర్గం (స్క్వేర్) 324. అదే విధంగా ACT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 3, 20 వీటిని కూడగా 1+3+20=24. ఈ 24 వర్గమే (స్క్వేర్) 576.

4. ఒక కోడ్ భాషలో AIMను **251**గా రాశారు. అదే కోడ్ భాషలో INKను ఏ విధంగా రాస్తారు?
ఎ) 416 బి) 398 సి) 264 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: AIM అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 9, 13. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $1^2, 9^2, 13^2$ = 1+81+169=251 అదే విధంగా INK అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 9, 14, 11. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $9^2, 14^2, 11^2$= 81+196+121=398 సమాధానం అవుతుంది.

5. ఒక కోడ్ భాషలో HATను **160**గా రాశారు. అదే కోడ్ భాషలో 'PAN'ను ఏ విధంగా రాస్తారు?
ఎ) 224 బి) 242
సి) 422 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: HAT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 8, 1, 20. వీటిని గుణించగా 8x1x20=160 అదే విధంగా PAN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 16, 1, 14 వీటిని గుణించగా 16x1x14 = 224 సమాధానం అవుతుంది.

6. ఒక కోడ్ భాషలో PLANEను **96**గా రాశారు. అదే కోడ్ భాషలో SOLVEను ఏ విధంగా రాస్తారు?
ఎ) 142 బి) 144 సి) 146 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: PLANE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు P అనగా 16, L అనగా 12, A అనగా 1, N అనగా 14 E అనగా 5 వీటిని కూడగా 16+12+1+14+5=48కి రెట్టింపు 96. అదే విధంగా SOLVE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు S అనగా 19, O అనగా 15, L అనగా 12, V అనగా 22, E అనగా 5 వీటిని కూడగా 19+15+12+22+5=73 కి రెట్టింపు 146 సమాధానం అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో SMART ను **128**గా రాశారు. అదే కోడ్ భాషలో RANGEను ఏ విధంగా రాస్తారు?
ఎ) 180 బి) 160 సి) 168 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: SMART అనే పదంలోని అక్షరాలకు అపసవ్య దిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా S అనగా 8, M అనగా 14, A అనగా 26, R అనగా 9, T అనగా 7. వీటిని కూడగా 8+14+26+9+7=64కి రెట్టింపు 128. ఇదే విధంగా RANGE అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు R అనగా 9, A అనగా 26, N అనగా 13, G అనగా 20, E అనగా 22 వీటిని కూడగా 9+26+13+20+22=90 రెట్టింపు 180 సమాధానం అవుతుంది.

8. ఒక కోడ్ భాషలో LIKEను **33**గా రాశారు. అదే కోడ్ భాషలో EARNను ఏ విధంగా రాస్తారు?
ఎ) 34 బి) 38 సి) 37డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: LIKE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 12+9+11+5=37. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 37 నుంచి 4 తీసివేస్తే 37-4=33. అదే విధంగా EARN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 5+1+18+14=38. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 38 నుంచి 4 తీసివేస్తే 38-4=34 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

కోల్‌కతా అలవోకగా..

8 వికెట్లతో లఖ్‌నవూపై గెలుపు
మెరిసిన సాల్ట్, స్టార్క్
పూరన్ పోరాటం వృథా


ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 89 నాటౌట్)

కోల్‌కతా: ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 89 నాటౌట్) దూకుడైన అర్ధ శతకంతోపాటు పేసర్ స్టార్క్ (3/28) చెలరేగడంతో.. కోల్‌కతా నైట్‌రైడర్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. ఆదివారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 8 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)పై అలవోక విజయం సాధించింది. తొలుత లఖ్‌నవూ 20 ఓవర్లలో 161/7 స్కోరు చేసింది. పూరన్ (45), రాహుల్ (39), ఆయుష్ బదోని (29) ఫర్వాలేదనిపించారు. నరైన్ (1/17) ఒక్క బౌండ్రీ కూడా ఇవ్వకుండా పొదుపుగా బౌలింగ్ చేశాడు. అనంతరం కోల్‌కతా 15.4 ఓవర్లలో 162/2 స్కోరు చేసి నెగ్గింది. లక్ష్య ఛేదనలో ఓపెనర్ నరైన్ (6), రఘువంశీ (7)లను మొహిసిన్ అవుట్ చేసి కోల్‌కతాకు షాకిచ్చాడు. కానీ, మరో ఓపెనర్ సాల్ట్, శ్రేయాస్ అయ్యర్ (38 నాటౌట్) మూడో వికెట్‌కు 76 బంతుల్లో 120 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో కోల్‌కతా 26 బంతులు మిగిలుండగానే గెలిచింది. లఖ్‌నవూ తరపున అరంగేట్రం చేసిన జోసెఫ్ తొలి ఓవర్ బౌల్ చేసి రెండు వైడ్లు, రెండు నోబాల్స్‌తో ఏకంగా 22 పరుగులిచ్చాడు. కాగా, ఐపీఎల్‌లో లఖ్‌నవూపై కోల్‌కతాకు ఇదే మొదటి విజయం. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా సాల్ట్ నిలిచాడు.

పూరన్ ఒక్కడే..: మిస్టరీ స్పిన్నర్ నరైన్, వరుణ్ పరుగులను కట్టడి చేయగా.. ఆఖరి ఓవర్లో స్టార్క్ రెండు వికెట్లతో సత్తా చాటడంతో లఖ్‌నవూ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. ఒక దశలో ఎల్ఎస్‌జీ 111/5తో పీకల్లోతు కష్టాల్లో పడిన సమయంలో పూరన్ ఎదురుదాడితో టీమ్ స్కోరు 160 పరుగుల మార్క్‌ను దాటింది. క్రునాల్ (7 నాటౌట్)తో కలసి ఆరో వికెట్‌కు 44 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన పూరన్‌ను ఇన్నింగ్స్ చివరి ఓవర్లో స్టార్క్ పెవిలియన్ చేర్చాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఓపెనర్ డికాక్ (10), హుడా (8)లను స్వల్ప స్కోర్లకే కోల్పోయింది. దీంతో పవర్‌ప్లే ముగిసే సమయానికి సూపర్ జెయింట్స్ 49/2తో నిలిచింది. ఈ దశలో రాహుల్, బదోని ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసినా.. నరైన్, రాణా భారీ షాట్లు ఆడకుండా అడ్డుకొన్నారు. రాహుల్‌ను రస్సెల్ పెవిలియన్ చేర్చగా.. స్టొయినిస్ (10)ను వరుణ్ బోల్తా కొట్టించాడు. బదోనిని 15వ ఓవర్లో నరైన్ క్యాచవుట్ చేశాడు. అయితే, డెత్ ఓవర్లలో పూరన్ దూకుడైన ఆటతో లఖ్‌నవూ 48 పరుగులు రాబట్టగలిగింది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: డికాక్ (సి) నరైన్ (బి) వైభవ్ 10, రాహుల్ (సి) రమణ్‌దీప్ (బి) రస్సెల్ 39, దీపక్ హుడా (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 8, బదోని (సి) రఘువంశీ (బి) నరైన్ 29, స్టొయినిస్ (సి) సాల్ట్ (బి) వరుణ్ 10, పూరన్ (సి) సాల్ట్ (బి) స్టార్క్ 45, క్రునాల్ (నాటౌట్) 7, అర్షద్ (బి) స్టార్క్ 5; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 161/7; వికెట్ల పతనం:** 1-19, 2-39, 3-78, 4-95, 5-111, 6-155, 7-161; **బౌలింగ్:** స్టార్క్ 4-0-28-3, వైభవ్ 3-0-34-1, హర్షిత్ రాణా 4-0-35-0, నరైన్ 4-0-17-1, వరుణ్ చక్రవర్తి 4-0-30-1, రస్సెల్ 1-0-16-1.

కోల్‌కతా: సాల్ట్ (నాటౌట్) 89, నరైన్ (సి) స్టొయినిస్ (బి) మొహిసిన్ 6, రఘువంశీ (సి) రాహుల్ (బి) మొహిసిన్ 7, శ్రేయాస్ (నాటౌట్) 38; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 15.4 ఓవర్లలో 162/2; వికెట్ల పతనం:** 1-22, 2-42; **బౌలింగ్:** జోసెఫ్ 4-0-47-0, మొహిసిన్ 4-0-29-2, క్రునాల్ 1-0-14-0, యశ్ ఠాకూర్ 2-0-25-0, అర్షద్ 2-0-24-0, బిష్ణోయ్ 2.4-0-17-0.

ధవన్ రెండు మ్యాచ్‌లకు దూరం



న్యూఢిల్లీ: పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శిఖర్ ధవన్ దాదాపు పది రోజుల పాటు ఐపీఎల్‌కు దూరం కానున్నాడు. భుజం నొప్పి కారణంగా శనివారం రాజస్థాన్‌తో మ్యాచ్‌లోనూ అతడు ఆడలేదు. ముంబై, గుజరాత్ జట్లతో జరిగే మ్యాచ్‌లకు అతను అందుబాటులో ఉండడు. దీంతో సామ్ కర్రాన్ సారథ్యం వహించనున్నాడు.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం.
బెంగళూరు x హైదరాబాద్

రోహిత్ వందేసినా చెన్నై చిందేసింది!

- ముంబైపై ఘనవిజయం
- రుతురాజ్, దూబే అర్ధసెంచరీలు
- మహీ మెరుపులు
- పతిరనకు నాలుగు వికెట్లు

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (సి) హార్దిక్ (బి) కొట్జీ 5, రచిన్ (సి) ఇషాన్ (బి) గోపాల్ 21, రుతురాజ్ (సి) నబీ (బి) హార్దిక్ 69, దూబే (నాటౌట్) 66, మిచెల్ (సి) నబీ (బి) హార్దిక్ 17, ధోనీ (నాటౌట్) 20, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/4; వికెట్ల పతనం:** 1-8, 2-60, 3-150, 4-186; **బౌలింగ్:** నబీ 3-0-19-0, కొట్జీ 4-0-35-1, బుమ్రా 4-0-27-0, ఆకాశ్ 3-0-37-0, శ్రేయాస్ గోపాల్ 1-0-9-1, హార్దిక్ 3-0-43-2, షెఫర్డ్ 2-0-33-0.

ముంబై: రోహిత్ (నాటౌట్) 105, ఇషాన్ (సి) శార్దూల్ (బి) పతిరన 23, సూర్యకుమార్ (సి) ముస్తాఫిజుర్ (బి) పతిరన 0, తిలక్ (సి) శార్దూల్ (బి) పతిరన 31, హార్దిక్ (సి) జడేజా (బి) తుషార్ 2, టిమ్ డేవిడ్ (సి) రవీంద్ర (బి) ముస్తాఫిజుర్ 13, షెపర్డ్ (బి) పతిరన 1, నబీ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 186/6; వికెట్ల పతనం:** 1-17, 2-70, 3-130, 4-134, 5-148, 6-157; **బౌలింగ్:** తుషార్ దేశ్‌పాండే 4-0-29-1, ముస్తాఫిజుర్ 4-0-55-1, శార్దూల్ 4-0-35-0, జడేజా 4-0-37-0, పతిరన 4-0-28-4.


రోహిత్ (63 బంతుల్లో 105 నాటౌట్)

1 టీ20ల్లో 500+ సిక్సర్లు బాదిన తొలి భారత క్రికెటర్‌గా రోహిత్. ఓవరాల్‌గా ఐదో బ్యాటర్.

ముంబై: 'ఐపీఎల్ ఎల్‌క్లాసికో'గా పేరు తెచ్చుకున్న చెన్నై సూపర్ కింగ్స్-ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. చివరికి ఆల్‌రౌండ్‌షో చూపిన సీఎస్‌కేదే పైచేయి అయ్యింది. బ్యాటింగ్‌లో రుతురాజ్ (40 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 69), శివమ్ దూబే (38 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 66 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌కు తోడు.. ఆఖరి ఓవర్లో 42 ఏళ్ల ధోనీ (4 బంతుల్లో 3 సిక్సర్లతో 20 నాటౌట్) ఫినిషింగ్ జట్టు విజయంలో అత్యంత కీలకంగా నిలిచింది. ఇక వాంఖడేలో జోరు మీదున్న ముంబై బ్యాటర్లను 21 ఏళ్ల యువ పేసర్ పతిరన (4/28) అద్భుతంగా అడ్డుకున్నాడు. రోహిత్ శర్మ (63 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 105 నాటౌట్) అజేయ శతకంతో తుదికంటా నిలిచినా ఫలితం లేకపోయింది. దీంతో 20 పరుగులతో చెన్నై నెగ్గింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా చెన్నై 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. హార్దిక్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 రన్స్ చేసి ఓడింది. తిలక్ (31), ఇషాన్ (23) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా పతిరన నిలిచాడు.

రోహిత్ పోరాడినా..: 207 పరుగుల ఛేదనలో ముంబై 7 ఓవర్లలోనే 70 పరుగులు సాధించింది. అయితే, మధ్య ఓవర్లలో సీఎస్‌కే బౌలర్లు ముంబైకి ముకుతాడు వేశారు. వరుస విరామాల్లో వికెట్లు తీసి ముంబైని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టారు. అటు రోహిత్ భారీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నా జట్టును గెలిపించలేకపోయాడు. అయితే ఆరంభంలో ఓవర్‌కు పది రన్‌రేట్‌తో స్కోరు బోర్డు పరిగెత్తింది. ముఖ్యంగా రోహిత్ హిట్టింగ్‌తో చెన్నై బౌలర్లను ఆడేసుకున్నాడు. ఓపెనర్ ఇషాన్‌తో కలిసి తొలి వికెట్‌కు 70 రన్స్ జోడించాడు. వీరి జోరుకు పవర్‌ప్లేలోనే 63 పరుగులు చేరాయి. కానీ ఎనిమిదో ఓవర్లో ఇషాన్‌తో పాటు సూర్యను పతిరన డకౌట్ చేశాడు. అటు 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన రోహిత్ ఎక్కడా తగ్గలేదు. 11వ ఓవర్లో రోహిత్ 4,6.. తిలక్ 4తో 18 రన్స్ సమకూరగా జట్టు స్కోరు కూడా వంద దాటింది. మూడో వికెట్‌కు 60 రన్స్ జత చేరాక తిలక్‌ను పతిరన అవుట్ చేశాడు. ఇక్కడి నుంచి జట్టు తడబడింది. మరోవైపు 15, 16 ఓవర్లలో కలిపి ఐదు పరుగులే రాగా, హార్దిక్ (2) వికెట్ కూడా కోల్పోవడంతో ముంబై ఒత్తిడిలో పడింది. దీనికి తోడు రెండు వరుస సిక్సర్లతో ధాటిని చూపిన టిమ్ డేవిడ్ (13)ను ముస్తాఫిజుర్ అవుట్ చేయడం కూడా దెబ్బతీసింది. ఆఖరి ఓవర్లో 34 రన్స్ అవసరం కాగా ముంబై ఓటమి ఖాయమైంది. రెండు వరుస ఫోర్లతో రోహిత్ సెంచరీ పూర్తి చేసినా ఫలితం లేకపోయింది.


పతిరన (4/28)
ధోనీ (4 బంతుల్లో 20 నాటౌట్)

రుతురాజ్, దూబే అర్ధసెంచరీలు: టాస్ కోల్పోయిన చెన్నై బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్‌గా రహానె (5) ప్రయోగం విఫలమైంది. కానీ మధ్య ఓవర్లలో రుతురాజ్-దూబే జోడీ చెలరేగింది. అలాగే ధోనీ ఫినిషింగ్ టచ్‌తో స్కోరు 200 దాటగలిగింది. రహానెను రెండో ఓవర్లోనే కొట్జీ అవుట్ చేశాడు. ఇక వన్‌డౌన్‌లో వచ్చిన రుతురాజ్ వేగాన్ని చూపుతూ, మూడో ఓవర్లో సిక్సర్‌తోపాటు ఐదో ఓవర్లో 4,6,4తో 14 రన్స్ అందించాడు. అలాగే ఆరో ఓవర్లో రచిన్ (21), రుతురాజ్ చెరో ఫోర్‌తో పవర్‌ప్లేలో సీఎస్‌కే 48 పరుగులు చేయగలిగింది. కానీ, స్పిన్నర్ శ్రేయాస్ గోపాల్ ఓవర్లో సిక్సర్ బాదిన వెంటనే ఓ గూగ్లీకి రచిన్ క్యాచవుటయ్యాడు. కీపర్ ఇషాన్ ఒత్తిడి మేరకు రివ్యూకు వెళ్లిన ముంబై ఈ వికెట్ సాధించింది. దీంతో రెండో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో రుతురాజ్‌కు దూబే కలవడంతో చెన్నై స్కోరు దూసుకెళ్లింది. పదో ఓవర్లో దూబే మూడు ఫోర్లు బాదగా, అటు రుతురాజ్ ఓ భారీ సిక్సర్‌తో 33 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఇక 14వ ఓవర్లో దూబే 6,6,4,4తో శివాలెత్తి 22 పరుగులు రాబట్టాడు. ఈ దూకుడుకు 28 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ పూర్తయ్యింది. ఇక మధ్వాల్ ఓవర్లో 6,4 సాధించిన రుతురాజ్‌ను హార్దిక్ పాండ్యా దెబ్బతీశాడు. దీంతో వికెట్ కోసం ఎదురుచూస్తున్న ముంబైకి రిలీఫ్ దక్కింది. అప్పటికే మూడో వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. అయితే డారిల్ మిచెల్ (17) నిదానంగా ఆడడం చెన్నై భారీ స్కోరుపై ప్రభావం పడింది. 19వ ఓవర్లో బుమ్రా యార్కర్లకు 7 పరుగులే రాగా.. ఆఖరి ఓవర్ రెండో బంతికి మిచెల్ అవుటయ్యాడు. అటు వాంఖడేలో ఫ్యాన్స్ చప్పట్ల మధ్య బరిలోకి దిగిన ధోనీ తానెదుర్కొన్న 4 బంతుల్లో వరుసగా 6,6,6,2తో హోరెత్తించాడు. దీంతో 26 పరుగులు రాబట్టిన సీఎస్‌కే సవాల్ విసిరే స్కోరును సాధించగలిగింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
రాజస్థాన్	6	5	1	0	10	0.767
కోల్‌కతా	5	4	1	0	8	1.688
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	5	3	2	0	6	0.344
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
గుజరాత్	6	3	3	0	6	-0.637
పంజాబ్	6	2	4	0	4	-0.218
ముంబై	6	2	4	0	4	-0.234
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	6	1	5	0	2	-1.124

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

షూటర్ పాలక్‌కు ఒలింపిక్ బెర్త్



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల విజేత పాలక్ గులియా షూటింగ్‌లో భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ అందించింది. బ్రెజిల్‌లోని రియో డి జెనీరోలో ఆదివారం జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫికేషన్ (రైఫిల్, పిస్టల్) షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 18 ఏళ్ల పాలక్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కాంస్యం సాధించింది. పారిస్ విశ్వక్రీడల్లో రైఫిల్, పిస్టల్ విభాగంలో భారత్‌కు ఇది 16వ బెర్త్ కావడం విశేషం.

అంజు, హర్షితకు రజతాలు

అంతిమ్, మనీషా కంచు మోత
ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

బిష్‌కెక్ (కిర్గిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్‌ను భారత మహిళా రెజ్లర్లు కూడా స్వర్ణం లేకుండానే ముగించారు. ట్రయల్స్‌లో వినేష్ ఫొగట్‌కు ఝలక్ ఇచ్చిన అంజుతోపాటు హర్షిత రజతాలతో సరిపెట్టుకోగా.. అంతిమ్, మనీషా కాంస్య పతకాలు సాధించారు. ఆదివారం జరిగిన 53 కిలోల ఫైనల్లో అంజు 0-10తో జి హయంగ్ కిమ్ (కొరియా) చేతిలో పరాజయం పాలైంది. మొత్తంగా మహిళలు మూడు రజతాలు, మూడు కాంస్యాలు అందించారు. పురుషుల్లో ఉదిత్ (57 కి) రజతం సాధించగా.. అభిమన్యు (70 కి), విక్కీ (97 కి) కంచు పతకాలతో సరిపెట్టారు.

టాప్‌లో గుకేష్

టొరొంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఎనిమిదో రౌండ్ ముగిసే సరికి గుకేష్ తిరిగి ఆధిక్యంలోకి వచ్చాడు. విదిత్ గుజరాతీతో జరిగిన ఈ రౌండ్‌లో గుకేష్ నెగ్గాడు. ప్రజ్ఞానంద ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజాతో గేమ్‌ను డ్రా చేశాడు. ఈ రౌండ్ ఆఖరికి నెపోమ్నియాచితో కలిసి 5 పాయింట్లతో గుకేష్ టాప్‌లో నిలిచాడు. ప్రజ్ఞానంద (4.5) రెండు, విదిత్ (3.5) నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల్లో వైశాలిపై గెలుపొందిన హంపి (3.5పాయింట్లు)సంయుక్తంగా ఐదో స్థానంలో ఉంది.

బిజినెస్

21,320 దిగువన బేరిష్

(ఏప్రిల్ 15-19 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 22,776-21,504 పాయింట్ల మధ్యన కదలాడి అంతకు ముందు వారంతో పోల్చితే చెప్పుకోదగ్గ తేడా ఏమీ లేకుండా ఫ్లాట్‌గా 22,519 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 21,320 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,270, 22,142, 21,633, 20,574 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,820 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 22,420
నిరోధ స్థాయిలు: 22,720, 22,820, 22,920 (22,620 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,420, 22,320, 22,220 (21,420 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126
వరంగల్	126
కరీంనగర్	126
మహబూబ్‌నగర్	126
కర్నూలు	126
విశాఖపట్నం	114
గోదావరి	127
విజయవాడ	127
గుంటూరు	127
ఒంగోలు	127
చిత్తూరు	129

అదానీ షేర్లతో ఎల్ఐసీకి జాక్‌పాట్

ఏడాదిలో రూ.22,739 కోట్ల లాభం

న్యూఢిల్లీ: విమర్శలు ఎలా ఉన్నా, అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో పెట్టుబడులు భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ)కి జాక్‌పాట్‌గా మారాయి. 2023 మార్చి 31 నాటికి అదానీ గ్రూప్‌లోని ఏడు లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ.38,471 కోట్లుగా ఉంటే ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.22,739 కోట్ల (59 శాతం) లాభంతో రూ.61,210 కోట్లకు చేరింది. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత కూడా అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో పెట్టుబడి పెట్టాలన్న ఎల్ఐసీ నిర్ణయం గత ఏడాది తీవ్ర విమర్శలకు లోనైంది. మరోవైపు ఈ నివేదిక దెబ్బకు ఒక దశలో 15,000 కోట్ల డాలర్ల వరకు మార్కెట్ క్యాప్‌ను కోల్పోయిన అదానీ గ్రూప్ కంపెనీలు మళ్లీ అంతే వేగంగా మదుపరులకు లాభాలు పంచాయి. అయితే రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఎల్ఐసీ.. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లలో వ్యూహాత్మకంగా పెట్టుబడులు తగ్గించుకుంది. అయితే ఈ రెండు కంపెనీల షేర్ల ధరలు గత ఏడాది కాలంలో 68.4 శాతం, 83 శాతం పెరగటం గమనార్హం. అయినప్పటికీ గత ఏడాది కాలంలో అదానీ గ్రూప్‌లోని ఏడు లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ 59 శాతం పెరగడం విశేషం.



విదేశీ మదుపరులదే హవా

హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత ఎల్ఐసీ తప్ప దేశీయ సంస్థాగత మదుపరులు గానీ, రిటైల్ మదుపరులు గానీ అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు అంటేనే భయపడ్డారు. ఈ షేర్లు కొంటే ఎక్కడ మునిగిపోతామోనని భయపడిపోయారు. అయితే అదే అదునుగా విదేశీ మదుపరులు అదానీ గ్రూప్ కంపెనీల షేర్లను భారీగా కొనుగోలు చేశారు. ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, అబుదాబీ కేంద్రంగా పని చేసే ఐహెచ్‌సీ, ఫ్రాన్స్‌కు చెందిన ఇంధన దిగ్గజం టోటల్ ఎనర్జీస్, అమెరికా కేంద్రంగా పని చేసే పీఈ సంస్థ జీక్యూజీ ఇన్వెస్ట్‌మెంట్ దాదాపు రూ.45,000 కోట్ల మొత్తాన్ని అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో మదుపు చేసి మంచి లాభాలు మూటగట్టుకున్నాయి.

ఇళ్ల అమ్మకాల్లో 41% వృద్ధి

- హైదరాబాద్‌లో 40% అప్
- లగ్జరీ ఫ్లాట్లకే యమ గిరాకీ
- ప్రాప్ టైగర్ వెల్లడి

న్యూఢిల్లీ: రియల్టీ మార్కెట్ జోరు కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 1,20,640 నివాస గృహాలు, ఫ్లాట్లు అమ్ముడుపోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 41 శాతం ఎక్కువ. ఇందులో 74 శాతం గృహాలు, ఫ్లాట్లు ముంబై, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం, పుణెల్లో అమ్ముడైనట్లు హౌసింగ్ బ్రోకరేజీ సంస్థ ప్రాప్‌టైగర్.కామ్ నివేదిక వెల్లడించింది.

రూ.1,10,880 కోట్ల టర్నోవర్: విలువపరంగా చూసినా ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో అమ్ముడైన ఇళ్లు, ఫ్లాట్ల విలువ రూ.66,155 కోట్ల నుంచి 68% పెరిగి రూ.1,10,880 కోట్లకు చేరింది. అన్నిటికంటే ప్రధాన అంశం ఈ ఏడాది జనవరి-మార్చిలో అమ్ముడైన ఇళ్లు, ఫ్లాట్లలో రూ.కోటి అంతకంటే ఖరీదైన ఇళ్లు, ఫ్లాట్ల వాటా 37 శాతంగా ఉంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11% ఎక్కువ. ఇదే సమయంలో రూ.25 లక్షల వరకు విలువ ఉండే ఇళ్ల అమ్మకాలు 15% నుంచి 5 శాతానికి, రూ.25-45 లక్షల మధ్య ఉండే ఇళ్ల అమ్మకాలు 23% నుంచి 17 శాతానికి పడిపోయాయని పేర్కొంది.



హైదరాబాద్ అదుర్స్

హైదరాబాద్‌లోనూ ఇళ్లు, ఫ్లాట్ల అమ్మకాలు 40 శాతం వృద్ధి రేటుతో 10,200 యూనిట్ల నుంచి 14,290 యూనిట్లకు చేరాయి. ఇక విలువపరంగా చూసినా హైదరాబాద్‌లో అమ్ముడైన ఇళ్లు, ఫ్లాట్ల విలువ 143 శాతం వృద్ధి రేటుతో రూ.9,711 కోట్ల నుంచి రూ.23,580 కోట్లకు చేరింది. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలో తప్ప ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో మరే నగరంలోనూ ఇళ్ల అమ్మకాలు ఇంత భారీ సాయిలో జరగలేదు. అమ్ముడైన ఇళ్ల విస్తీర్ణపరంగా చూస్తే మాత్రం 3.5 కోట్ల ఎస్ఎఫ్‌టీతో హైదరాబాద్ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ

హైదరాబాద్	395
చిత్తూరు	468
గోదావరి	404
విజయవాడ	404
విశాఖపట్నం	419
వరంగల్	397

డజను గుడ్లు రూ.60

ఐసీఐసీఐ ప్రు బ్లూచిప్ ఫండ్‌తో మెరుగైన రిటర్నులు

ఇన్వెస్టర్లకు మంచి రిటర్నులు అందించటంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్ ముందంజలో ఉంది. 2008 మే నెలలో ఈ ఫండ్ ప్రారంభమైన సందర్భంలో రూ.లక్ష పెట్టుబడిగా పెట్టి ఉంటే ఈ ఏడాది మార్చి 31 నాటికి ఈ మొత్తం రూ.9.6 లక్షలకు చేరుకుంది. ఈ కాలంలో బెంచ్‌మార్క్ ఇండెక్స్ 35 శాతం రిటర్నులు అందిస్తే ఈ ఫండ్ 42 శాతం రిటర్నులు అందించటం విశేషం. మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా టాప్ 100 కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టింది. 2008 ఆర్థిక సంక్షోభం, 2013లో వడ్డీ రేట్ల పెంపు, 2020లో కొవిడ్-19 వచ్చినప్పటికీ ఈ ఫండ్ మెరుగైన రిటర్నులు అందించింది. ఇక సిప్ రూపంలో ఈ ఫండ్ ప్రారంభం నుంచి ప్రతి నెలా రూ.10,000 పెట్టుబడిగా పెట్టి ఉంటే (మొత్తం పెట్టుబడి రూ.19 లక్షలు)..ఈ ఏడాది మార్చి నాటికి ఈ పెట్టుబడి విలువ రూ.78.32 లక్షలకు చేరుకుందని వివరించింది.

అప్రమత్తంగా ఉండటం బెటర్..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. గరిష్ఠ స్థాయిల్లో నిరోధం ఎదురవటం, అంతర్జాతీయ పరిణామాలు ఇందుకు కారణాలుగా ఉండనున్నాయి. ఇజ్రాయెల్, ఇరాక్ మధ్య ప్రాక్సీవార్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లో మాత్రమే పెట్టుబడులు పెట్టాలి. కొద్ది రోజులుగా రాణిస్తూ వస్తున్న బ్యాంకింగ్, మెటల్ రంగాల్లో స్వల్పకాల దిద్దుబాటు జరగొచ్చు. నిఫ్టీ ఫ్యూచర్స్ మద్దతు 22,600, నిరోధం 22,750 వద్ద ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

సీడీఎస్ఎల్: ఈ కౌంటర్ అప్‌ట్రెండ్‌కు సిద్ధంగా ఉంది. నవంబరు నుంచి అక్యుములేషన్ జరుగుతోంది. అప్పటి నుంచి సైడ్‌వేస్‌లో చలిస్తున్న షేరు ధర మరోసారి కీలక నిరోధ స్థాయికి చేరింది. నిఫ్టీతో పోల్చితే మెరుగైన ప్రదర్శన, డెలివరీ వాల్యూమ్ పెరగటం, అప్పర్ బొలింజర్ బ్యాండ్ బ్రేక్ చేయటం సానుకూల అంశాలు. గత శుక్రవారం ఈ షేరు 6.7 శాతం లాభంతో రూ.2,008 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,950 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.2,060/2,110 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,920 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

గుజరాత్ ఫ్లోరోకెమికల్స్: కన్సాలిడేషన్ అనంతరం ఈ కౌంటర్‌లో మూమెంటమ్ పెరిగింది. రూ.3,150 స్థాయిల్లో మద్దతు లభించింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. చివరి రెండు సెషన్లలో మరుబోజు క్యాండిల్స్ ఏర్పడటం గమనార్హం. గత శుక్రవారం ఈ షేరు రూ.3,582 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.3,560 స్థాయిల్లో ప్రవేశించి రూ.3,700 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,520 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా పవర్: సుదీర్ఘకాలంగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. చివరి పది సెషన్లలో ఈ కౌంటర్ లాభాల్లోనే ముగుస్తూ వస్తుండటం విశేషం. వాల్యూమ్ తక్కువగా నమోదవుతుండటాన్ని బట్టి చూస్తే ఇన్వెస్టర్లు ఈ షేరును వదులుకోవటానికి ఇష్టపడటం లేదని తెలుస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.436 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.430/410 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.485/510 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.400 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

క్రాంప్టన్ గ్రీవ్స్: గత మూడేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తూ వస్తున్న ఈ షేరు టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి అక్యుములేషన్ జరుగుతోంది. ఈ ఏడాది మార్చి నుంచి డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతుండటం, మరుబోజు క్యాండిల్ ఏర్పడటం బుల్లిష్‌నెస్‌కు సంకేతాలు. గత శుక్రవారం 2.94 శాతం లాభంతో రూ.298 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.290 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.325/355 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.270 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ: ఈ కౌంటర్‌లో కొంతకాలంగా బుల్లిష్‌నెస్ కనిపిస్తోంది. స్వల్ప దిద్దుబాటు తర్వాత కీలక నిరోధ స్థాయి రూ.290ని అధిగమించింది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా ట్రేడవ్వటం, వాల్యూమ్ భారీగా పెరుగుతుండటం సానుకూల అంశాలు. గత శుక్రవారం ఈ షేరు రూ.305.30 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.280 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.310/330 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.260 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

మార్కెట్ బలహీనం.. 22,500 కీలకం


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గానే ప్రారంభమై 22,775 వరకు వెళ్లినా నిలదొక్కుకోలేక అంతకుముందు వారంతో పోల్చితే ఫ్లాట్‌గా వారం కనిష్ఠ స్థాయికి చేరువలో అత్యంత కీలక స్థాయి 22,500 సమీపంలో క్లోజైంది. గరిష్ఠ స్థాయిల నుంచి 275 పాయింట్ల మేరకు ఇంట్రా వీక్ కరెక్షన్‌కు లోనవటం గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతకు సంకేతం. గత నాలుగు వారాల్లో 1,000 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించిన అనంతరం కరెక్షన్ ధోరణిలో పడినట్టు కనిపిస్తోంది. కాగా గత వారంలో మిడ్‌క్యాప్ 100 సూచీ 44 పాయింట్లు, స్మాల్‌క్యాప్ సూచీ 140 పాయింట్లు లాభంలో ముగిశాయి. శుక్రవారం మార్కెట్ ముగిసిన అనంతరం టీసీఎస్ ఆర్థిక ఫలితాలు, ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడడంతో పాటు పశ్చిమాసియాలో తాజా ఉద్రిక్తతలు కూడా చెలరేగినందు వల్ల మార్కెట్ ఆ పరిణామాలకు తగ్గట్టుగా ప్రారంభం కావచ్చు. అలాగే గతంలో కీలక స్థాయి 22,500ని బ్రేక్ చేసినందు వల్ల గత వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడి, ఇప్పుడు ఈ 22,500 మద్దతు స్థాయిగా మారింది.

బుల్లిష్ స్థాయిలు: రియాక్షన్ అనంతరం రికవరీ బాట పట్టినట్టయితే ట్రెండ్‌లో సానుకూలత కోసం 22,500 వద్ద నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధం 22,700. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది. మరో నిరోధం 23,000.

బేరిష్ స్థాయిలు: 22,500 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. దిగువన మద్దతు స్థాయి 22,300. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మద్దతు స్థాయిలు 22,150, 21,950.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా ర్యాలీలో 49,000 వరకు చేరిన అనంతరం 500 పాయింట్ల మేరకు కరెక్షన్ సాధించింది. చివరికి వారం కనిష్ఠ స్థాయి గత వారం కన్నా 70 పాయింట్ల స్వల్పలాభంతో 48,500 వద్ద ముగిసింది. ప్రధాన మద్దతు స్థాయిలు 48,000, 47,700. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. రియాక్షన్ అనంతరం రికవరీ బాట పడితే నిరోధ స్థాయి 48,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆపై నిరోధం 49,000.

పాటర్న్: నిఫ్టీ 22300 వద్ద "అడ్డంగా ఏర్పడిన ఏటవాలు మద్దతు రేఖ" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు. మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకునే ఆస్కారం ఉన్నందు వల్ల మరింత కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం శుక్రవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు
నిరోధం : 22,520, 22,600
మద్దతు : 22,380, 22,300
www.sundartrends.in

మరో యాత్రతో ప్రజల్లోకి!

- మే 10 వరకూ జనంలో ఉంటా
- చంద్రబాబుపై గౌరవంతో ప్రజలు నన్నూ ఆదరించారు
- వాళ్లు భువనమ్మ అని పిలిస్తే మా అమ్మ పిలిచినట్టుంది
- 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఇంటర్వ్యూలో నారా భువనేశ్వరి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



'నిజం గెలవాలి' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 203 కుటుంబాలను పరామర్శించానని, మరో కార్యక్రమంతో మే 10 వరకు ప్రజల్లో ఉండాలని భావిస్తున్నానని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మరణించిన కార్యకర్తల కుటుంబాలను 'నిజం గెలవాలి' పేరుతో ఓదార్చి, భరోసా కల్పించామని చెప్పారు. ఈ యాత్రను రాష్ట్ర ప్రజలందరూ ఆదరించారన్నారు. "చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు నేనెలా బాధపడ్డానో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు, ప్రజలు కూడా అదే విధంగా ఆవేదన చెందారు. చంద్రబాబు కోసం ఇంత పరితపించిన ప్రజలకు ఏదో ఒకటి చేయాలని భావిస్తున్నాం. బాధిత కుటుంబాలకు చెందిన పిల్లందరినీ ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తాం. చదివించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేవరకూ ట్రస్టు కమిటీ పర్యవేక్షిస్తుంది.' అని భువనేశ్వరి పేర్కొన్నారు. 'నిజం గెలవాలి' యాత్రను ఇక్కడితో ఆపబోమని, దీనిని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. "చంద్రబాబు జీవితంలో ఎవరినీ కష్టపెట్టరు. ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తారు. గతంలో ఆయనపై పెట్టిన ఏ కేసులు కూడా నిలబడలేదు. ప్రజల్లోకి ఇంత ధైర్యంగా వెళ్తున్నామంటే ఆయనపై ఉన్న నమ్మకమే కారణం. చంద్రబాబు నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు విశ్వసిస్తున్నారు. చంద్రబాబు ఒక మహానాయకుడు. అలాంటి నాయకుడిని నిర్బంధించడం తట్టుకోలేకపోయాను. ఆయన నాయకత్వం మీద ఉన్న గౌరవంతోనే ప్రజలు నన్ను ఆదరించారు. అలాంటి నాయకుడిని కాపాడుకునేందుకు రెండు రాష్ట్రాల్లో జనాలు ముందుకొచ్చారు. ఒక నాయకుడి కోసం ఇంతలా ప్రజలు రోడ్డు మీదకు వచ్చి పోరాడటం చూసి ఆయన భార్యగా గర్వపడుతున్నా. గ్రామాల్లో తిరగడం నాకు కొత్తేమీ కాదు. మా సంస్థ అభివృద్ధికి మారుమూల ప్రాంతాల్లో సైతం పర్యటించాం. చంద్రబాబు ఎప్పుడూ కార్యకర్తల మనిషి. నిజం గెలవాలి కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలు ఎంతో ఆదరించారు. నా తండ్రి మొండితనం నాకూ వచ్చింది. కఠినమైన క్రమశిక్షణతో జీవించడం నా తల్లి నేర్పింది. యాత్రలో అందరూ భువనమ్మా... అని పిలుస్తుంటే నా తల్లి పిలిచినట్టుంది. అందుకే ప్రజలతో అంత మమేకం కాగలిగాను. ఏప్రిల్ 19న చంద్రబాబు తరఫున కుప్పంలో నామినేషన్ వేయనున్నాం.' అని భువనేశ్వరి పేర్కొన్నారు.

చంద్రబాబుపై రాయి దాడి

బారికేడుకు తగిలి కిందపడిన రాయి.. గాజువాక సభలో తప్పిన ప్రమాదం



విశాఖ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు; ఆగంతకుడు విసిరిన రాయి



పవన్‌కు రక్షణగా ప్లాస్టిక్ పలకలు పెట్టిన సిబ్బంది

విశాఖపట్నం/తెనాలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి విశాఖపట్నం నగర పరిధిలోని పాత గాజువాక జంక్షన్‌లో జరిగిన సభలో పాల్గొన్న ఆయనపై గుర్తుతెలియని వ్యక్తి రాయి విసిరాడు. ఆ రాయి చంద్రబాబు ఉన్న వాహనం ముందున్న ఇనుప బారికేడ్‌కు తగిలి కింద పడిపోయింది. అయితే గట్టిగా శబ్దం రావడంతో చంద్రబాబు భద్రతా సిబ్బంది, పోలీసులు అప్రమత్తమయ్యారు. గాజువాక సభలో రాత్రి 7.17 గంటలకు చంద్రబాబు ప్రసంగం ప్రారంభించారు. ఏడెనిమిది నిమిషాలు తరువాత ఆయన మాట్లాడుతున్న వేదికకు తూర్పు వైపు నుంచి ఆగంతకులు రాయి విసిరారు. భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమై పోలీసులను అలర్ట్ చేశారు. దీంతో పోలీసులు రాయి వచ్చిన దిశ వైపు పరుగులు పెడుతూ ఆగంతకులను పట్టుకునే ప్రయత్నం చేశారు. కొందరు సిబ్బంది పక్కనే ఉన్న గోడలు ఎక్కి గాలించినా ఎవరూ చిక్కలేదు. కాగా, శనివారం విజయవాడలో సీఎం జగన్‌పై రాయి దాడి జరిగిన నేపథ్యంలో ఆదివారం గాజువాకలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. చుట్టూ పోలీసులు ఉన్నప్పటికీ ఆగంతకులు రాయి విసరడం అందరినీ ఆందోళనకు గురిచేసింది.

ఈ రాళ్లు ఒక లెక్కా...

రాళ్ల దాడి అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తనపై క్లెమోర్ మైన్స్‌తో దాడి జరిగితేనే భయపడలేదని, రాళ్ల దాడి చేస్తే భయపడతానా?... అంటూ విరుచుకుపడ్డారు.సీఎం జగన్‌పై చీకట్లో గులక రాయితో దాడి చేశారని, తనపై వెలుగులోనే రాయి విసిరారని పేర్కొన్నారు. జగన్ డ్రామాలు ఆడుతున్నాడని ఆరోపించారు. జగన్‌పై ఎవరో గులకరాయి వేస్తే.. తనపై రాళ్లు వేయిస్తారా..? అని ప్రశ్నించారు. జగన్‌పై రాళ్లు వేసి 24 గంటలు అయినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదని, దీనిపై సీఎస్, ఇంటెలిజెన్స్ డీజీపీ ఏం చేస్తున్నారని నిలదీశారు.

వారాహి ర్యాలీపై రాయి?

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి ర్యాలీలో ఆకతాయి రాయి విసిరాడని చితకబాది పోలీసులకు అప్పగించటం కలకలం రేపింది. ఆదివారం రాత్రి గుంటూరు జిల్లా తెనాలిలో వారాహి విజయభేరి కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. వారాహి వాహనం. మార్కెట్ యార్డ్ సమీపంలోకి రాగానే పవన్‌పైకి రాయి విసిరారని, అది ఆయనకు తగలకుండా పక్కకు పోయిందనే వార్త గుప్పుమంది. ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది రక్షణగా ప్లాస్టిక్ పలకలను పట్టుకున్నారు. సమాచారం తెలిసిన జనసైనికులు ఆగ్రహంతో ఊగిపోయారు. రాయి విసిరాడని ఓ యువకుడ్ని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. అయితే పొన్నూరు మండలం నుంచి వచ్చిన ఆ యువకుడు కొందరు యువతులపై పడటం, ఓ యువతి తండ్రి ప్రశ్నించటంతో ఆయన్ను కొట్టేందుకు ఆ యువకుడు చెప్పు తీశాడని, దానిని పవన్‌పైకి విసురుతున్నాడేమోనని అభిమానులు అతడిపై దాడి చేసి, తర్వాత తమకు అప్పగించారని పోలీసులు వివరించారు. ఎవరూ రాయి విసరలేదని తెలిపారు.

'రాయి' దాడిపై దర్యాప్తునకు ఆరు బృందాలు

- సింగ్‌నగర్ పీఎస్‌లో ఎఫ్ఐఆర్
- ఐపీసీ 307 కింద కేసు నమోదు

విజయవాడ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగిన రాయి దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వెలంపల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం నెంబర్ 197తో ఐపీసీ 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మరోవైపు దాడి ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసు కమిషనర్ కాంతిరాణా ఏసీపీ నేతృత్వంలో ఆరు ప్రత్యేక బృందాలను నియమించారు. శాంతిభద్రతలు, సీసీఎస్, సైబర్ క్రైం, టాస్క్‌ఫోర్స్ విభాగాల నుంచి ఈ బృందాలను ఎంపిక చేశారు. మొత్తం 20 మందితో ఈ బృందాలను ఏర్పాటు చేశారు. నార్త్ జోన్ ఏసీపీ దేవరకొండ ప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు సాగుతోంది. నిందితులను గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన అధికారులు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. దాడి జరిగిన సమయంలో కొందరు జగన్ యాత్రకు సంబంధించిన వీడియోలు తీశారు. ఈ వీడియోల్లో రాయి వచ్చి సీఎంకు తగలగానే నుదుటిపై చేయి పెట్టిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ వీడియోలు వైరల్ అయ్యాయి. వీటిని సేకరించిన అధికారులు సైబర్ క్రైం విభాగంలోని ల్యాబ్‌లో విశ్లేషిస్తున్నారు. ఘటన జరిగిన ప్రదేశంలో ఉన్న సెల్‌టవర్ ఆధారంగా కాల్ డేటా రికార్డ్(సీడీఆర్) తీసుకున్నారు. ఘటన మాకినేని బసవపున్నయ్య స్టేడియంను ఆనుకుని ఉన్న వివేకానంద స్కూల్ వద్ద జరిగింది. సీఎం యాత్ర భద్రత రీత్యా విద్యుత్ శాఖ అధికారులు ఈ ప్రాంతంలో సరఫరాను నిలుపుదల చేశారు. దీంతో ఫుటేజీ సేకరణ ఇబ్బందిగా మారింది. సీఎం జగన్‌పై జరిగిన రాయి దాడి కేసులో పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని పోలీసు అధికారులు ధ్రువీకరించలేదు.ఓ రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకుని, అతనిచ్చిన సమాచారంతో నలుగురిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది.



పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

హామీల అమలు కోసం ముఖ్యమంత్రికి పోస్టుకార్డు ఉద్యమం

- ప్రారంభించిన మాజీ మంత్రి హరీశ్‌రావు
- 16న సుల్తాన్‌పూర్‌లో కేసీఆర్ సభ

హైదరాబాద్, జహీరాబాద్/పుల్‌కల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): : రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో ముఖ్యమంత్రికి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అబద్ధపు మాటల మీద ఏర్పడిన ప్రభుత్వం ఎక్కువ రోజులు మనుగడ కష్టమేనన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు తాము ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు. కాగా, సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ శివారు సింగూరు చౌరస్తా వద్ద ఈ నెల 15న మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించనున్నారు. శనివారం సభా స్థలాన్ని హరీశ్ రావు పరిశీలించారు. ఆగా, ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉందని, ఆర్భాటపు ప్రకటనలతో వాస్తవాలు మరుగున పడేశారని ఆరోపించారు. మాటల్లో వికసిత్ భారత్ - చేతల్లో విభజిత్ భారత్ అన్న విధానాన్ని బీజేపీ మరోసారి నిరూపించిందని ఓ ప్రకటనలో విమర్శించారు. గంభీరమైన మాటలు జోడించి పేజీలు నింపడం తప్ప, సమాజం కోరుకుంటున్న దానిపై బీజేపీ తన విధానాన్ని ప్రకటించలేదన్నారు.

సీఎం సమర్థుడే.. కాంగ్రెస్సే అసమర్థ పార్టీ

- రేవంత్ బీజేపీలోకి వస్తే స్నేహితుడిగా స్వాగతిస్తా: అర్వింద్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమర్థుడే కానీ కాంగ్రెస్సే అసమర్థ పార్టీ. ఆయన నాకు మంచి మిత్రుడు. కష్టపడ్డరు. ఈ స్థాయికి వచ్చిండ్రు. కాంగ్రెస్‌కు ఇవే చివరి ఎన్నికలు. రేవంత్ కాంగ్రెస్‌లో ఉంటే ఇప్పుడున్న సమర్థత కూడా కోల్పోతారు. బీజేపీలోకి రేవంత్ వస్తే స్నేహితుడిగా స్వాగతిస్తా. ఆయన చేరికను సిఫారసు చేస్తా" అని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అర్వింద్ మీడియాతో మాట్లాడారు. రేవంత్ ఇంకా కనీసం 15 సంవత్సరాలు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటారని, కానీ కాంగ్రెస్ పార్టీ 15 ఏళ్లు ఉండేలా లేదని ఆ పార్టీకి భవిష్యత్తే కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. సీఎం బీజేపీలో చేరితే స్వాగతిస్తానని, అయితే ఆయన చేరికపై నిర్ణయం తీసుకోవాల్సింది పార్టీ జాతీయ నాయకత్వమని చెప్పారు. రేవంత్ పాల్గొన్న ఆప్‌కీ అదాలత్ కార్యక్రమం తనకు కామెడీ షోలా కనిపించిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొదటి నుంచీ శ్రీరాముడికి మొక్కితే ఆయనకు ఈ గతి పట్టేది కాదని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేసిన రైతుబంధు నిధులన్నీ ఖమ్మం, నల్గొండకు చెందిన మంత్రులు తీసుకెళ్లారని అర్వింద్ ఆరోపించారు.

వరంగల్ కాంగ్రెస్‌లో వర్గపోరు

- సన్నాహక భేటీలో కొండా వర్గీయుల హల్‌చల్

పరకాల, ఏప్రిల్ 14: వరంగల్ కాంగ్రెస్‌లో వర్గపోరు బయటపడింది. ఆదివారం హనుమకొండ జిల్లా పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్లమెంట్ సన్నాహక సమావేశంలో కొండా మురళి వర్గీయులు హల్‌చల్ చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. కొండా వర్గీయులు గజ్జి విష్ణుతో పాటు మరికొందరు కార్యకర్తలు సమావేశ ప్రాంగణంలో 'జిల్లా టైగర్ కొండా మురళి' అంటూ నినాదాలు చేశారు. ఆపై కుర్చీలను తోసుకుంటూ వేదిక వద్దకు దూసుకొచ్చారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, యశస్వినిరెడ్డి.. ఇది సబబు కాదని, ప్రశాంతంగా ఉండాలని చెప్పినప్పటికీ ఎవరూ వినిపించుకోలేదు. తోపులాట జరుగుతుండడంతో పోలీసులు జోక్యం చేసుకొని విష్ణుతోపాటు ఆయన అనుచరులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలోనే జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి విష్ణును సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కొండా మురళి సమక్షంలోనే సన్నాహక సమావేశం నిర్వహించాలని.. ఆయన రాకుండానే సమావేశం ప్రారంభించడంతోనే కొండా వర్గీయులు ఆందోళనకు దిగినట్లు సమాచారం. విష్ణును పోలీసులు ఏసీపీ కార్యాలయం వద్దకు తీసుకొచ్చి విడిచిపెట్టారు.

గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకులాల్లో సీట్లు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలల్లో సీట్ల కేటాయింపు, వారి కుటుంబాలకు ఆరోగ్యశ్రీ వర్తింపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించడానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను జాతీయ స్థాయిలో లేవనెత్తేందుకు ఎంపీగా తనకు ఓ అవకాశం ఇవ్వాలని కోరారు. ఆదివారం దుబాయ్‌లో జరిగిన తెలంగాణ ప్రవాసుల ఆత్మీయ సమావేశంలో జీవన్‌రెడ్డి ఇక్కడి నుంచి వర్చువల్‌గా మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన ప్రవాస కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని గుర్తుచేశారు. దుబాయ్‌లోనే ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ప్రతినిధులు కట్కం రవి, కొరెపు మల్లేశ్ పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్ఎస్‌లోకి రాజయ్య



మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14: స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య ఎట్టకేలకు సొంతగూటికి చేరుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో ఆదివారం సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. రాజయ్య గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రానందుకు నిరసనగా ఫిబ్రవరి 3న బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వారం రోజుల్లో కాంగ్రెస్‌లో చేరతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర అనుచరులు రాజయ్యను కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దంటూ ఆందోళనలు చేపట్టారు. నియోజకవర్గ మహిళా నాయకులు ఏకంగా గాంధీ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ రాజయ్య సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే తదితరులను కలిసి పార్టీలో చేరిక అంశమై చర్చించారు. అయినా రాజయ్యకు కాంగ్రెస్ నుంచి ఆహ్వానం రాలేదు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్చి 13న వరంగల్ పార్లమెంట్ టికెట్‌ను కడియం కావ్యకు ఇస్తున్నట్లు ప్రకటించారు. 28న టికెట్‌ను నిరాకరిస్తూ కేసీఆర్‌కు కావ్య లేఖ రాశారు. 29న కాంగ్రెస్ నేతలు కడియంను పార్టీలోకి ఆహ్వానించడం, 31న కడియం శ్రీహరి, కావ్య రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడం, ఏప్రిల్ 1న వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా కావ్య పేరును ప్రకటించడం వరుసగా జరిగిపోయాయి. అప్పటి నుంచి రాజయ్య బీఆర్ఎస్ తనకు వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇస్తే తిరిగి పార్టీలో చేరడానికి సిద్ధమయ్యారు. ఈ నెల 12న ఎంపీ టికెట్ రాజయ్యకు ప్రకటిస్తారనే వార్తలు రావడంతో ఆయన ఎర్రవెల్లికి వెళ్లారు. కానీ చివరికి కేసీఆర్ హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ పేరును ప్రకటించారు. దాంతో రాజయ్య కేసీఆర్‌ను కలవకుండానే వెనుదిరిగారు. చివరకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజయ్య బీఆర్ఎస్‌లో చేరారు.

పదేళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- ఖర్గే, రాహుల్ ఎవరొచ్చినా సరే
- 6గ్యారెంటీలపై రేవంత్ స్పందించాలి
- హామీలు ఏమయ్యాయి?: కిషన్‌రెడ్డి
- నేడు పార్టీ ఆఫీసులో రైతు దీక్ష

హైదరాబాద్/రెజిమెంటల్ బజార్/బర్కత్‌పుర, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై కాంగ్రెస్‌తో చర్చకు సిద్ధమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ సహా ఎవరు చర్చకు వచ్చినా సిద్ధమని సవాల్ చేశారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అవినీతి, కుటుంబ రాజకీయాలతో మాత్రం తాము పోటీ పడలేమని ఎద్దేవా చేశారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరగాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. ఐదేళ్ల తర్వాత జరిగే పార్లమెంటు ఎన్నికలతో పాటే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదన ఉందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ సాధించిన విజయాలపై రూపొందించిన వికసిత్ భారత్ డిజిటల్ క్యాలెండర్‌ను కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ విడుదల చేసిన సంకల్ప పత్రను విమర్శించే ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలపై స్పందించాలని డిమాండ్ చేశారు.



సికింద్రాబాద్ గురుద్వారాలో పూజలు చేస్తున్న కిషన్‌రెడ్డి

మహిళలకు నెలకు రూ.2,500.. వృద్ధులకు రూ.4వేల పెన్షన్.. దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ ఎప్పుడిస్తారని నిలదీశారు. రూ.5లక్షల విద్యా భరోసా కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రైతు దీక్ష చేస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. కాగా, బైసాఖీ ఉత్సవాల సందర్భంగా ఆదివారం సికిందరాబాద్‌లోని గురుద్వారాలో కిషన్‌రెడ్డి పూజలు చేశారు. తాను ఏటా ఈ వేడుకలకు వస్తుంటానని.. ఎన్నికల దృష్టితో రాలేదని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా 'ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని కిషన్‌రెడ్డి సోమవారం ఉదయం హిమాయత్‌నగర్‌లో ప్రారంభిస్తారు.

19న కిషన్‌రెడ్డి నామినేషన్

సికిందరాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న కిషన్‌రెడ్డి 19న నామినేషన్ దాఖలు చేయనున్నారు. శుక్రవారం ఉదయం తన సతీమణి కావ్యతో కలిసి అంబర్‌పేట మహంకాళి, శంకరమఠం, బషీర్‌బాగ్ కనకదుర్గ ఆలయం, సికిందరాబాద్ మహంకాళి ఆలయాల్లో కిషన్‌రెడ్డి పూజలు చేస్తారు. అనంతరం ర్యాలీగా ప్యాట్నీ సెంటర్‌లోని మహబూబియా కళాశాల వరకు వెళతారు. అక్కడి నుంచి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తారు.

అవినీతి నిర్మూలనకు మోదీ గ్యారెంటీ: సంజయ్

ప్రధానిగా మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అవినీతి నిర్మూలనపై కేంద్రం కార్యాచరణ ఉండబోతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ వెల్లడించారు. అవినీతి నిర్మూలనకు నిరంతర నిఘా, పటిష్ఠమైన చర్యలకు ప్రధాని మోదీ గ్యారెంటీ అని ప్రకటించారు. పేదల అభ్యున్నతి లక్ష్యంగా పార్టీ నాయకత్వం మ్యానిఫెస్టో ప్రకటించిందని తెలిపారు.


కరీంనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మతం పేరుతో కాదు, అభివృద్ధిపై ఓట్లడగాలి: పొన్నం

కరీంనగర్ అర్బన్/హుస్నాబాద్, ఏప్రిల్ 14: అక్షింతలు, రాముడు, మతం పేరుతో కాకుండా పదేళ్లలో చేసిన అభివృద్ధిపై బీజేపీ ఓట్లు అడగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయకుండా తెలంగాణకు అన్యాయం చేసిందంటూ కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారంటీలపై ప్రశ్నిస్తున్న బండి సంజయ్, కిషన్‌రెడ్డి, కేసీఆర్.. ముందుగా గడిచిన 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అయినా గ్యారంటీలు అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ వాళ్లను తెలివి లేని వాళ్లుగా వ్యాఖ్యానించిన కేటీఆర్ వెధవతో సమానమంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.. చేసిన అవినీతి కారణంగానే బండి సంజయ్‌ని బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తొలగించారనే విమర్శలున్నాయన్నారు. తన అంత హిందువులేడని చెబుతున్న సంజయ్ నిద్రలేస్తే మాంసం, మందు లేనిది ఉండలేరని ఆరోపించారు.

బీజేపీతో బీఆర్‌ఎస్ లోపాయికారీ ఒప్పందం

- కవితను కాపాడుకునేందుకు బీజేపీకి మద్దతు: కొండా సురేఖ

శంషాబాద్/శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీతో బీఆర్‌ఎస్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుందని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎలాగూ గెలిచే పరిస్థితిలో లేరని, అందుకే కాంగ్రెస్‌ను గెలవకుండా చేసేందుకు బీజేపీకి మద్దతిస్తూ వారి గ్రాఫ్‌ను పెంచుతున్నారని తెలిపారు. ఇందుకు వరంగల్ సహా పలు ప్రాంతాల్లో ఆధారాలున్నాయని చెప్పారు. ఆదివారం రాత్రి రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని నోవాటెల్ హోటల్ వద్ద మంత్రి సురేఖ మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇచ్చి గెలిపించాలని, ఆ తరువాత వారి ఎమ్మెల్యేలను బీజేపీలోకి పంపించి తమను ఇబ్బంది పెట్టాలనే యోచనలో బీఆర్‌ఎస్ ఉందని అన్నారు. కేసీఆర్ కూతురు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేతుల్లో చిక్కుకున్నందున.. రేపు మళ్లీ ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఆమెను విడిపించుకోవచ్చని బీఆర్‌ఎస్ అధినాయకత్వం భావిస్తోందన్నారు. తాము 15 ఎంపీ స్థానాలను గెలవాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీలను అడ్డుకునేందుకు ఆ రెండు పార్టీల నుంచి ఎవరు వచ్చినా చేర్చుకోవాలని హైకమాండ్ సూచించిందని అన్నారు. స్థానికంగా కాంగ్రెస్ నాయకులెవరైనా అభ్యంతరం చెప్పినా.. వారిని ఒప్పించి పార్టీలో చేర్చుకోవాలని చెప్పిందన్నారు.

గురుకుల డిగ్రీ ప్రవేశాల దరఖాస్తుకు నేడే ఆఖరు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం చేసుకునే దరఖాస్తులకు సోమవారమే(ఏప్రిల్ 15) చివరి తేదీ అని ఆయా గురుకుల సంస్థలు ఆదివారం వెల్లడించాయి. డిగ్రీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 28న ప్రవేశపరీక్షను నిర్వహించనున్నామని, ఇంటర్ పూర్తయిన విద్యార్థులు ఈ డిగ్రీ ప్రవేశాలకు అర్హులని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి. గురుకులాల పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలల్లో రెగ్యులర్ కోర్సులతో పాటు ఒకేషనల్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

మహాలక్ష్మి ఎల్‌పీజీ పథకంలో 39.33 లక్షల మంది లబ్ధిదారులు!

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మహాలక్ష్మి ఎల్‌పీజీ పథకంలో ఇప్పటి వరకు 39,33,615 మంది లబ్ధిదారులను నమోదు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 18,86,045 మంది లబ్ధిదారులు ఎల్‌పీజీ సిలిండర్లు బుక్ చేసినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 21,29,460 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. వీటిపై రూ. 59.97 కోట్ల ఆర్థిక భారాన్ని సబ్సిడీగా రాష్ట్ర ప్రభుత్వం భరించినట్లు కమిషనర్ చౌహాన్ తెలిపారు.

వడ్డీవ్యాపారం పేరిట ఇబ్బంది పెడితే చర్యలు

- మల్టీజోన్ రేంజ్-1 ఐజీ రంగనాథ్

వడ్డీ వ్యాపారాల పేరిట ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు తప్పవని మల్టీజోన్ రేంజ్- 1 ఐజీ రంగనాథ్ హెచ్చరించారు. అనుమతులు లేని కొన్ని ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారులు అమాయకపు ప్రజలకు సహాయం చేస్తామంటూ వారి ఇట్లు, ప్లాటు, వ్యవసాయ భూములు.. వంటి వాటి దస్తావేజులు తీసుకొని అప్పులు ఇచ్చి, ఆ తర్వాత అధిక వడ్డీ లెక్కలు చూపుతూ అప్పు తీర్చలేని పరిస్థితి కల్పించి వారి ఆస్తులను జప్తు చేసుకుంటున్నారని ఆయన వివరించారు. తమ పరిధిలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన సదరు వ్యక్తులు, ఫైనాన్స్ సంస్థల కేంద్రాలపై స్పెషల్ బ్రాంచ్ విభాగం పోలీసులు తనిఖీలు జరిపారని చెప్పారు. పెద్దమొత్తంలో నగదు, బంగారం, పట్టా పాస్‌బుక్కులు, విలువైన పత్రాలు, చెక్కులు, ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

నేటి నుంచి పెరగనున్న ఎండలు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన చేసింది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయని, కొన్ని జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేణా 2 నుంచి 3 డిగ్రీ సెంటిగ్రేడ్ మేర పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో అత్యధికంగా 42.7డిగ్రీలుగా నమోదైనట్లు వెల్లడించింది. ఇప్పటికే ఆరు జిల్లాలు మినహా అన్నింటికీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు ఈ నెల 19, 20 తేదీల్లో కొన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది.


సినిమా జర్నలిస్ట్ విభాగంలో ఉగాది పురస్కారం అందుకుంటున్న ఆంధ్రజ్యోతి సీనియర్ సినిమా జర్నలిస్ట్ వినాయకరావు

ఘనంగా ఉగాది పురస్కారాల ప్రదానం

ఆంధ్రజ్యోతి సీనియర్ సినిమా జర్నలిస్టు వినాయకరావుకు ప్రదానం

బేగంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో నిష్ణాతులైన సుమారు 40 మంది కళాకారులు, విద్యావేత్తలు, వైద్యరంగ నిపుణులు, సినీ ప్రముఖులు తదితరులకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానం ఘనంగా జరిగింది. బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పెరుగు శ్రీసుధ హాజరై ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీసుధ మాట్లాడుతూ బాగా పని చేసే వారిని ఇంకా బాగా పని చేసేలా ఈ అవార్డులు ప్రేరేపిస్తాయన్నారు. ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ పొన్నూరు మదన్‌మోహన్, పారిశ్రామికవేత్త గుమ్మి రాంరెడ్డి హాజరయ్యారు. అవార్డులు అందుకున్న వారిలో సినిమా జర్నలిస్ట్ విభాగంలో ఆంధ్రజ్యోతి సీనియర్ సినిమా జర్నలిస్ట్ వినాయకరావు, సామాజిక సేవలో బి.విజయ్‌కుమార్, లయన్ బీవీఎస్ రావు, డాక్టర్ ఎన్ఎన్‌వీ సుబ్బారావు, కోన శ్రీనివాసరావు, ఎం.ఎస్ విజయకుమార్, భవాని, వినోద్, వ్యాపారవేత్త, నిశ్చయం గ్రూప్ సీఈవో విష్ణుప్రియ తదితరులు ఉన్నారు.

వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

భవిష్యత్తులో మాదిగ నేతలకు నామినేటెడ్ పోస్టులు: సీఎం రేవంత్

- తనను కలిసిన నాయకులకు ముఖ్యమంత్రి హామీ
- బీజేపీ మ్యానిఫెస్టో.. చెల్లని పోస్ట్ డేటెడ్ చెక్ అని వ్యాఖ్య
- వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు తిరస్కరిస్తారని స్పష్టీకరణ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్తులో మాదిగ సామాజిక వర్గ నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. సీఎంను కలిసిన సందర్భంలో ఈ మేరకు హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గ నేతలు ఉట్ల వరప్రసాద్, పిడమర్తి రవి, గజ్జల కాంతం వెల్లడించారు. కాగా, బీజేపీ మ్యానిఫెస్టో చెల్లని పోస్ట్ డేటెడ్ చెక్‌లా ఉందని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. షైనింగ్ ఇండియా పేరుతో 2004లో ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసిన బీజేపీ.. ఈ ఎన్నికలకూ వికసిత్ భారత్ పేరుతో పాత ప్రయోగాన్ని మళ్లీ చేసిందని వ్యాఖ్యానించారు. అప్పుడు రెండు దఫాలు అధికారంలో ఉన్న బీజేపీని, షైనింగ్ ఇండియా మ్యానిఫెస్టోను సోనియా నాయకత్వంలో ప్రజలు తిరస్కరించారని గుర్తు చేశారు. అప్పటిలాగే వచ్చే ఎన్నికల్లో బీజేపీని ప్రజలు తిరస్కరిస్తారని జోస్యం చెప్పారు. రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ.. దేశ ప్రజల కష్టాలకు చరమగీతం పాడనుందని ఆదివారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.



సీఎంను కలిసిన విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్

అన్ని వర్గాల ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు విద్యుత్తు ఉద్యోగులు ముందుండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోషియేషన్ నాయకులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో విద్యుత్తు రంగ సంస్థల అభివృద్ధితోపాటు భవిష్యత్తులో ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా అండగా నిలుస్తామని అసోషియేషన్ నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి అంజయ్య, పరమేశ్, తదితరులు ఉన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

కూడా పాల్గొన్న ఈ సమావేశంలో.. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీ వేణుగోపాల్ దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసుకునేందుకు చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని, బీఆర్‌ఎస్ నిర్వీర్యమైన నేపథ్యంలో.. రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటున్న ఆ పార్టీ నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని అన్నారు. లేదంటే వారు ప్రత్యామ్నాయంగా బీజేపీ వంటి పార్టీలను చూసుకుంటారని విశ్లేషించారు. కాంగ్రెస్‌లో చేరతామని ఎవరు వచ్చినా అభ్యంతరాలు పెట్టకుండా చేర్చుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గతంలో కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్లినవారు తిరిగి వస్తే అభ్యంతరం చెప్పవద్దని, ఘర్ వాపసీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు.

ఉత్తరాదిన బీజేపీ బలహీనపడింది..

ఉత్తరాదిన బీజేపీ బలహీన పడిందని కేసీ వేణుగోపాల్ అన్నారు. దక్షిణాదిలో ఆ పార్టీని పూర్తిస్థాయిలో కట్టడి చేస్తే.. ఇండియా కూటమి స్పష్టమైన ఆధిక్యంతో కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. విభజన హామీలు అమలు చేయకపోవడం, రాష్ట్ర విభజనపై ప్రధాని మోదీ వ్యాఖ్యలు తదితర అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి.. ఆ పార్టీకి తెలంగాణ పట్ల వ్యతిరేకత ఉందని వివరించాలన్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో బీసీ సదస్సులు నిర్వహించాలని, బీసీలను కాంగ్రెస్ పార్టీ ఎలా ఆదుకుంటున్నది వివరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో సర్వే నివేదికలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. వివిధ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిని వివరించారు. రాష్ట్రంలో 15కు తగ్గకుండా ఎంపీ సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవాలని టార్గెట్ విధించారు. అభ్యర్థులు, మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు అంతా ఇకపై నియోజకవర్గాలకే పరిమితమై గట్టిగా పని చేయాలన్నారు. ఎవరు పని చేస్తున్నారో, ఎవరు పని చేయడంలేదన్న ప్రోగ్రెస్ రిపోర్టు తమ వద్ద ఉందని చెప్పారు. ప్రచారానికి రాహుల్, ప్రియాంక, ఖర్గే తదితర ఏఐసీసీ అగ్రనేతలు వస్తారని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రచార ప్రణాళికలను ఈ నెల 18 కల్లా ఏఐసీసీకి పంపించాలన్నారు. సుమారు మూడు గంటలపాటు జరిగిన సమావేశంలో.. పార్టీ అభ్యర్థులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మంత్రులు అందరితోనూ మాట్లాడించి అభిప్రాయాలు తీసుకున్నారు. నియోజకవర్గంలో వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన రావడానికి ముందు సీఎం రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క, దీపా దాస్‌మున్షీ, అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో వారి పనితీరును విశ్లేషించారు.

మూడు సీట్లపై త్వరలోనే నిర్ణయం

ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తారంటూ సమావేశంలో ఒకరిద్దరు నేతలు ప్రశ్నించగా.. త్వరలోనే నిర్ణయం ఉంటుందని కేసీ వేణుగోపాల్ చెప్పారు. సమావేశంలో అజెండాకు పరిమితమవుదామన్నారు.


నారాయణపేటలో జన జాతర సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నేడు నారాయణపేటలో జనజాతర సభ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణపేటలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జనజాతర సభ జరగనుంది. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కానున్న సభకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. హెలికాప్టర్ ద్వారా నారాయణపేట చేరుకోనున్న సీఎం.. రోడ్డు మార్గంలో తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. సొంత జిల్లా కావడం, కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పరిధిలో ఉండడంతో.. ఇక్కడ గెలుపును ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కోస్గిలో నిర్వహించిన సభలోనే మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డి పేరును స్వయంగా రేవంతే ప్రకటించిన విషయం తెలిసిందే. గత నెల 6న మహబూబ్‌నగర్‌లో భారీ సభ నిర్వహించగా.. ఇప్పుడు నారాయణపేటలో జనజాతర సభ నిర్వహించనున్నారు. నారాయణపేట జిల్లా పరిధిలోని రెండు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ అభ్యర్థికి మెజారిటీ దక్కకుండా చేసేందుకు ఈ సభను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. వంశీచంద్ గెలుపు కోసం మరో సభ నిర్వహించడంతోపాటు నామినేషన్ దాఖలుకు సీఎం హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. తన పర్యటన ద్వారా పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపడంతోపాటు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేయనున్నారు. అలాగే, బీజేపీకి కొంత బలం ఉంటుందని భావిస్తున్న నియోజకవర్గాల్లో ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా నేతలను చేర్చుకుంటున్నారు. ఇప్పటికే మక్తల్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మదిరెడ్డి జలంధర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా, మరి కొందరు నేతలు కూడా సోమవారం నిర్వహించనున్న సభలో పార్టీలో చేరే అవకాశాలున్నాయి.

అక్రమాల కోసమే యాదాద్రి పవర్ ప్రాజెక్టు

- గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో పెరిగిన వ్యయం
- బీఆర్‌ఎస్ పాలనలోని అక్రమాలన్నీ బయటకు తీస్తాం
- రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనాలోచితంగా, దురుద్దేశంతో యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టును మొదలు పెట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెక్టు పనులను ఇష్టానుసారంగా నామినేషన్ పద్ధతిలో ఇచ్చిందని ఆరోపించారు. వాస్తవానికి బొగ్గు లభించే ప్రాంతంలోనే పవర్ ప్రాజెక్టులు పెట్టాల్సి ఉండగా.. అవినీతి, అక్రమాల కోసమే యాదాద్రిలో థర్మల్ పవర్ ప్రాజెక్టును మొదలు పెట్టారని చెప్పారు. వారి నిర్వాకం వల్ల ప్రాజెక్టు వ్యయం రూ.25 వేల కోట్ల నుంచి రూ.35 వేల కోట్లకు పెరిగి ప్రభుత్వానికి గుదిబండగా మారిందని తెలిపారు. 2015లో మొదలు పెట్టిన యాదాద్రి పవర్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు కూడా పూర్తిస్థాయిలో తీసుకురాలేదని, అనుమతుల కోసం తప్పుడు సమాచారం ఇవ్వడంతో 2022 సెప్టెంబరు 30న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆ అనుమతులను సస్పెండ్ చేసిందని తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోకుండా వదిలేసిందని వివరించారు. రాబోయే 25 ఏళ్లకు యూనిట్ రూ.5.59లకు ఇస్తామని సోలార్ విద్యుత్ కంపెనీలు ముందుకు వచ్చినా పట్టించుకోకుండా ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తికి రూ.9 ఖర్చయ్యేలా గత ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని ఆరోపించారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలన్నీ వెలికితీస్తామని, వారు చేసిన అక్రమాలే వారికి శూలాలై గుచ్చుకోవడం ఖాయమని భట్టి స్పష్టం చేశారు.

మీరు బతకండి.. నన్ను బతకనీయండి

- అభిమానులకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విజ్ఞప్తి
- సంగారెడ్డిలో తాను గెలవలేదని.. చెప్పుల్లేకుండా తిరుగుతున్న అభిమానిని చూసి భావోద్వేగం

సంగారెడ్డి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): "మీరు బతకండి.. నన్ను బతకనీయండి" అని తన అభిమానులకు మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ సమీపంలోని ఫంక్షన్ హాలులో ఆదివారం మెదక్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జగ్గారెడ్డి అభిమాని, సంగారెడ్డి శివాజీనగర్‌కు చెందిన రాజ్‌కుమార్ చెప్పులు లేకుండా హాజరయ్యారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు సంగారెడ్డిలో జగ్గారెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షించిన రాజ్‌కుమార్.. అప్పటి నుంచి చెప్పులు లేకుండా తిరుగుతున్నారు. ఆ ఎన్నికల్లో జగ్గారెడ్డి ఓడిపోయినా.. మళ్లీ వచ్చే ఎన్నికల్లోనైనా గెలవాలని కోరుకుంటూ.. అలాగే చెప్పులు ధరించకుండా తన దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకుని జగ్గారెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. 'వచ్చే ఎన్నికల్లో గెలవాలనుకునే నేనే చెప్పులతో తిరుగుతున్నా.. మొగుడు విజయం సాధించాలని కోరుకునే నా భార్య కూడా చెప్పులు వేసుకునే తిరుగుతోంది. అలాంటిది నా గెలుపు కోసం చెప్పులు లేకుండా తిరగడం నీకెందుకు?' అంటూ అతడిని ప్రశ్నించారు. "నాలుగేళ్ల తర్వాత గెలుపు, ఓటమి సంగతి వదిలేసెయ్. ముందు నీ కాళ్లు చెడిపోకుండా చూసుకో. ముల్లు కానీ, మొల కానీ గుచ్చుకుని ఏమన్నా అయితే.. ఎవరొస్తారు. నేను వస్తే ఆస్పత్రికి వచ్చి డబ్బులు ఇచ్చి వెళ్తానే గానీ..ఆ బాధ, ఇబ్బందులు భరించేది నువ్వే కదా. నాపై అభిమానం, ప్రేమ ఉంటే మీరు బతకండి... నన్ను బతకనీయండి. అంతేగానీ మీరు చనిపోతే నేను బతికి ఏం చేస్తా" అని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చెప్పులు వేసుకుని రావాలని రాజ్‌కుమార్‌కు సూచిస్తూ.. సమావేశం నుంచి బయటకు పంపించారు.


సంగారెడ్డి జిల్లా మల్కాపూర్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

'స్థానికత'ను తేల్చరా?

మరో రెండున్నర నెలల్లో వైద్యవిద్య ప్రవేశాలు

- మే నెల 5న నీట్, జూన్ 14వ తేదీన ఫలితాలు
- ఇప్పటిదాకా విభజన చట్టం మేరకు ఉమ్మడి ప్రవేశాలు
- మరో 45 రోజుల్లో ముగియనున్న విభజన చట్టం
- స్థానికతపై తేల్చాలని ఇప్పటికే హెల్త్ వర్సిటీ లేఖ
- ఈ విషయమ్మీద కసరత్తే మొదలు పెట్టని సర్కారు
- తాత్సారం చేస్తే 400-500 ఎంబీబీఎస్ సీట్లకు ముప్పు
- ఆందోళనలో వైద్య విద్య అభ్యర్థులు, తల్లిదండ్రులు



హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యకు సంబంధించి ప్రవేశాలకు సమయం సమీపిస్తున్నా స్థానికత అంశం తేలకపోవడం రాష్ట్రంలోని వైద్యవిద్య అభ్యర్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మరో 20 రోజుల్లో వైద్య విద్య ప్రవేశాలకై నీట్ (జాతీయ ప్రవేశ, అర్హత పరీక్ష) జరగనుంది. జూన్ 14న ఫలితాలు రానున్నాయి. తర్వాత పదిహేను రోజుల్లో వైద్యవిద్యప్రవేశాల కౌన్సిలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. ఈలోగా స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాల్సివుంది. లేదంటే ఎంబీబీఎస్ సీట్లను భారీస్థాయిలో తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి ఉంటుంది. ఉన్నత విద్యా సంస్థల కోసం పదేళ్లపాటు ఉమ్మడి ప్రవేశాలకు విభజనచట్టం అవకాశం కల్పించింది. మరో 45 రోజుల్లో ఆ చట్ట కాలపరిమితి ముగియనుంది. ఇక నుంచి ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు స్థానికులకే ఇవ్వాల్సివుంటుంది. అయితే ఆ స్థానికతను ఎలా నిర్ణయించాలన్న దానిపై కసరత్తును సర్కారు ఇంకా మొదలుపెట్టనేలేదు. లోక్‌సభ ఎన్నికల హడావుడిలో పడి సర్కారు ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఈ ప్రక్రియ అంతా విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే జరగాలి. ఇప్పటి దాకా విభజన చట్టం ప్రకారం... వరుసగా ఏడు నుంచి ఇంటర్ వరకు ఎక్కడ చదివితే... అదే విద్యార్థుల స్థానికతగా గుర్తించి ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు ఇచ్చారు. ముఖ్యంగా వైద్యవిద్యలో యూజీ, పీజీ ప్రవేశాల కోసం దాన్నే ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ప్రస్తుతం విభజన చట్ట కాలపరిమితి ఈ ఏడాది జూన్ 2తో ముగియనుంది. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 8,490 ఎంబీబీఎస్, 3,112 పీజీ సీట్లున్నాయి. ఇవన్నీ కూడా ఉన్నత విద్య సంస్థల పరిధిలోనివే. విభజన చట్టం ప్రకారం ఏడు నుంచి ఇంటర్ వరకు తెలంగాణలో చదివిన వారిని స్థానికతగా చూపి వైద్యవిద్యలో ప్రవేశాలు కల్పించారు. ఇక నుంచి అలా ఇవ్వడానికి వీలు కాదు. ఒకవేళ స్థానికతపై సర్కారు నిర్ణయం తీసుకోకుండా వైద్యవిద్య ప్రవేశాలు చేపడితే రాష్ట్ర విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. మనవాళ్లు ఏకంగా 400-500 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యవిద్య నిపుణులు చెబుతున్నారు. అందుకే అడ్మిషన్స్ మొదలకాకముందే దీనిపై క్లారిటీ ఇవ్వాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కాగా స్థానికత అంశంపై ఓ నిర్ణయం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి హెల్త్ యూనివర్సిటీ ఇప్పటికే లేఖ రాసింది.

అయా రాష్ట్రాల్లో స్థానికత ఇలా

వైద్య విద్యలో ప్రవేశాలను స్థానికతను ఎలా నిర్ణయించాలి? అనే విషయంలో పలు రాష్ట్రాలు వేర్వేరు నిబంధనలు నిర్దేశించుకున్నాయి. కేరళలో.. విద్యార్థి ఆ రాష్ట్రంలోనే జన్మించడంతో పాటు, వారి తల్లిదండ్రులు కూడా అక్కడే పుట్టి ఉంటేనే వారిని స్థానికులుగా (కేరలైట్స్)గా పరిగణిస్తారు. ఈమేరకు జనన ధ్రువీకరణ పత్రాలను స్థానిక విలేజ్ ఆఫీసర్, తహసీల్దార్ నుంచి తీసుకోవాల్సివుంటుంది. దాని ఆధారంగానే విద్యా ప్రవేశాల్లో అవకాశం కల్పిస్తున్నారు. తమిళనాడులోనైతే ముందుగా స్థానికుడై ఉన్నట్లు రెవెన్యూ విభాగం ఇచ్చే సర్టిఫికెట్ ఉండాలి. ఆరు నుంచి ఇంటర్ వరకు ఆ రాష్ట్రంలో చదివితే లోకల్‌గా పరిగణిస్తారు. ఒకవేళ తమిళనాడు వాసి అయినప్పటికీ... ఆరు నుంచి ఇంటర్ వరకు ఇతర రాష్ట్రంలో చదివితే... అప్పుడు తమిళనాడు రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఇచ్చే నేటివ్ సర్టిఫికేట్‌ను పరిగణలోకి తీసుకుని స్థానికతను కల్పిస్తున్నారు.

మాజీ సీఎండీలకు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కమిషన్ నోటీసులు అందుకున్న వారిలో.. ఇంధన శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్ రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ జి.రఘుమారెడ్డి, టీఎస్ఎన్పీడీసీఎల్ మాజీ సీఎండీలు కె.వెంకటనారాయణ, ఎ.గోపాల్ రావుతో పాటు ఆయా విద్యుత్ సంస్థల మాజీ, ప్రస్తుత డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు ఉన్నట్టు సమాచారం. అలాగే. నామినేషన్లపై యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణం పనులను దక్కించుకున్న బీహెచ్ఈఎల్ సంస్థ ప్రస్తుత, మాజీ ఉన్నతాధికారులతో పాటు ఛత్తీస్‌గఢ్ స్టేట్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ మాజీ, ప్రస్తుత ఉన్నతాధికారులకు సైతం కమిషన్ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. ఆదివారం సెలవు కావడంతో సోమవారం నుంచి వీరికి నోటీసులు అందనున్నాయి. అలాగే.. ఈ వ్యవహారాల్లో భాగస్వాములైన వ్యక్తులు, సంస్థల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు సోమవారం బహిరంగ ప్రకటనను సైతం కమిషన్ జారీ చేయనుంది. వారంతా స్వచ్ఛందంగా తమ వద్ద ఉన్న సమాచారాన్ని కమిషన్‌కు రాతపూర్వకంగా అందించడానికి వీలు కల్పించనుంది. అవసరమైతే బహిరంగ విచారణకు రావాలని వారిని పిలిపించనుంది.

వారికి కూడా..

న్యాయ విచారణలో భాగంగా తొలి దశలో ప్రస్తుత, మాజీ ఉన్నతాధికారులకు మాత్రమే నోటీసులు జారీ చేయాలని కమిషన్ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అవసరమైతే వారిని కమిషన్ ముందు క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని పిలిచే అవకాశం ఉంది. వీరందరినీ విచారించిన అనంతరం లభించే సమాచారం ఆధారంగా.. తదుపరి దశలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్ రెడ్డికి సైతం నోటీసులు జారీ చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుత, మాజీ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు సైతం నోటీసులు జారీ చేసి విచారిస్తామని ఇటీవల జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి మీడియాకు తెలిపారు. 100 రోజుల్లోగా నివేదికను సమర్పించాలని ప్రభుత్వం గడువు విధించడంతో న్యాయ విచారణ ప్రక్రియను కమిషన్ వేగిరం చేసిందని.. వారం రోజులుగా కసరత్తు చేసి బాధ్యులైన అధికారులను, మాజీ అధికారులను గుర్తించిందని జెన్‌కో వర్గాలు తెలిపాయి.

ఈఆర్సీకి అరవింద్ కుమార్ లేఖే కీలకం..

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం రాష్ట్రానికి గుదిబండగా మారనుందని.. ఒప్పందాన్ని ఆమోదించరాదని కోరుతూ నాటి రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ 2016 డిసెంబరులో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి లేఖ రాశారు. దీంతో ఆగ్రహానికి గురైన నాటి ప్రభుత్వం ఆయన్ను మరుసటి రోజే ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా బదిలీ చేసింది. తాజాగా ఆయనకు సైతం విచారణ కమిషన్ నోటీసులు జారీ చేయడంతో ఆయన ఇవ్వనున్న వివరణ నాటి ప్రభుత్వంలోని పెద్దలకు, అధికారులకు ఇబ్బందికరంగా మారే అవకాశముందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

'రాయల్ మెజీషియన్' రాహుల్

- దేశంలోని పేదరికం క్షణాల్లో మాయమవుతుందా..
- కాంగ్రెస్ యువరాజు ఇన్నేళ్లూ ఎక్కడున్నారు?: మోదీ

హోషంగాబాద్/బెంగళూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని క్షణాల్లో నిర్మూలిస్తామంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను దేశం సీరియస్‌గా తీసుకోవడం లేదని ప్రధాని మోదీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన మధ్యప్రదేశ్ రాష్ట్రం హోషంగాబాద్ లోక్‌సభ నియోజక వర్గంలోని పిపారియాలో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగించారు. 'దేశంలో పేదరికాన్ని ఒక్క దెబ్బతో నిర్మూలిస్తానని కాంగ్రెస్ యువరాజు చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉంది. ఈ రాయల్ మెజీషియన్ ఇన్నేళ్లు కనబడకుండా ఎక్కడున్నాడు?' అని రాహుల్ పేరును ప్రస్తావించకుండానే మోదీ వ్యాఖ్యానించారు. '2014కు ముందు పదేళ్ల పాటు రిమోట్ కంట్రోల్‌తో ప్రభుత్వాన్ని నడిపించారు. ఇప్పుడు ఇన్‌స్టంట్ మంత్రాన్ని జపిస్తున్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో వారు నవ్వుల పాలవుతున్నారు. క్షణాల్లో పేదరికం దూరమైపోతుందా?' అని మోదీ నిలదీశారు. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా దేశం రాహుల్‌ను సీరియస్‌గా తీసుకోవడం లేదని ఎద్దేవా చేశారు. 'ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాల మేనిఫెస్టోల్లో అనేక ప్రమాదకరమైన హామీలు ఇచ్చారు. ఒక పార్టీ అయితే దేశాన్ని అణ్వస్త్ర రహితంగా చేస్తామని హామీ ఇచ్చింది. భారత్‌ను కాపాడుకోవాలంటే అణ్వాయుధాలు అవసరం. అవి లేకుంటే దేశాన్ని రక్షించలేం' అని మోదీ స్పష్టం చేశారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ ఎప్పుడూ అవమానిస్తూనే ఉందని, బీజేపీ ప్రభుత్వం మాత్రం ఆయన్ను గౌరవించిందని తెలిపారు. టుకడే టుకడే పార్టీలతో కాంగ్రెస్ జత కట్టిందనీ, స్వదేశంలో భారతమాతకు జై కొట్టాలన్నా అందరి వద్దా అనుమతి పొందాల్సిన దుస్థితి ఆ పార్టీదని కర్ణాటకలోని మైసూరు, మంగళూరుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మోదీ విమర్శించారు. దేశానికి వ్యతిరేకంగా మాట్లాడేవారికే కాంగ్రెస్‌లో టికెట్లు దక్కుతాయన్నారు. మైసూరు సభలో మోదీ మాట్లాడుతూ జేడీఎస్ నేత దేవెగౌడ దేశంలోనే అత్యంత సీనియర్ నాయకుడని కొనియాడారు.

సరబ్జిత్ సింగ్ హంతకుడు అమీర్ సర్ఫరాజ్ కాల్చివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 : భారత్‌కు చెందిన సరబ్జిత్ సింగ్‌పై పాక్ జైల్లో దాడి చేసిన అమీర్ సర్ఫరాజ్‌ను పాకిస్తాన్‌లోని లాహోర్‌లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం కాల్చి చంపారు. పాకిస్తాన్‌లో ఇతడొక అండర్ వరల్డ్ డాన్. భారత్‌లోని పంజాబ్‌కు చెందిన సరబ్జిత్‌ను గూఢచర్యం ఆరోపణలపై 1990లో పాక్ అధికారులు అరెస్టు చేశారు. అయితే ఈ ఆరోపణలను అతడి కుటుంబం, భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. అయినా అతడు పాక్ జైల్లోనే 23 ఏళ్లు ఉండిపోవాల్సి వచ్చింది. భారత్‌లో అఫ్జల్ గురుని ఉరి తీసిన తర్వాత కొద్ది రోజులకు లాహోర్‌లోని కోట్ లక్పత్ జైల్లో ఉన్న సరబ్జిత్(49)పై అదే జైల్లో ఉన్న అమీర్ సర్ఫరాజ్‌తోపాటు మరికొందరు ఖైదీలు 2013 మేలో ఇటుకలతో దాడి చేశారు. దీంతో తలకు తీవ్రగాయాలైన అతడిని లాహోర్‌లోని జిన్నా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించాడు.

దక్షిణ భారత్‌కూ బుల్లెట్ రైలు

'ఒకే దేశం ఒకే ఎన్నిక' నిర్వహిస్తాం.. ఇంటింటికీ నీరు, పైప్‌లైన్‌తో గ్యాస్.. అన్నదాతలందరికీ డ్రోన్లు

- ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం
- మరో ఐదేళ్లు ఉచిత రేషన్ అందిస్తాం
- బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. మళ్లీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఏం చేస్తామో చెబుతూ.. దేశ ప్రగతి, యువత, మహిళలు, పేదలు, రైతులు, కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆ పార్టీ అగ్ర నేతలు ఆవిష్కరించారు. మోదీకి గ్యారెంటీ శీర్షికతో ఉన్న ఈ మ్యానిఫెస్టోను ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో ఆదివారంమోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ దక్షిణాదికీ బుల్లెట్ రైలు సేవలను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర, తూర్పు భారత్‌కూ బుల్లెట్ రైలు వేస్తామన్నారు. దీనిపై త్వరలో సర్వే ప్రారంభం కానుందని పేర్కొన్నారు. శరవేగంగా సాగుతున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు పనులు పూర్తయ్యే దశకు వచ్చాయని.. ఈ అనుభవంతో మిగతా మూడు ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పారు. వందే భారత్ రైలు సేవలను దేశవ్యాప్తం చేస్తామన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని తెలిపారు. ముద్ర పథకం రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని ప్రకటించారు. ప్రతి ఇంటికీ నీరు, పైప్ ద్వారా గ్యాస్ అందిస్తామని హామీ ఇచ్చారు. పీఎం సూర్యఘర్ ద్వారా జీరో పవర్ బిల్‌ను సాకారం చేస్తామన్నారు. మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్ అందిస్తామని



ఉజ్వల యోజన లబ్ధిదారు, బస్తర్‌కు చెందిన లీలావతికి బీజేపీ మ్యానిఫెస్టోను అందిస్తున్న ప్రధాని మోదీ

మోదీ తెలిపారు. ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు పటిష్ఠమైన కొత్త చట్టం తెస్తామన్నారు. వృద్ధులనూ ఆయుష్మాన్ భారత్‌లో చేరుస్తామని, 70 ఏళ్లు దాటిన వారికి రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ఇప్పటికే 4కోట్ల ఇళ్లు కట్టించామని.. మరో 3కోట్ల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు.

నాలుగు స్తంభాలతో సంకల్ప్ పత్ర

పేదలు, యువశక్తి, అన్నదాత, నారీశక్తి- అనే నాలుగు స్తంభాలపై సంకల్ప్ పత్రకు పునాదులు వేశామని మోదీ వెల్లడించారు. పదేళ్లలో ఎంతో ప్రగతిని సాధించామని, 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని అందుకే బీజేపీ మ్యానిఫెస్టో కోసం యావత్ దేశం ఎదురుచూసిందని చెప్పారు. విమానయాన రంగాన్ని ప్రోత్సహిస్తామని, తద్వారా ఆర్థికాభివృద్ధి జరుగుతుందని, ఉపాధి లభిస్తుందని చెప్పారు. అనతికాలంలోనే ఈవీ రంగంలో దేశం దూసుకెళ్తోందని తెలిపారు. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం పెంచుతామని మోదీ చెప్పారు. ప్రతి రైతు ఇంటిపై డ్రోన్లు తిరిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సముద్ర నాచు, ముత్యాల సాగు దిశగా మత్స్యకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. అభివృద్ధికి ఆటంకంగా మారిన అవినీతిని అంతమొందించడానికి ఎంతో చేశామని, భవిష్యత్తులోనూ దీనిని కొనసాగిస్తామని చెప్పారు. అవినీతిపరులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, ఈ యుద్ధం కొనసాగిస్తానని.. 140 కోట్లమందికి ఇది మోదీ గ్యారంటీ అని స్పష్టం చేశారు. 140 కోట్ల మంది ప్రజలను దృష్టిలో పెట్టుకుని మ్యానిఫెస్టోను తయారు చేసామని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. మోదీ గ్యారెంటీ పత్రం 24 క్యారెట్ల బంగారంతో సమానమని కొనియాడారు.

మోదీ గ్యారెంటీలు.. వికసిత లక్ష్యాలు..

మోదీ గ్యారెంటీ, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాలుగా పేర్కొన్న బీజేపీ మ్యానిఫెస్టో తొలి కాపీలను ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన నలుగురికి అందజేశారు. విశ్వబంధు, స్వస్థ భారత్, సురక్షిత భారత్, సుస్థిర భారత్, సమృద్ధ భారత్, సాంకేతిక వికాసం, ప్రపంచ తయారీ కేంద్రం, అత్యుత్తమ శిక్షణ, క్రీడా, సాంస్కృతిక వికాసం, సంతులిత అభివృద్ధి, ఈజ్ ఆఫ్ లివింగ్, సుపరిపాలన అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపరిచారు.

మ్యానిఫెస్టోలోని కీలక అంశాలు

జాతీయ విద్యా విధానం, సీఏఏ అమలు; ట్రాన్స్‌జెండర్లకూ ఆయుష్మాన్ భారత్; వందేభారత్ స్లీపర్, చైర్ కార్, మెట్రో రైల్ సర్వీసుల ప్రారంభం; 2036లో ఒలింపిక్స్ నిర్వహణ పీఎం ఆవాస్ యోజనలో దివ్యాంగులకు ప్రాధాన్యం; యువతకు మౌలిక సదుపాయాల కల్పన, వస్తు తయారీ, అంకుర పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులకు ప్రాధాన్యం; 3కోట్ల మంది మహిళలను లక్షాధికారుల చేసే లక్ష్యం; ఈశాన్యంలో సైన్యానికి ప్రత్యేకాధికారాల చట్టం క్రమంగా ఎత్తివేత; ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా గిగ్ వర్కర్లు, ట్యాక్సీ, ఆటో, ట్రక్కు డ్రైవర్లకు సంక్షేమ పథకాలు; తిరువళ్లూర్ కల్చరల్ సెంటర్ ద్వారా భారత సంస్కృతిని ప్రపంచ దేశాలకు పరిచయం చేయడం; ఉన్నత విద్యాసంస్థల్లో భారతీయ భాషల అధ్యయనానికి తోడ్పాటు; ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి ప్రయత్నం; ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా శాటిలైట్ పట్టణాలు; ఏకలవ్య పాఠశాలలు, పీఎం జన్‌మన్ పథకాలకు ప్రాధాన్యం; అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం.

నిరుద్యోగం కనపడలే.. ద్రవ్యోల్బణం వినపడలే

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

దేశ ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అనే అంశాలు బీజేపీ మ్యానిఫెస్టోలో లేనే లేవని, మోదీ ప్రసంగంలోనూ వినపడలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. ఈమేరకు ఆయన ట్వీట్ చేశారు. ఈ రెండు అంశాలపై చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని విమర్శించారు. యువత ఈసారి మోదీ వలలో పడదని, ఉపాధి విప్లవం రాబోతోందని వ్యాఖ్యానించారు. కాగా, మోదీ గ్యారెంటీ ఒక జుమ్లా అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. యువతకు ఏటా 2కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతు ఆదాయం రెట్టింపు చేశారా? అని నిలదీశారు. దక్షిణాదికీ బుల్లెట్ రైలు అంటున్నారని.. మొదటి బుల్లెట్ రైలే ఇంకా పట్టాలెక్కలేదని ఎద్దేవా చేశారు.

13 ఏళ్ల అబ్బాయి.. నాన్నమ్మను పొడిచాడు

- తల్లితో తరచూ గొడవ పడుతోందనే ఆగ్రహంతోనే
- ఛాతీలో తీవ్రగాయం.. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి

జఫర్‌గఢ్, ఏప్రిల్ 14: ఆ బాబు వయసు 13 ఏళ్లు. తల్లితో నానమ్మ తరచూ గొడవపడుతుండటంతో క్షణికావేశంలో ఘోరానికి పాల్పడ్డాడు. కత్తితో నానమ్మను పొడిచాడు. జనగామ జిల్లాలోని జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో ఈ ఘోరం జరిగింది. తీవ్ర రక్తస్రావంతో ఆ వృద్ధురాలు ఆస్పత్రికి తరలిస్తుండగానే కన్నుమూసింది. ఉప్పుగల్లు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు పదేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి మృతుడి భార్య, తన ఇద్దరు కుమారులతో వృద్ధులైన అత్తామామల వద్దే ఉంటోంది. ఈ ఇంట్లోని వారు ఉన్న కొంత భూమిలో వ్యవసాయ పనులు చేసుకుంటూనే కూలీ పనులకు వెళుతున్నారు. కొన్నాళ్లుగా కుటుంబసమస్యలపై అత్త, కోడలి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా ఇద్దరూ పరస్పర దూషణలతో తీవ్రంగా గొడవపడ్డారు. ఇదంతా చూసిన వృద్ధురాలి చిన్న మనుమడు నానమ్మ మీద కోపంతో కత్తితో ఆమె ఛాతీపై పొడిచాడు. తీవ్రగాయంతో కుప్పకూలిన ఆమెను అదేరాత్రి హనుమకొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడు పరారీలో ఉన్నాడని తెలిపారు.

అతి వేగానికి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల బలి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అతివేగానికి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు బలయ్యారు. ఔటర్ రింగురోడ్డుపై కారు డివైడర్‌ను ఢీకొని, పల్టీలు కొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. ఈ ఘోర ప్రమాదం ఆదివారం తెల్లవారుజామున హిమాయత్‌సాగర్ వద్ద ఔటర్ రింగురోడ్డుపై జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన గౌతంసాయి(24), ఆనంద్(31) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. గచ్చిబౌలిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్న వీరు.. అదే ప్రాంతంలోని హాస్టల్‌లో ఉంటున్నారు. వారితో పాటు తనూజ, ప్రకాశ్, సూర్యతేజ శనివారం సాయంత్రం పీవై04ఎ8222 నంబరు కారులో గచ్చిబౌలి నుంచి శంషాబాద్‌లోని గేమింగ్ జోన్‌కు వెళ్లారు. తెల్లవారు జామున తిరిగి వస్తుండగా.. ఔటర్‌పై సూర్యతేజ కారు నడుపుతున్నాడు. వేగంగా నడపడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని, పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో గౌతంసాయి, ఆనంద్ అక్కడికక్కడే చనిపోయారు. తనూజ, ప్రకాశ్, సూర్యతేజ తీవ్రంగా గాయపడ్డారు.

'నీట్'కు చదవలేకపోతున్నానని ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) కోసం సరిగా చదవలేకపోతున్నానన్న ఆందోళనతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి స్నేహితుల గ్రూప్‌లో మెసేజ్ పెట్టి అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వారాణసీకి చెందిన అరవింద్ జెస్వాల్ బతుకుతెరువు కోసం కుటుంబంతో కలిసి హైదరాబాద్ వచ్చాడు. కుత్బుల్లాపూర్ స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలోని చంద్రహాస్ అపార్ట్‌మెంట్ 501 నంబరు ఫ్లాట్‌లో నివాసం ఉంటూ జీడిమెట్లలో టైలరింగ్ పనిచేస్తున్నాడు. అతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు పుష్ జెస్వాల్ (22) 2021లో ఇంటర్మీడియట్ పూర్తిచేశాడు. గతంలో రెండుసార్లు నీట్ రాశాడు. అనుకున్న ర్యాంక్ రాకపోవడంతో ప్రస్తుతం లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాడు. వచ్చే నెల 5న నీట్ రాయాల్సి ఉంది. ఆదివారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఐపీఎల్ మ్యాచ్ చూశాడు. తర్వాత అందరితో పాటు నిద్రకు ఉపక్రమించాడు. నీట్‌కు సరిగా చదవలేకపోతున్నానని, ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ గ్రూప్‌లో స్నేహితులకు మధ్యరాత్రి వేళ మెసేజ్ పెట్టాడు. ఆ మెసేజ్ చూసిన స్నేహితులు అతని తల్లి మీనాకు సమాచారం ఇచ్చారు. పుష్ జెస్వాల్ గదిలో కనిపించకపోవడంతో తల్లిదండ్రులు బాల్కనీలోకి వచ్చి చూశారు. అతను 5వ అంతస్తు నుంచి దూకి అప్పటికే కిందపడి ఉన్నాడు. 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి, అతను మృతిచెందాడని తెలిపారు. అతని గదిలో దొరికిన సూసైడ్ నోట్‌లో నీట్ పరీక్షలకు సరిగా చదవలేకపోతున్నానని రాసి ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రఘునాథపల్లి (జనగామ జిల్లా), ఏప్రిల్ 14 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన రఘునాథపల్లి మండలంలోని నిడిగొండ బ్రిడ్జి వద్ద వరం గల్- హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధ రాత్రి జరిగింది. మండలంలోని మేకలగట్టు గ్రామానికి చెందిన ఇల్లెందుల యాదగిరి-పుష్ప దంపతుల కుమారుడు శ్రీధర్ (26) హైదరాబాద్ నుంచి మోటారు సైకిల్‌పై మేకలగట్టుకు వస్తుండగా, నిడిగొండ బ్రిడ్జి వద్ద హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సెమిలగ్జరీ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో మోటారు సైకిల్ నడుపుతున్న శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.